₹ 10/-

జనరాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి-2 సంచిక - 1 పక్షపత్రిక జనవరి 1-15, 2011




- స్వామి వివేకానంద
(జనవరి 12 జయంతి)
దేశంలో ఎంత సంపద ఉన్నా, ఎన్ని వనరులు ఉన్నా, పభుత్వాలు ప్రజల కోసం ఎన్ని పథకాలు రూపొందించినా, వాటిని చిత్తశుద్ధితో అమలు చేసే నిజాయితీపరులయిన వ్యక్తులు లేకపోతే అవన్నీ వృథా అవుతాయి. కనుక మనం నిజాయితీపరులను తయారు చేసుకోవాలి



మనకు చాలా దగ్గరలో ఉన్న లేదా అందుబాటులో వున్న కర్తవ్యాన్ని చక్కగా నిర్వహించడం వల్ల మనం బలశాలులం అవుతాం ! ఇలా క్రమంగా బలాన్ని వృద్ధి చేసుకుంటూ పోతే, సంఘానికి ఉపయోగపడతాం

– స్వామి వివేకానంద

## లోపలి పేజీల్లో...


రైతును స్వేచ్ఛగా అమ్ముకోనివ్వండి................5
పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం...................7
అవినీతిపై అస్త్రం........................................ 9
అవినీతి వ్యతిరేక ప్రచారోద్యమం...................10
నరకాలుగా మారుతున్న నగరాలు............... 11
సూక్ష్మఋణాలు..........................................14
మనకి ఎంత విద్యుత్ కావాలి.......................15
రంగా మారిన ధాన్యం కొనుగోలు చేయాలి....21
హింసను ప్రోత్సహిస్తే నష్టపోయేది ఉద్యమాలే..21
అవినీతిపై పోరాడదాం................................ 22
సంజీవని...................................................23
రైతు సమస్యలపై దీర్ఘకాల పోరాటం.............24
యువతతోనే అవినీతి అంతం.......................25
పౌరసేవాకేంద్రం........................................26
యువత – భవిత – చట్టాలు........................ 27
పట్టణం యూనిట్‌గా యువసత్తా.................. 28
యూత్ ఫర్ బెటర్ ఇండియా...................... 28
రాజకీయ కేంద్రబిందువు లోక్‌సత్తా ఎజెండా..29
విద్యార్థిసత్తా భవిష్యత్ కార్యాచరణ................31
జిల్లాల సమాచారం..................................32


# చట్టసభలున్నది చర్చించేందుకే

## స్థంభింప చేసేందుకు కాదు

**సంపాదకీయం**

నియంతృత్వాలున్న దేశాల్లో సైనిక పాలకులు, నియంతలు చట్టసభలకు తాళాలేస్తుంటే, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా పేరొందిన భారతదేశంలో ఎన్నికైన ప్రభుత్వం, ప్రతిపక్ష రాజకీయ పార్టీలే చట్టసభల్లో చర్చలు లేకుండా స్తంభింపచేస్తూ తాళాలు వేస్తున్నాయి. "చట్టసభ ప్రజల అధికారానికి ప్రతీకగా ఉండే ప్రజాస్వామ్య పీఠం. 23రోజుల పాటు సభాకార్యక్రమాలు స్తంభించి లోక్‌సభ శీతాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడిన తీరు పార్టీలకతీతంగా ఆందోళనకరం. సమస్యలపై చర్చ నుంచి తప్పించుకునేందుకు ప్రభుత్వం చట్టసభల సమావేశాలు జరిపే రోజుల సంఖ్యను కుదిస్తుంటే, ప్రతిపక్షపార్టీలు కూడా సరైన వాదనల్ని లేవనెత్తే సత్తా లేక వాకౌట్లు, సభను స్తంభింపచేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో చట్టసభల్ని స్తంభింపచేస్తే నష్టపోయేది ప్రతిపక్షాలు, ప్రజలే. దేశంలో, రాష్ట్రంలో పాలక, ప్రతిపక్షాలు ఏవైనా... ప్రజలకు ప్రాతినిధ్యం వహించటం, చట్టాలను చేయటం, సమస్యలపై నిర్మాణాత్మకంగా చర్చించటం అనే అసలైన బాధ్యతల్ని వదిలేసి వీధుల్లో జరిగే అన్నిరకాల ఆందోళనలకూ ఇప్పుడు చట్టసభలనే కేంద్రంగా చేసుకోవటం దురదృష్టకరం.

2–జీ స్పెక్ట్రం కుంభకోణం వల్ల దేశం నష్టపోయిన వేలకోట్ల రూపాయలను ఎలా తిరిగి తీసుకురావాలి, మళ్లీ అలాంటి అవినీతి కలాపాలు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే కీలకమైన చర్చను వదిలేసి కేవలం జేపీసీ అనే పైపై డిమాండ్ చుట్టూ అటు ప్రభుత్వం, ఇటు ప్రతిపక్షాలు లోక్‌సభను స్తంభింప చేయటం స్వార్థ రాజకీయ క్రీడలో భాగమే. గతంలో కుంభకోణాలపై జేపీసీలు వేసినా దేశంలో అవినీతి ఆగలేదు. జేపీసీ ప్రధాన పరిష్కారం కాదని తెలిసినా పార్టీలు ఆ అంశం చుట్టూనే చర్చను తిప్పటం అర్థరహితం. ప్రభుత్వం సరిగా స్పందించకపోతే ప్రతిపక్షాలు బైట మరోరూపంలో తమ ఆందోళనాకార్యక్రమాల్ని కొనసాగించి ఉండాల్సింది. రాజ్యాంగంలో పేర్కొన్నారు కాబట్టి తప్పదు అన్నట్టు చట్టసభల్ని అసలే మొక్కుబడిగా నిర్వహిస్తున్న ప్రభుత్వం... ఈ సాకుతో వ్యవసాయ సంక్షోభం సహా కీలక సమస్యల్ని గాలికొదిలేసి సభాకార్యక్రమాల నుంచి తప్పించుకుంది. వారసత్వ దోపిడీ వ్యాపారంగా మారిన రాజకీయాల పట్ల ఇప్పటికే ఏహ్యభావంతో ఉన్న ప్రజలు చట్టసభల పట్ల కూడా గౌరవాన్ని కోల్పోతే ప్రజాస్వామ్య వ్యవస్థ ఉనికికే ప్రమాదం ఏర్పడుతుంది.❏

**నిద్రపోయి కలగన్నాను.. బతుకంతా సుందరమని ! మేలుకొని కలగన్నాను... బతుకు ఓ పెద్ద బాధ్యతని**

– ఇ.ఎన్.హూవర్

# లోక్‌సత్తా టైమ్స్ - కొత్త రాజకీయ పక్షపత్రిక

జనవరి 1-15, 2011 సంపుటి - 2 సంచిక - 1

ప్రధాన సంపాదకులు : డా॥ జయప్రకాష్ నారాయణ్

సంపాదకవర్గం : జి. రాజారెడ్డి
సి.హెచ్. మాధవరావు
గరిమెళ్ళ నారాయణ
కె.వి. కుటుంబరావు

వర్కింగ్ ఎడిటర్ : కొంగర గంగాధర రావు

ప్రచురణ కర్త : డా॥ జయప్రకాష్ నారాయణ్
ఫ్లాట్ నం. బి 504, పాషాకోర్టు, సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082
ముద్రణ : కళాజ్యోతి ప్రాసెస్ ప్రై. లి., 1-1-60/5, ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్, హైదరాబాద్

పోస్ట్ బాక్స్ నెంబర్ 100, హైదరాబాద్ - 500 004


# స్పందన

## తల్లీ నీకిది తగునా !!

హైదరాబాద్ మలక్‌పేట ప్రభుత్వ పరియా ఆసుపత్రి. ఆయా. ఇద్దరు బిడ్డలు. ఇద్దరు తల్లులు. తల్లులిద్దరు పోట్లాడుకుంటున్నారు. ఓ బిడ్డ నాదంటే నాదని. మరో బిడ్డని ఇద్దరు తల్లులు నాది కాదంటున్నారు. కారణం నాదంటే నాదని పోట్లాడుకుంటున్న బిడ్డ మగబిడ్డ. నాది కాదంటే నాది కాదంటున్న బిడ్డ ఆడబిడ్డ. తప్పు ఆయాదే. మగబిడ్డ పుట్టిన తల్లికి తెలుసు. అంతకు ముందే తనకు మగబిడ్డ పుట్టిందని చెప్పారు. తీరా ఆడబిడ్డని తీసుకువచ్చి ఇచ్చేసరికి ఆమె పోట్లాడుతోంది. ఆడబిడ్డ పుట్టిన తల్లికి తెలియదు. కాని మగబిడ్డను తెచ్చిచ్చి తరువాత ఈ బిడ్డ నీబిడ్డ కాదంటే ఆమె పోట్లాడుతోంది. వెరసి ఇద్దరు తల్లులకు ఆడబిడ్డ అక్కరలేదు.

ఇక్కడ వాళ్ళు మా బిడ్డేదో తేల్చమని పోట్లాడుకోవట్లేదు. మగ బిడ్డ మా బిడ్డ అంటే మా బిడ్డ అని పోట్లాడుకుంటున్నారు. ఆడబిడ్డ మాది కాదంటే మాదికాదు పొమ్మంటున్నారు. వారి వారి కుటుంబ సభ్యులు వారికి వత్తాసుగా బరిలోకి దిగారు. ఇదీ మనం ఎంతో ఎదిగామనుకుంటున్న ఆధునిక భారతంలో 2010 డిసెంబరు 16 నాటి ఘటన.

సమాజంలో ఇంకా ఎందుకీ వివక్ష. తల్లులు ఆడవారై కూడా ఎందుకు ఆడపిల్లలను వద్దనుకుంటున్నారు? ఎన్నాళ్ళీ అరాచకం? ఆడపిల్ల ప్రతీ ఇంటి మహాలక్ష్మిగా భావించే రోజు ఎప్పటికి వస్తుంది?

మీరూ రాయండి : లోక్‌సత్తా టైమ్స్ మీ పత్రిక. పత్రికలో మీకు నచ్చినవీ, నచ్చనివీ, కోరుకుంటున్నవీ... ఏవైనా మాకు ప్రతినెలా 5వ, 20వ తేదీల్లోగా తెలియజేయండి. కొత్త రాజకీయానికి ప్రజల్ని కేంద్రబిందువుగా తీర్చిదిద్దేందుకు ఈ పత్రికను ఉపయోగించుకోండి.

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పక్షపత్రిక ఎటువంటి భావజాలంతో వెలువడుతుందో మీ అందరికీ తెలుసు, ఇందుకు అనుగుణమైన రచనల్ని ఎవరైనా నేరుగా పత్రిక చిరునామాకు పంపవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | కలర్ |
|---|---|---|
| 1/8 పేజీ (వి కార్డు) | రూ॥ 1000 | రూ॥ 1500 |
| 1/4 పేజీ | రూ॥ 2000 | రూ॥ 3000 |
| సగం పేజీ | రూ॥ 4000 | రూ॥ 6000 |
| పూర్తి పేజీ | రూ॥ 8000 | రూ॥ 12000 |
| సెంటర్ స్ప్రెడ్ | రూ॥ 12000 | రూ॥ 18000 |
| బ్యాక్‌పేజి | - | రూ॥ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | రూ॥ 15000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | రూ॥ 12000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.
- దయచేసి మీ ప్రకటనలు ప్రతినెలా 5వ, 20వ తేదీల్లోగా పంపించగలరు.
- ప్రకటన రుసుము ముందుగానే చెల్లించగలరు

## మీ ఫీడ్‌బ్యాక్ పంపవలసిన చిరునామా

ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,
ఇం. నం. 5-10-180/ఎ&ఎ1, బ్యాండ్‌లేన్స్
హిల్‌ఫోర్ట్ రోడ్, హైదరాబాద్ - 500 004
ఫోన్: 040-2323 1818
loksattatimeslsp@gmail.com

## లోక్‌సత్తా టైమ్స్ చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. లోక్‌సత్తా టైమ్స్ అభిమానులకు, పార్టీ సభ్యులకు ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందిస్తుంది. మీ దగ్గరలోని లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యాలయాలను గాని, హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయాన్ని గాని సంప్రదించగలరు. ఫోన్: 040-2323 1818.

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ- మెయిల్ చెయ్యవచ్చు.

విడి ప్రతి : రు. 10
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500


బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి
డి.టి.పి : టి. జ్యోతి
ఫోటోలు : ఎన్. సంజీవ్ కుమార్

# రైతును స్వేచ్ఛగా అమ్ముకోనివ్వండి

**వ్యవసాయోత్పత్తుల్ని రైతు ప్రపంచంలో డిమాండ్ ఉన్నచోట స్వేచ్ఛగా అమ్ముకోనివ్వండి లేదా ఆ ధర మీరే ఇవ్వండి**

**రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు తేల్చిచెప్పిన జేపీ రైతుల్ని దెబ్బతీస్తే ప్రభుత్వాల పతనం తప్పదని హెచ్చరిక**

రైతుల సమస్యలపై అసెంబ్లీలో జరిగిన చర్చలో జయప్రకాష్ నారాయణ్ పాల్గొంటూ, కేంద్రంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలు గత కొన్నేళ్లుగా అనుసరించిన విధానాల వల్లే రైతులు నాశనమయ్యారని, పనిగట్టుకుని ప్రభుత్వాలు వ్యవసాయాన్ని దెబ్బతీశాయని స్పష్టంచేశారు. జేపీ ప్రసంగంలోని ముఖ్యాంశాలు...

"అంతర్జాతీయ మార్కెట్‌కు వ్యవసాయోత్పత్తుల ఎగుమతుల్ని నిషేధించటం లేదా పరిమితం చేయటం ద్వారా రాష్ట్రంలో, దేశంలో రైతుల్ని నాశనం చేయవద్దు. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) లో చేరేటప్పుడు పార్లమెంటుకు ఇచ్చిన అధికారిక హామీని ఉల్లంఘించవద్దు.

రాష్ట్రప్రభుత్వం తన గొయ్యి తాను తీసుకోవాలనుకుంటేనే రైతుల్ని, కౌలుదారుల్ని విస్మరించగలదు. ఆంధ్రప్రదేశ్‌లో 1కోటీ 20లక్షలమంది రైతులు, 60లక్షలమంది కౌలుదారులు ఉన్నారు. వారిలో కనీసం 3.6కోట్ల మంది ఓటర్లుగా ఉంటారు. కులాన్ని, పంటను, ప్రాంతాన్ని, పార్టీల్ని అధిగమించి వారంతా ఏకమైతే కేవలం 24గంటల్లో వ్యవసాయ విధానాలు రైతుకు లాభసాటిగా, దేశ ఆర్థికాభివృద్ధికి దోహదం చేసేలా మారిపోతాయి.

ప్రపంచవ్యాప్తంగా పత్తి ఉత్పత్తి తగ్గటం వల్ల భారతీయ రైతులకు ఎగుమతుల వల్ల మంచి ధర వచ్చే అవకాశమున్న తరుణంలో పత్తి ఎగుమతుల్ని నిలుపుచేయాలని, ధరల్ని తగ్గించాలని తమిళనాడు ముఖ్యమంత్రి కేంద్రానికి లేఖ రాసి ఒత్తిడి తేవటాన్ని నిర్దిష్ట సాక్ష్యంగా ప్రస్తావిస్తూ పత్తి ఎగుమతుల్ని నిలిపివేయటం వల్ల నష్టపోయే పరిస్థితిలో ఉన్న పత్తి రైతును ఆదుకునేందుకు పత్తిని ఎక్కువగా ఉత్పత్తి చేసే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్‌కు చెందిన పార్లమెంటు సభ్యులు ఏకమై పోరాడాల్సుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తికున్న రూ.8,000 మన పత్తి రైతుకు కూడా ఇవ్వాల్సిందే. "రైతును అంతర్జాతీయ మార్కెట్‌కు ఎగుమతి చేసుకుని లాభం తెచ్చుకోనివ్వండి. ఎగుమతులు వద్దంటే మీరే అంతర్జాతీయ మార్కెట్ ధరను చెల్లించి పత్తిని కొనుగోలు చేయండి".

క్వింటాలు ధాన్యం ఉత్పత్తికి సుమారు రూ.1281 ఖర్చవుతుందని సీఏసీపీ (కమిషన్ ఫర్ అగ్రికల్చరల్ కాస్ట్ అండ్ ప్రొడక్షన్స్)కి ఇచ్చిన నివేదికలో ప్రభుత్వమే స్వయంగా పేర్కొంది. అందువల్ల ధాన్యానికి ఇప్పుడిస్తున్న మద్దతుధర (ఎం.ఎస్.పి)కి తప్పనిసరిగా రూ.500 కలిపి కొత్త మద్దతు ధరను ప్రకటించాలి. బాస్మతేతర బియ్యానికి అంతర్జాతీయ మార్కెట్లో భారీ డిమాండ్ ఉన్నా ఎగుమతుల్ని నిషేధించటం ద్వారా రైతులకు మంచి ధర రాకుండా భారత ప్రభుత్వం దెబ్బతీస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో బీపీటీ 5204కు విదేశాల్లో విపరీత గిరాకీ ఉన్నా, మన వద్ద నిల్వలు పెద్దఎత్తున ఉన్నా గత మూడేళ్లుగా ఎగుమతుల్ని చేయనీయకుండా రాష్ట్రప్రభుత్వం రైతుల్ని తీవ్రంగా దెబ్బతీసింది. రాష్ట్రంలో ప్రభుత్వమే బలవంతంగా పామాయిల్ పంటను రైతుల చేత వేయించి ఇప్పుడు విదేశాల నుంచి ఎటువంటి సుంకం లేకుండా దిగుమతి చేసుకోవటమేకాకుండా టన్నుకు రూ.16,000 సబ్సిడీ కూడా ఇవ్వటంతో మన రాష్ట్రంలో పామాయిల్ రైతులు ధర కోల్పోయి తీవ్రంగా నష్టపోయారు. భూమి విలువ కాకుండా లక్షన్నర విలువ చేసే పంటను రూ.25,000 చెల్లించి మరీ తెగనరుక్కుంటున్నారు. భారత రైతుల బలిచేస్తూ విదేశాల్లోని పామాయిల్ రైతుల ప్రయోజనాలను కాపాడాలనుకుంటున్నారా? పామాయిల్ రైతులకు ఇవ్వాల్సిన రూ.60కోట్ల రాయితీ బకాయిల్ని వెంటనే విడుదల చేయాలి. పామాయిల్ దిగుమతులపై కనీసం 10శాతం సుంకం విధించి ఆ డబ్బును రైతులకు పంచాలి.

ఫంగేషియస్ చేప విషయంలో కూడా అలాగే చేస్తూ మన మత్స్యకారులకు ధర రాకుండా వియత్నాం, బంగ్లాదేశ్ వారికి లాభం చేకూరుస్తున్నారు. రైతులు తీవ్ర కూలీసిబ్బంది కొరతను ఎదుర్కొంటున్న తరుణంలో జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తుండటం తప్పు. అవసరాన్ని బట్టి ప్రతి పంటకూ కొన్ని రోజుల్ని ఉపాధి హామీ పథకంలో కేటాయించి, ఆ పథకాన్ని వ్యవసాయంతో అనుసంధానించి రైతుల్ని ఆదుకోవాలి. వ్యవసాయదారుల్లో కౌలురైతులు, రైతులు, రైతు కూలీల మధ్య పెద్దగా భేదం లేదు. అందువల్ల ఆ పథకాన్ని వ్యవసాయానికి అమలు చేయటం వల్ల పేదరికం తొలగి గ్రామీణ ప్రాంతాలు బాగుపడతాయి.

వ్యవసాయంలో తక్షణ, దీర్ఘకాలిక చర్యలు కేవలం రైతుకు కాకుండా గ్రామీణ ఆర్థికవ్యవస్థను బాగుచేసేందుకు అత్యవసరం. వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాల్లో ఉన్న వారి (జనాభాలో 65శాతం) తలసరి ఆదాయం రూ.15,000 ఉంటే, వ్యవసాయేతర రంగాల్లో ఉన్న 35శాతం ఆదాయం రూ.105,000 ఉంది. ఇవే విధానాలను కొనసాగిస్తే ఇప్పుడు ఏడురెట్లుగా ఉన్న ఆ అంతరం 2020 నాటికి 15రెట్లుకు పెరుగుతుంది. అటువంటి

తీవ్రస్థాయి అంతరం వల్ల సామాజిక కల్లోలం, రాజకీయ అస్థిరత, ఆర్థిక మాంద్యం తలెత్తుతాయి. ఆర్థికవ్యవస్థలోని ఇతర రంగాలకు భిన్నంగా వ్యవసాయంపై ప్రభుత్వం తన భల్లూకపు సంకెళ్లని కొనసాగిస్తుండటం వల్ల మందగమనంతో సాగుతూ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

రైతు ఉత్పత్తులకు లాభసాటి ధరను ఇవ్వటం ద్వారా మాత్రమే రైతు జీవితాల్ని ప్రభుత్వం బాగుచేయగలదు. వ్యవసాయోత్పత్తులకు ధరలు పెంచటం వల్ల ఈ దేశంలో ఒక్కరు కూడా ఆత్మహత్య చేసుకోలేదు. అదే సరైన ధర రాక దేశవ్యాప్తంగా గత పదేళ్లలో మూడు లక్షలమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ప్రభుత్వాల తీరు వల్ల గ్రామాలు వల్లకాడులవుతూ ప్రజలు పొట్ట చేతపట్టుకుని పట్టణాలకు వలస వస్తున్నారు. **"శాసనసభ్యుల్లో ఎంతమంది వ్యవసాయం చేస్తున్నారు? తమ పిల్లల్ని వ్యవసాయం చేసేందుకు ప్రోత్సహిస్తారా?".**

## 30శాతం దెబ్బతిన్నా కొనుగోలు చేయాలి... ఉప్పుడు బియ్యం ఎగుమతులకు వెంటనే ఏర్పాట్లు చేయాలి

అసాధారణ, భారీ వర్షాల వల్ల ప్రస్తుత ఖరీఫ్ కాలంలో రాష్ట్రంలో దాదాపు అన్ని పంటలకూ నష్టం వచ్చింది. 2003లో చేసినట్టు 30శాతం వరకూ దెబ్బతిన్న ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నిబంధనల్ని సడలింపచేయాలి. అలా కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎఫ్.సి.ఐ వేలం వేస్తే లాభం వచ్చింది తప్ప నష్టం రాలేదు. టన్ను ఆహారధాన్యం నిల్వకు ఏటా రూ.3700 ఖర్చు చేస్తున్న ఎఫ్.సి.ఐకి ప్రస్తుతం తడిసిన ధాన్యం కొనుగోలు వల్ల ఎటువంటి నష్టం రాదు. ధాన్యం, బియ్యంపై వివిధ పన్నులు, సుంకాల ద్వారా దాదాపు రూ.1500కోట్లు వసూలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం... ధాన్యం క్వింటాలుకు కనీసం రూ.200 బోనస్‌ను ప్రకటించాలి. చెరకు సలహాధరను వెంటనే ప్రకటించాలి. రబీకి కావలసిన తేమ నేలలో ఉన్నందున హెక్టారుకు రూ.10,000 ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలి. రైతుల ప్రయోజనాలకు ఇబ్బందిలేకుండానే కౌలురైతు చట్టాన్ని సవరించి కౌలుదారులకు కూడా రుణాలు, సబ్సిడీలు, పంట ఇన్సూరెన్స్ తదితరాలు అందేలా చూడాలి.

రైతుల ఆందోళనలతో చాలా ఏళ్ల తర్వాత ధాన్యం, బియ్యం ఎగుమతులపై దేశీయంగా నిషేధాన్ని ఎత్తివేస్తూ రాష్ట్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని నీళ్ళు కారుస్తూ మళ్లీ ఆ స్వేచ్ఛావాణిజ్యంపై పౌరసరఫరాల శాఖ 1.5లక్షల టన్నుల సీలింగ్ విధించి, డిసెంబర్ 31వరకూ గడువు పెట్టింది. రైతు తన ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లోకి సైతం ఎగుమతులు చేసుకునేందుకు శాశ్వత ఏర్పాటు ఉండాలి. ప్రపంచ మార్కెట్లో భారీ ధర ఉన్న బీపీటీ బియ్యాన్ని ఎగుమతి చేసేందుకు వెంటనే భారత ప్రభుత్వం అనుమతినివ్వాలి. రాష్ట్రంలో తడిసిన ధాన్యాన్ని ఉప్పుడు బియ్యంగా డిమాండ్ ఉన్న దక్షిణాఫ్రికా, పశ్చిమాఫ్రికా దేశాలకు, బంగ్లాదేశ్‌కు ఎగుమతి చేసేందుకు చర్యలు చేపట్టాలి. ఉప్పుడు బియ్యం గోదాముల్లో మూలుగుతున్నా పట్టించుకోకుండా ఎగుమతులపై మనం నిషేధం విధించటం వల్ల మన మార్కెట్‌ను ఆగ్నేయాసియా దేశాలు కొన్ని కొట్టేస్తున్నాయి. తిరిగి ఆ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవాలి. మార్కెట్‌యార్డుల్లో, ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో ప్రభుత్వం ఇచ్చే కనీస ధరకే ఉత్పత్తుల్ని అమ్ముకునేందుకు వచ్చిన రైతులు రోజుల తరబడి ఎదురుచూసే పరిస్థితి ఉంది. ప్రభుత్వం రైతుల నుంచి వసూలు చేస్తున్న మార్కెట్ సెస్సుతోనే యార్డుల్లో మరుగుదొడ్లు, ప్రహరీగోడలు కట్టించాలి. డ్రైయర్లు, వే మిషన్లను ఏర్పాటు చేయాలి.

కృష్ణా నదికి గత ఏడాది 25లక్షల క్యూసెక్కుల మేర వరద వచ్చినా ప్రభుత్వం ఇప్పటికీ కరకట్టల బలోపేతానికి నిర్దిష్టచర్యలు చేపట్టలేదు. గతంలో ప్రధానమంత్రికి వినతిపత్రం ఇవ్వటంతో స్పందించిన కేంద్రప్రభుత్వం కరకట్టల బలోపేతానికి రాష్ట్రం నుంచి నిర్దిష్ట ప్రతిపాదనలు వస్తే తగిన నిధుల్ని ఇస్తానని లిఖితపూర్వక హామీనిచ్చింది. ఆ విషయాన్ని ఆగస్టులోనే ముఖ్యమంత్రికి తెలిపినా ఇంతవరకు అతీగతీలేదు. ఇప్పుడు 15లక్షల క్యూసెక్కులను తట్టుకునేలా కరకట్టల నిర్మాణానికి ప్రయత్నిస్తామంటూ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. తట్టెడు మట్టి తీయకుండా, దోసెడు నీరు తేకుండా కేవలం ప్రాజెక్టు డిజైన్ కోసమే రూ.1000కోట్లు అప్పనంగా ఇచ్చేసిన ప్రభుత్వం వెలగబెడుతున్న మరో నిర్వాకమిది. కరకట్టల విషయంలో సరైన చర్యలు చేపట్టకపోతే కర్నూలు, మహబూబ్‌నగర్, నల్గొండ, కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని రైతులకు, గ్రామాలకు ప్రమాదం ఎప్పుడూ పొంచిఉంటుంది.

రైతును కాకుండా గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని పంట ఇన్సూరెన్స్‌ని అమలుచేయటంలోని హేతుబద్ధత ఏమిటి? వేరుసెనగ పంట తీవ్రంగా నష్టపోయిన అనంతపురం జిల్లాలోని సుమారు 300 గ్రామాల రైతులు దీనివల్ల నష్టపోయారు. కార్లకు, మనుషులకు వ్యక్తి యూనిట్‌గా ఇన్సూరెన్స్‌ని కంపెనీలు ఇస్తున్నప్పుడు రైతుల విషయంలో ఎందుకిలా జరుగుతోంది? బ్యాంకు రుణం తీసుకున్నవారందరి వద్దా పంట ఇన్సూరెన్స్‌ని బలవంతంగా కూడా వసూలుచేస్తున్న బ్యాంకులు ఆ ప్రీమియంను ఇన్సూరెన్స్ కంపెనీలకు కట్టకపోయిన సందర్భాలు కూడా అనేకం ఉన్నప్పుడు ఆ నిబంధనలోని ఔచిత్యమేమిటి?" ❑

- **తాము మంచిగా వుంటూ ఇతరులకింత ఉపకారం చేయాలనుకునే వారికి నీవంతు సహకారం అందించు**
- **మీ గౌరవ మర్యాదలు పెరగాలంటే మంచి గుణాలున్న వారి సాంగత్యాన్ని పెంచుకోండి చెడు సహవాసం చేయడం కంటే, ఒంటరిగా ఉండటమే మంచిది** – స్వామి వివేకానంద

# లోక్‌సత్తా పార్టీ

## రాష్ట్ర కార్యవర్గ సమావేశం 2010 డిసెంబరు 18-19

లోక్‌సత్తా పార్టీని బలోపేతం చెయ్యడానికి గత మూడు నాలుగు నెలలుగా గట్టి ప్రయత్నాలు చేస్తున్నాం. మనం చిన్న లక్ష్యాలు పెట్టుకున్నా వాటిని పరిపూర్తి చెయ్యడంలో అంతరాలు కనిపిస్తున్నాయి. మాటలకీ చేతలకీ మధ్య కొంత అగాధం కనిపిస్తున్నది. ఒక రాజకీయ పార్టీగా మనం నిలదొక్కుకోవాలంటే దీనిని అధిగమించి తీరాలి.

పార్టీని బలోపేతం చెయ్యడానికి మనం రూపొందించుకున్న వ్యూహంలో ఈ క్రింది అంశాలు కీలకమైనవిగా గుర్తించాం.

### 1. వివిధ తరగతుల సమస్యలపై ఉద్యమాలు

ప్రజలను సమూహాలుగా కదిలించడం అన్నది రాజకీయాలలో అత్యంత ముఖ్యమైనది. ప్రజలు తమ సమస్యల చుట్టూ ఏకం అవుతారు. దానికి మంచి పరిష్కారాలను జత చేస్తే అది సమూహాలను కదిలిస్తుంది. ఎజెండాతో ప్రారంభించకుండా సమస్యలతో ప్రారంభించడం దానికి ఎజెండాని జతపర్చడం మనం అలవర్చుకోవాలి.

- పట్టణ ప్రాంతాలలో మధ్యతరగతి వర్గాలలో పార్టీకి మంచి ఆదరణ వుంది. అలాగే పట్టణాలలో పౌరజీవనం అధ్వాన్నంగా వుంది. మున్సిపల్ స్థాయిలో, వార్డుస్థాయిలో అన్నీ సమస్యలే. మెరుగైన పౌర జీవనానికి ఈ సమస్యల ఆధారంగా కార్యకలాపాలను రూపొందించుకోవాలి. ఈ కార్యాచరణ ద్వారానే పట్టణాలలో మన ప్రభావాన్ని పెంచుకోగలం. వార్డు స్థాయిలో కార్యకలాపాల ద్వారా మధ్యతరగతితో పాటు పేదలను సమీకరించగలుగుతాం. ఒక బలమైన శక్తిగా ఎదుగుతాం.
- గ్రామాలలో రైతులు, కౌలుదార్ల సమస్యలు అతి ముఖ్యమైన అంశాలుగా ముందుకొచ్చాయి. రాజకీయాలకు అతీతంగా రైతులను సమీకరించాలని తలపెట్టిన యాత్రలకు మంచి స్పందన వుంది. రాజకీయ పార్టీలు రైతుల సమస్యలను తాత్కాలిక ప్రయోజనాలకు వినియోగించుకుంటున్నాయే తప్ప దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం ఉద్యమాలు రూపొందించలేకపోతున్నాయి. ఇక్కడ మన కార్యకలాపాలకి ఎంతో అవకాశం వుంది. స్వతంత్ర రైతు సంఘాల నిర్మాణం ద్వారా దీర్ఘకాలికంగా వ్యవసాయాన్ని లాభసాటి చేసే ఉద్యమాన్ని మనం నిర్మించాలి.
- మన అనుబంధ ప్రజాసంఘాలు విద్యార్థిసత్తా – యువసత్తా – మహిళాసత్తా–సర్వజన సత్తాలు ఆయా తరగతుల సమస్యలపై కార్యకలాపాలను రూపొందించుకుని నిర్దిష్టంగా వారిని సమీకరించే ప్రయత్నాలు ప్రారంభించాలి.

లోక్‌సత్తా పార్టీకి కొత్త రక్తం ఈ ఉద్యమాల ద్వారానే లభిస్తుంది. ప్రతి కార్యక్రమంలో వచ్చిన కొత్త వారిని వివిధ స్థాయిలలో ఇముడ్చుకోవడం, వచ్చిన అదనపు శక్తితో కార్యకలాపాలను విస్తృతపర్చుకోవడం అన్నది ఈ కార్యకలాపాలలో మనం గుర్తుంచుకోవలసిన ముఖ్య అంశం.

### 2. పార్టీ స్థావరాల నిర్మాణం

ప్రస్తుతం మనం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో, పట్టణాలలో పార్టీ నిర్మాణానికి అవకాశాలున్నా మన పరిమిత శక్తికి ఉద్యమరూపం ఇవ్వాలంటే కొన్ని నిర్దిష్ట ప్రాంతాలను ఎంచుకుని వాటిని స్థావరాలుగా నిర్మించుకోవాలి. ఎంపిక చేసిన పట్టణాలలో కూడా కొన్ని వార్డుల మీద కేంద్రీకరించాలి. అలాగే నియోజక వర్గాలలో కొన్ని మండలాలను ఎంపిక చేసుకుని గ్రామస్థాయిలో స్థావరాలను రూపొందించుకోవాలి. ఒక వార్డులో, ఒక గ్రామంలో పార్టీ స్థావరం అంటే తగిన సంఖ్యలో సభ్యులతో సజీవంగా పనిచేసే పార్టీశాఖ వుండాలి. అది స్థానిక సమస్యలపై ప్రజల్ని సమీకరించే శక్తి కలిగి వుండాలి. అక్కడ జరిగే స్థానిక ఎన్నికలలో ఫలితాలు, విజయాలు సాధించగలిగేదిగా వుండాలి. వచ్చే మున్సిపల్ పంచాయితీ ఎన్నికలలో ఈ వార్డులు, గ్రామాలలో కౌన్సిలర్లుగా, ఎం.పి.టి.సి.లుగా సర్పంచులుగా బలమైన పోటీ ఇచ్చేవిగా, కొన్ని విజయాలు సాధించేవిగా వుండాలి. అలాంటి ప్రజాపునాది గల పార్టీ స్థావరాలను వార్డుస్థాయిలో, గ్రామస్థాయిలో నిర్మించాలి. అప్పుడే మన ప్రజాసమీకరణ శక్తి పెరుగుతుంది. రాజకీయ పార్టీగా గుర్తింపు లభిస్తుంది. విజయాల దిశగా పార్టీ అడుగులు వేస్తుంది.

### 3. పార్టీని స్వయం పోషకం చెయ్యాలి

సమస్యలపై ప్రజల్ని సమీకరించడానికి, పార్టీ స్థావరాల నిర్మాణానికి ఆర్థిక వనరులు అవసరం. ఎక్కడికక్కడ పార్టీ స్వయం పోషకం చెయ్యాలి. పై నుండి సహాయం వుంటే కార్యక్రమాలు, లేకపోతే విరామం అన్న పద్ధతికి స్వస్తి చెప్పాలి. ఎంపిక చేసిన పట్టణాలలో, మండలాలలో పార్టీ ఆఫీసుల నిర్వహణ, పూర్తికాలం పనిచేసే కార్యకర్తల ఏర్పాటు, సభలు సమావేశాలు, పర్యటనలు, కరపత్రాలు వగైరాలకు స్థానికంగా ఆర్థిక వనరులు సమకూర్చుకోవాలి. మన పార్టీకి ప్రజల్లో ఆదరణ వుంది. ఆర్థికంగా సహాయం అందించేవారున్నారు. కాని ఒక వారం రోజుల పాటు పట్టుదలగా నిధులు వసూళ్లు చేసుకునే స్థితి లేదు.

**4.** పార్టీ సభ్యులు, కార్యకర్తలకు నిరంతర శిక్షణ అవసరం. అలాగే కొత్తగా పార్టీతో సంబంధాలు వచ్చిన వారికి శిక్షణ అవసరం. అందుచేత పార్టీకి ,అనుబంధ ప్రజాసంఘాలకి, ఇతర ప్రజా ఉద్యమాల కార్యకర్తలకీ శిక్షణ అన్నది మన నిత్య కార్యకలాపాలలో భాగంగా భావించాలి. శిక్షణ లేకుండా పార్టీకి వివిధ స్థాయిలలో నాయకత్వం, కార్యకర్తలు పెరిగే అవకాశాలు వుండవు.

### 5. ప్రత్యక్ష నాయకత్వం

చివరిగా ఈ పై నాలుగు లక్ష్యాలని సాధించడానికి నిర్దిష్టంగా బాధ్యతలు తీసుకుని ప్రత్యక్ష నాయకత్వం అందించడం ఈనాటి తక్షణ కర్తవ్యం. కేవలం మంచి తీర్మానాలు చేసుకోవడం, కార్యక్రమాలు ప్రకటించడంతో సరిపెట్టుకుంటే ఎలాంటి ఫలితాలు రావు. ఆచరణలో అమలు చేసే బాధ్యత తీసుకోవడం ప్రధానం. మనం ప్రస్తుతానికి 50 పట్టణాలను ఎంపిక చేసుకున్నాం. ఇందులో 40 పట్టణాలలో నాయకత్వ శిక్షణ కూడా చేసుకున్నాం. ఇప్పుడు రైతు యాత్రల ద్వారా మరో 150 మండలాలలో మనకి సంబంధాలు ఏర్పడ్డాయి. వీటిని ఆధారం చేసుకుని ప్రజా ఉద్యమాన్ని – పార్టీని నిర్మించడానికి మనం ప్రత్యక్ష నాయకత్వాన్ని అందించాలి.

- రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఇంకా బాధ్యత తీసుకోగల అవకాశం వున్న వారిని గుర్తించి బాధ్యతలు నిర్ధారించాలి.
- కనీసం ఒక పట్టణం లేదా ఒకటి రెండు మండలాలకు పరిమితంగా ఈ బాధ్యతను స్పష్టం చేసుకోవాలి.
- రాబోయే మూడు నెలలలో ఈ పట్టణాలలో, మండలాలలో పనిచేసే పార్టీ కార్యాలయాలను ఏర్పాటు చెయ్యడం
- పట్టణాలలో కనీసం 5, 6 వార్డులలో, మండలాలలో 5,6 గ్రామాలలో పార్టీ సభ్యత్వాన్ని చేర్పించి, శాఖలను ఏర్పాటు చెయ్యడం
- అనుబంధ ప్రజాసంఘాలకు సభ్యత్వాలు చేర్పించి వాటిని పట్టణ/ మండల స్థాయిలో ఏర్పాటు చెయ్యడం.
- పార్టీని స్వయం పోషకం చెయ్యడం, పట్టణాలలో 1 లక్ష రూపాయలు, మండలంలో 50 వేలు విరాళాలను సేకరించడం
- వివిధ తరగతుల ప్రజల స్థానిక సమస్యలపై కార్యకలాపాలను నిర్వహించడం. ఈ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొంటున్న వారిని పార్టీలో చేర్చుకోవడం
- పట్టణ/ మండల/వార్డు/ గ్రామస్థాయిలలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం కార్యకర్తలకు నిర్దిష్టంగా బాధ్యతలు అప్పగించడం.

చివరిగా ప్రజాపునాది గల పార్టీ నిర్మాణానికి పార్టీ సభ్యత్వం, శాఖలు, శిక్షణ, నిధులు సాధనాలు మాత్రమే. అంతిమంగా పార్టీ నిర్వహించే ప్రజా కార్యకలాపాలు, ఉద్యమాలు, సమీకరణ శక్తి మాత్రమే రాజకీయ శక్తికి గీటురాళ్లుగా వుంటాయి.

ప్రతి పట్టణంలో 200 మందిని ప్రతి మండలంలో 100 మందిని సమీకరించే శక్తిని సంపాదించుకుంటే తర్వాత అదే ప్రబల రాజకీయశక్తిగా ఎదుగుతుంది. అందుకు మనం ప్రత్యక్ష నాయకత్వాన్ని అందించాలి.

అందరి దృష్టి, అందరిశక్తి , అందరి సమయం ఎంపిక చేసిన పట్టణాలలో వార్డుల మీద ఎంపిక చేసిన మండలాలలో గ్రామాల మీదకు మళ్లించాలి. ప్రజా సమస్యల మీద కేంద్రీకరించాలి. దానికి అవసరమైన సాధన సంపత్తిని సమకూర్చుకోవాలి. ❑

## నీ రాతను నువ్వే మార్చుకో

రచన: **నటికుదిటి రాధాకృష్ణమూర్తి**
అవనిగడ్డ, కృష్ణాజిల్లా

పల్లవి: మానండి.. మానండి.. మందు మానండోయ్
మీ బ్రతుకు మీరే సరిదిద్దుకోండోయ్...
ఇల్లు – నీ ఒళ్ళు గుల్ల, కష్టాలు కడగండ్లె సంసారమెల్ల

చ॥ కూలినాలి చేసి కూడబెట్టిన సొమ్ము
తాగుడుకే నీవు తగలేస్తుంటే...
తాగి తాగి మందు తలకెక్కి కైపెక్కి
రోడ్లమీదె నువ్వు దొర్లుతు వుంటే
నిన్ను కన్న తల్లి, ఆలి, అక్క, చెల్లి
నీ వారంతా తల్లడిల్లుతుంటే...
నీ రాత నువ్వె మార్చుకోలేవా...?
తాగుడుకే నువ్వు బలి అవుతావా?

చ॥ ప్రజలంటే పిసరంత ప్రేమ లేనోళ్ళు
మంది సొమ్ము దోచె కొత్త పెత్తందార్లు
కలసి ఒక్కటై కోట్లు గుమ్మరించి
అడుగడుగున మందు అంగళ్ళు పెడుతుంటె
చేవ చచ్చి యువత నిర్వీర్యమైపోతే
కొంపాగోడు పోయి బిచ్చగాళ్ళవుతుంటే
చేయి చేయి కలిపి పోరాడలేవా....?
మందు పిశాచిని తరిమెయ్యలేవా...?

# అవినీతి పై అస్త్రం ఇచ్చాం... చట్టం చేసి ప్రయోగించండి

## ముఖ్యమంత్రికి విజ్ఞప్తి

దేశంలోనే మొదటిసారిగా రూ. 1000కోట్ల అక్రమ ఆస్తులను ఆర్జించారని పేరుమోసిన ఉత్తర ప్రదేశ్ మాజీ ప్రధాన కార్యదర్శి నీరా యాదవ్‌కు నాలుగేళ్ల జైలుశిక్ష, జరిమానా విధించారు. ఆమె ఆస్తులు జప్తుచేయకుండా వేసిన ఈ శిక్ష చాలా చిన్నదే అయినప్పటికీ అవినీతి అధికారులపై ఆంధ్రప్రదేశ్‌లో ఆ మాత్రం చర్యలు కూడా లేవు. రాష్ట్రంలో అనేకమంది నీరా యాదవ్‌లు ఉన్నారు. గణనీయ సంఖ్యలో అవినీతి ఐఏఎస్, ఐపీఎస్‌లు ఉన్నారు. రాష్ట్రంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వం అవినీతిని కఠినంగా నియంత్రించేందుకు ఇప్పటికైనా చర్యలు చేపట్టాలి.

టెర్రరిస్టులు మనదేశాన్ని ఏమీ చేయలేరని తాజాగా వారణాసిలో జరిగిన పేలుడు ఘటన మరోసారి రుజువుచేసింది. మతవిద్వేషాలు రెచ్చగొట్టాలని ఉగ్రవాదులు ప్రయత్నించినా సామాన్య ప్రజలు ఎంతో పరిణతితో హుందాగా స్పందించారు. మనకున్న సమస్యంతా అవినీతిపరులైన నేతలు, ఉన్నతాధికారుల నుంచే వస్తోంది. దేశాన్ని తొలిచేస్తున్న వారి బారి నుంచి దేశాన్ని కాపాడుకోవటమే ఈవేళ పెనుసవాలు. 'పయనీర్' పత్రికలో పనిచేసే వర్ధమాన జర్నలిస్టు గోపాలకృష్ణన్ 2-జీ స్పెక్ట్రం కుంభకోణాన్ని మూడేళ్ల క్రితమే ఎంతో సాహసోపేతంగా బైటపెడితే, దొంగలు పడ్డ ఆర్నెల్లకు కుక్కలు మొరిగిన చందాన ఇప్పుడు టెలీకాం మాజీ మంత్రి ఎ.రాజా , కొందరు ఉద్యోగుల ఇళ్ల పై సీబీఐ దాడులు చేసింది. యూపీఏ సర్కారు చేస్తున్న ఈ చర్యలు పిల్లలాటల్లా ఉన్నాయి. మరోవైపు ప్రతిపక్షాలు కూడా జేపీసీ వేయాలా, వద్దా అంటూ దొంగాటలాడుతున్నాయి తప్ప ఖజానాకు కలిగిన నష్టాన్ని తిరిగి రాబట్టి తిరిగి అలాంటి అవినీతి జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో మాట్లాడటంలేదు. 2-జీ స్పెక్ట్రంపై దేశప్రయోజనాలను పరిరక్షించేలా లైసెన్సుల్ని రద్దు చేసి, తిరిగి అంతర్జాతీయ పోటీ బిడ్డింగ్ ద్వారా కేటాయించి నష్టపోయిన డబ్బును తిరిగి రాబట్టాలని జాతీయస్థాయి ప్రముఖులతో కలిసి లోక్‌సత్తా అధ్యక్షులు డా॥ జయప్రకాష్ నారాయణ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసారు.

> **రాష్ట్రంలో హింసకు, ఉద్యమాలకు మూలకారణమైన నిరుద్యోగాన్ని పరిష్కరించేందుకు వీలుగా చాలా పెద్దఎత్తున రాష్ట్రంలో ఉపాధి అవకాశాల్ని రూపొందించి, యువతకు స్వావలంబనను, ఆత్మస్థయిర్యాన్ని పెంచే దిశగా అసెంబ్లీలో నిర్మాణాత్మక చర్చ జరగాలి.**

రైతుకు లాభసాటి ధర ఇవ్వకుండా, వ్యాపారుల దోపిడీని అడ్డుకోకుండా ప్రభుత్వం చేస్తున్న ద్రోహానికి తోడు ప్రకృతి కూడా అకాలవర్షాలతో దెబ్బతీయడం వల్ల రాష్ట్రంలో రైతులకు తీవ్రనష్టం కలిగింది. కోస్తాలో దాదాపు 40శాతం వరి కోత పూర్తయి పనల దశలో వర్షం బారిన పడింది. నష్టం పెద్దఎత్తున ఉండే అవకాశముందని ప్రాథమిక అంచనాలు సూచిస్తున్నాయి. 25శాతం దెబ్బతిన్న, రంగుమారిన ధాన్యాన్ని మద్దతుధరకే కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేయాలి. (2003లో ఇలాంటి చర్య చేపట్టారు), ప్రభుత్వం ఎకరాకు రూ. 4,000 సబ్సిడీగా అందించాలి. నేలలో తేమ, చెరువుల్లో నీరు పుష్కలంగా ఉండి రబీ (దాళ్వ) పంటకు అనుకూల వాతావరణం ఉన్నందున ఆ పంట పెట్టుబడికి రైతులకు వడ్డీలేకుండా రుణాలివ్వాలి. రైతులు నిర్వేదానికి గురికాకూడదు. రైతును ఆదుకునేందుకు పార్టీలు, పౌరసమాజం, మీడియా వారికి పూర్తిగా అండగా నిలవాలి.

వీటితోపాటు రాష్ట్రంలో హింసకు, ఉద్యమాలకు మూలకారణమైన నిరుద్యోగాన్ని పరిష్కరించే టందుకు వీలుగా చాలా పెద్దఎత్తున రాష్ట్రంలో ఉపాధి అవకాశాల్ని రూపొందించి, యువతకు స్వావలంబనను, ఆత్మస్థయిర్యాన్ని పెంచే దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలి.

రాష్ట్రంలో కొన్ని కార్యక్రమాలు సత్ఫలితాలనిస్తున్నా చాలా అసంబద్ధ పథకాలు నడుస్తున్నాయి. వీటిని పునస్సమీక్షించి రాష్ట్రంలో విలువైన వనరుల్ని పూర్తిగా సద్వినియోగం చేయాల్సివుంది. హైదరాబాద్‌కు తాగునీటికి ఎకరా భూమిని సేకరించాల్సిన అవసరం లేకుండానే రూ. 700 కోట్లతో కృష్ణా నది మూడో దశ పథకం అందుబాటులో ఉన్నా, రూ. 3800 కోట్లతో ఎల్లంపల్లి నుంచి ఎంతో ప్రయాసతో కూడిన, దీర్ఘకాలం పట్టే గోదావరి జలాల తరలింపునకు కాంట్రాక్టులు కూడా ఇచ్చేశారు. కేవలం ప్రాణహిత- చేవెళ్ల డిజైన్ కోసమే రూ. 1000కోట్లను అప్పనంగా చెల్లించేశారు. మరోవైపు, ప్రభుత్వం కేటాయించాల్సిన నిధుల్ని కేటాయించకపోవటం వల్ల ప్రాథమిక విద్యకు రూ. 1800 కోట్ల కేంద్రనిధులు పొందే అవకాశమున్నా కేవలం రూ. 700కోట్లు మాత్రమే ఉపయోగించుకోగలుగుతున్నాం. వీటన్నిటినీ ప్రభుత్వం సరిచేసుకుని పథకాలను పునస్సమీక్షించి ప్రజాప్రయోజనకంగా తీర్చిదిద్దాలి. ❑

**వ్యవసాయ సమస్యలపై లోక్‌సత్తా బృందం ఏర్పాటు - పోలవరం డిజైన్ పునఃపరిశీలనకు అభ్యంతరాలు అక్కర్లేదు**

రైతుల సమస్యలపై, దీర్ఘకాలంలో వ్యవసాయానికి ఎలాంటి చేయూతనివ్వాలి అనే అంశాలపై లోక్‌సత్తా తరుపున త్వరలో ఒక బృందాన్ని ఏర్పాటుచేస్తున్నాం. విద్యుత్ సరఫరాను వికేంద్రీకరించి నాణ్యతతో, వోల్టేజీ ఒడిదుడుకులు, అవినీతి లేకుండా అందించేందుకు గతంలో లోక్‌సత్తా పైలెట్ ప్రాజెక్టును విజయవంతంగా నిర్వహించి విద్యుత్‌ను గణనీయంగా ఆదా చేసింది. ఆ కృషి రాష్ట్రంలో, దేశంలో ప్రారంభం కావాల్సిన అవసరం ఉంది. చిన్న నీటిచెరువులను బాగుచేయటం, భూగర్భ జలాలను పెంచి వ్యవసాయానికి ఊతమివ్వటం, వాటర్‌షెడ్ పథకాలను సక్రమంగా అమలు చేయటం వంటి అంశాలను ఈ కమిటీ అధ్యయనం చేస్తుంది. ఉచిత విద్యుత్‌ను పొందే రైతులు వీటి వల్ల అదనంగా గణనీయ మేలును పొందగలుగుతారు. వారికి మరింత ఊతమిచ్చేలా నాణ్యతగల మోటార్ల రూపకల్పన మీద కూడా దృష్టి సారిస్తుంది. తెలంగాణ, రాయలసీమ జిల్లాలకు మేలు చేసేవిధంగా పోలవరం ప్రాజెక్టుతో గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌లోకి మళ్లించటం అవసరం. అయితే తక్కువ నష్టంతో, ఎక్కువ ప్రయోజనం చేకూరేలా ప్రాజెక్టు డిజైన్‌ను పునఃపరిశీలించటానికి అభ్యంతరాలు వుండనక్కర్లేదు. ❑

# అవినీతి వ్యతిరేక ప్రచారోద్యమం

భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద కుంభకోణంగా వెలుగు చూసిన లక్షా డబ్బై ఆరు వేల కోట్ల 2జి స్పెక్ట్రమ్ స్కామ్‌పై లోక్‌సత్తా నవంబరు 26 నుండి ప్రత్యక్ష పోరాటానికి నడుం కట్టింది. పార్టీ అధ్యక్షులు డా॥ జయప్రకాష్ నారాయణ్ స్వయంగా ప్రధానికి ఉత్తరం, ఒక రూపాయి ఎమ్.ఓ చేసి తన నిరసనని తెలియజేసారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీలకతీతంగా యువత, మధ్యతరగతి నుంచి 2జి స్పెక్ట్రమ్ లైసెన్సులు రద్దు చేసి, డబ్బు వెనక్కితీసుకోవాలని, దోషులను శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరక్కుండా ఒక స్వతంత్ర అవినీతి వ్యతిరేక కమిషన్ ఏర్పాటు చెయ్యాలన్న లోక్‌సత్తా డిమాండ్‌కు పెద్ద ఎత్తున స్పందన లభించింది.

లోక్‌సత్తా అన్ని విభాగాలు, సినీపరిశ్రమ, పీపుల్ ఫర్ లోక్‌సత్తా (భారత్ బయట వున్న ఎన్ఆర్‌లు ఏర్పరచుకున్న స్వచ్ఛంద సంస్థ) కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు లోక్‌సత్తా పార్టీ విభాగాలు, భూమి లాంటి స్వచ్ఛంద సంస్థలు వేలాదిగా ప్రధానికి మనియార్డర్లు, ఉత్తరాలు, ఇ-మెయిల్ పంపడం జరిగింది.

డిసెంబరు 9న విశాఖపట్నంలో, డిసెంబర్ 11న బెంగుళూర్‌లో జరిగిన అవినీతి వ్యతిరేక ర్యాలీలలో డా॥ జేపీ పాల్గొని వేలాది మంది యువతను ఉద్దేశించి అవినీతి గురించి, 2జిస్పెక్ట్రమ్ లాంటి స్కామ్‌లు ఏరకంగా దేశభవితను చిదిమేస్తున్నాయో వివరించారు.

సుప్రీంకోర్టులో 2జి స్పెక్ట్రమ్ మీద ప్రఖ్యాత అడ్వకేట్, న్యాయ సంస్కరణల పై పోరాటం చేస్తున్న ప్రశాంత్ భూషణ్ న్యాయవాదిగా జేపీ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసారు. పిటీషన్‌లో మాజీ ఎన్నికల కమిషనర్లు జె.యం. లింగ్డో, గోపాలస్వామి, కృష్ణమూర్తి, పంజాబ్ మాజీ డి.జి.పి. రెబిరో, నేవీ మాజీ ఎడ్మిరల్ తహిల్యాని లాంటి పేరు ప్రతిష్టలు వున్నవారు భాగస్వాములుగా వున్నారు.

ఆన్‌లైన్ పిటీషన్‌లో దాదాపు పదివేల మంది ప్రధానికి కంప్లైంట్ చేయగా సుమారు 15 వేలమంది ప్రధానమంత్రికి సందేశంతో కూడిన మనియార్డర్లు చేశారు. ఒక లక్షకు పైగా పోస్టుకార్డులు వేశారు. డిసెంబరు 3న అన్ని జిల్లాల్లో 'వాక్ టూ పోస్టాఫీస్' పేరుతో పెద్ద ఎత్తున యువత, విద్యార్థులు ప్రధానికి ఉత్తరాలు రాసే కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే డిసెంబరు 9న అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా 50 పైగా మున్సిపాలిటీల్లో, జిల్లా కేంద్రాల్లో వివిధ స్వచ్ఛంద సంస్థలు సమాజంలో పేరు ప్రతిష్టలు వున్నవారితో కలిసి అవినీతి వ్యతిరేక ర్యాలీలు నిర్వహించటం జరిగింది. లోక్‌సత్తా జిల్లా శాఖలతో పాటు యువసత్తా, విద్యార్థిసత్తా విభాగాలు, 'యూత్ ఫర్ బెటర్ ఇండియా' సంస్థలు ఈ అవినీతి వ్యతిరేక పోరాటంలో చురుకుగా పాల్గొన్నాయి.

అవినీతికి వ్యతిరేకంగా ముఖ్యంగా దేశ భవిష్యత్తునే సవాలు చేస్తున్న 2జి స్పెక్ట్రమ్ లాంటి తీవ్రమైన ఆర్థిక లావాదేవీలు చోటుచేసుకున్న స్కామ్‌ల విషయంలో దోషులకు శిక్ష పడేవరకు, మెడలు వంచి తిన్న డబ్బు కక్కించేవరకు, భవిష్యత్తులో ఇలాంటి స్కామ్‌లు జరక్కుండా అవినీతి వ్యతిరేక కమీషన్ ఏర్పాటు చేసేవరకు మన పోరాటాన్ని కొనసాగించాల్సిన అవసరాన్ని పార్టీ గుర్తించింది. దీనిపై రాష్ట్ర కార్యాలయం నుంచి ఇచ్చే కార్యక్రమాలకు తోడుగా స్థానికంగా సభలు, సమావేశాలు నిర్వహించటం, వినూత్నరీతిలో ప్రజల నిరసనను సమీకరించటం, మనం చేపట్టాల్సిన కార్యక్రమాలుగా భావించాలి. ❑

# నరకాలుగా మారుతున్న నగరాలు

- బండారు రామ్మోహన్ రావు

> **అప్పిచ్చువాడు వైద్యుడు**
> **ఎప్పుడు ఎడతెగకపారు ఏరున్ ద్విజుడున్**
> **చొప్పడినయూర యుండుము**
> **చొప్పడకున్నట్టియూర చొరకుము సుమతీ!**

*నివాస యోగ్యమైన ఊరు ఎలా ఉండాలో సుమతి శతక కారుడు ఏనాడో సెలవిచ్చాడు. ఊళ్ళు పట్టణాలై, నగరాలై, జనారణ్యాలై "ఇంతింతై వటుడింతై" అన్న చందాన పెరిగిపోతున్న నగర జనాభా సమస్యలు చూస్తుంటే నగరాలా? ప్రత్యక్ష నరకాలా? అనే అనుమానం కలుగుతుంది.*

భారతీయ ఆత్మ గ్రామాలలో ఉందని ఆనాడు మహాత్ముడు అన్నాడు. కానీ మెల్లమెల్లగా గ్రామీణ భారతం, పట్టణ భారతంగా పరిఢవిల్లుతుంది. స్వాతంత్ర్యానికి పూర్వం 10%గా ఉన్న పట్టణ జనాభా దేశంలో 30%నికి చేరుకుంది. మరో 20 ఏళ్ళకల్లా ఇది 50%నికి చేరినా ఆశ్చర్యం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో నగరాలలో నివసిస్తున్న ప్రజల సమస్యలు వాటికి పరిష్కారాలు చూపడంలో ప్రభుత్వం ఉదాసీనత గురించి ఎంతైనా చెప్పుకోవచ్చు.

ప్రజలు ఎక్కడ నివసిస్తారో సమస్యలు అక్కడే ఉంటాయి. ఆ సమస్యలకి పరిష్కారాలు మాత్రం మన దేశంలో కేంద్రీకృతపాలన వల్ల ఎక్కడో ఉంటున్నాయి. గల్లీలో సమస్యలు ఉంటే, ఢిల్లీలో పరిష్కారాలు ఉంటున్నాయి, ఇది మారాలి. గ్రామస్వరాజ్యం నినదించిన పూజ్య బాపూజీ కోరింది కూడా ఇదే. అందుకనే మన రాజ్యాంగంలో గ్రామస్వరాజ్య భావనను భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 40 ద్వారా ఆదేశిక సూత్రాలలో ఘనంగా రాసుకున్నాం. ఆనాడు కేంద్రీకృత పాలనలో భాగంగా దేశంలో జాతీయ ప్రభుత్వం, రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం ఉంటే సరిపోతుంది అనుకున్నారు. కానీ మహాత్మాగాంధీ ప్రబోధించిన గ్రామ స్వరాజ్య సిద్ధాంతాన్ని ఆయన మీద ఉన్న గౌరవంతోనే ఆదేశిక సూత్రాలలో రాసుకున్నారు. రాజ్యాంగం అమలులోకి వచ్చిన 41 సంవత్సరాల తరువాత 1991లో పంచాయితీలను, మున్సిపాలిటీలను, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లను కూడా కలిపి స్థానిక ప్రభుత్వాలుగా రూపొందించుకున్నాం. పంచాయితీలకు 29 అంశాలను, మున్సిపాలిటీలకు 18 అంశాలను బదలాయించి పాలనాపగ్గాలను స్థానిక ప్రభుత్వాలకు అప్పగించాలని 73, 74వ రాజ్యాంగ సవరణను చేసుకున్నాం. రాజ్యాంగ సవరణ జరిగి 20ఏళ్ళు కావస్తున్నా, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వేసినట్లు ఉంది.

మున్సిపాలిటీలలో ప్రజలు పన్నులు కడుతున్నారు. ఎటొచ్చి ఆ పన్నులకు తగిన సేవలే లభించడం లేదని వాపోతున్నారు. మున్సిపాలిటీలు ప్రజలకి చేయాల్సిన సేవలు కొన్ని ఉన్నాయి. మంచినీరు, మరుగుదొడ్లు, మురుగునీటి పారుదల, పట్టణ పారిశుద్ధ్యం, వీధిదీపాలు, అంతర్గత రోడ్లు ఇవన్నీ మౌలిక సేవల కిందికి వస్తాయి. అలాగే మున్సిపల్ ఆఫీసుల్లో పౌరులు హక్కుగా పొందే సర్టిఫికెట్లు, ఇతర ఆఫీసు సేవలు కూడా సకాలంలో అందించాలి. ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు కూడా మంజూరు చేసే అధికారం, నియంత్రించే అధికారం కూడా మున్సిపాలిటీలకే ఉంది.

గ్రామాలలో ఉపాధి అవకాశాలు మృగ్యం అవడం, వ్యవసాయం దెబ్బతినడం, వ్యవసాయ రంగంలో ఉపాధి మందగించడం, జాతీయ ఆదాయంలో వ్యవసాయం పై వచ్చే ఆదాయం 16%నికి పడిపోవడం ఇవన్ని ప్రజల్ని పట్టణాలు, నగరాలవైపు వలస వెళ్ళేలా చేస్తున్నాయి. కూటికోసం, కూలికోసం పట్టణాలకి వలస వచ్చిన ప్రజలకి ఆవాసాలు కల్పించడం, తగిన నివాస యోగ్యమైన పరిసరాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. భారతదేశంలో ఉన్న నగరాలలో 189 పట్టణాలు, నగరాలు అస్సలే నివాస యోగ్యంగా లేవని కేంద్రప్రభుత్వం పట్టణాభివృద్ధి శాఖ లెక్కలే చెబుతున్నాయి. ఇందులో 36 పట్టణాలు, నగరాలు మన రాష్ట్రంలో ఉండటం శోచనీయం. ప్రామాణిక జీవన విషయంలో దేశంలో చంఢీఘర్, మైసూర్, సూరత్, ఢిల్లీ మొదటి నాలుగు ర్యాంకులు సాధించగా మన హైదరాబాద్ నగరం మాత్రం 88వ స్థానంతో అతి చెత్త నగరం అనిపించుకుంటున్నది. 2001 జనాభాను అనుసరించి తీసుకున్న వివరాలు ఇవి. 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకుంటే ఇంకెంత దారుణంగా ఉంటుందో చెప్పలేము. పెరుగుతున్న మురికి వాడలు, పేదల బస్తీలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. "మంచినీళ్ళు తాగితే మరణశిక్ష" అమలు జరిగే పరిస్థితులు నగరాలలో ఉన్నాయి. రక్షిత మంచినీరు పేరుకే కానీ, వాటిలో రక్షణ ఏ మాత్రం లేదు. విస్తరిస్తున్న పట్టణాలు, నగరాలలో మౌలిక

వసతుల కొరత చాలా ఉంది. రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం అవసరానికి తగినంతగా లేవు. అలాగే నగరాలలో ట్రాఫిక్ సమస్య భూతంగా మారింది. చిన్న వర్షానికే రోడ్లపై పారే వరదలు, గంటల తరబడి ట్రాఫిక్ జాములు, నగర వాసుల జీవితంలో భాగమైపోయాయి. చినుకు పడితే చిత్తడిగా మారే కాలనీలు, ప్రమాదం పొంచిఉన్న విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఇవన్నీ ప్రజల జీవితాన్ని నరకంగా మార్చేస్తున్నాయి.

2009 హైదరాబాద్ నగరంలో ఎన్నికలు జరిగాయి. సంవత్సరం కావస్తున్న మొక్కుబడిగా ఎన్నికైన వార్డు కమిటీల పని ఇంకా మొదలు కాలేదు. అలాగే ఏరియా కమిటీల ఎన్నికలు కూడా పూర్తి కాలేదు. 74వ రాజ్యాంగ సవరణలో పేర్కొన్న ప్రజల వద్దకి అధికారాన్ని వికేంద్రీకరించే వార్డు కమిటీలు, ఏరియా కమిటీలను అన్ని మున్సిపాలిటీలలో ఎన్నుకునేలా ప్రజల నుండి ఒత్తిడి రావాలి. అలాగే ఆయా కమిటీలలో సేవా దృక్పధంతో పని చేయడానికి పౌరసమాజం నుండి స్పందన కూడా కావాలి.

నగరాలలో అక్షరాస్యత ఎక్కువే కానీ ఆ అక్షరాస్యుల్లోనే మధ్యతరగతి మనస్తత్వం ఎక్కువగా ఉంది. మన కష్టాలకి కారణం స్పష్టంగా పాలకుల అసమర్ధతే అని తెలిసినా ఆ పాలకులను ఐదేళ్ళకొకసారి మార్చే అవకాశాన్ని మాత్రం అందిపుచ్చుకోవడం లేదు. ఓటు వేయడం అంటే అదో పెద్ద పనిలాగా భావించడం, అది మన పని కాదులే అని ఊరుకోవడం చేస్తున్నారు. మధ్య తరగతి పట్టణ ప్రజలు ఓటు పట్ల, ప్రజాస్వామ్యంలో రాజకీయాల పట్ల చూపిస్తున్న నిరాసక్తత, నిస్పృహ మాని, "అవును మనం మార్చగలం" అనే ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకొన్నప్పుడే నగరాలలోని ప్రజల సమస్యలకి పరిష్కారం దొరుకుతుంది.

## మున్సిపాలిటీలకు ఎన్నికలు జరపాలి :

సెప్టెంబర్ 2010తో రాష్ట్రంలోని 93 మున్సిపాలిటీలు, 11 కార్పొరేషన్లకి ఎన్నికైన పాలక వర్గాల పదవి కాలం ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం వైఖరి చూస్తుంటే సమీప భవిష్యత్తులో వీటికి ఎన్నికలు జరిపే పరిస్థితి కనబడటం లేదు. రాజ్యాంగం ప్రకారం 6నెలల ముందుగానే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై అక్టోబర్ 2010లో కొత్త పాలక వర్గాలు రావలసిన అవసరం ఉండింది. కానీ ఎక్కడ ఆ జాడ కనబడటం లేదు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం రాజకీయ లబ్ధికోసం రిజర్వేషన్లు, వార్డు పునర్విభజన చేయకుండా కావాలని ఎన్నికలను వాయిదా వేసింది. ప్రభుత్వమే రాజ్యాంగ ఉల్లంఘనకు పూనుకుంది. అలాగే మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఛైర్మన్, మేయర్ పదవులకు పరోక్ష ఎన్నికలు నిర్వహించడం, ప్రజలకు నేరుగా ఎన్నుకునే హక్కును కాలరాయడమే. కౌన్సిలర్ల, కార్పొరేటర్ల బేరసారాలతో అవినీతితో జరిగే పరోక్ష ఎన్నికలు మున్సిపల్ పాలనలో మరింత అవినీతికి దారి తీస్తాయి. అందుకే గడువులోగా ఎన్నికలు జరిపించి, ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ప్రజలకు అవినీతి లేని పాలన అందించి, మనం చెల్లించే పన్నులకు తగిన సేవలు చేసే పాలక వర్గాలను ఎన్నుకునే అవకాశాన్ని ఇవ్వాలని పౌరసమాజం ఎలుగెత్తి చాటాలి.

### ఆ ఒక్కటి అడక్కండి!

**నల్గొండ జిల్లా, మిర్యాలగూడ మున్సిపల్ కార్యాలయం. అందమైన సొంత భవనంలో ఉంది. భవనం లోపల బిల్లులు చెల్లించే గదిలో పౌరసేవా పత్రాల బోర్డు మరింత అందంగా పెద్ద పెద్ద అక్షరాలతో వ్రాయబడి ఉంది. కానీ అందులో పేర్కొన్న కొన్ని సేవలు నిర్ణీత కాలవ్యవధిలో అందించలేక పోతే దానికి పౌరుడికి ఆ ఉద్యోగి చెల్లించాల్సిన పరిహారం, జరిమాన సంగతి ఎక్కడా వ్రాయలేదు. చాలా మున్సిపాలిటీలలో సిటిజన్ చార్టర్ బోర్డులే లేవు. ఉన్నా మిర్యాలగూడలాగా అసలు విషయాన్ని దాచిపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. మున్సిపల్ కార్యాలయంలో విధిగా అందించాల్సిన సేవలు, జరిమానాలు ఈ విధంగా ఉన్నాయి.**

### మున్సిపల్ కార్యాలయం - పౌరసేవా పత్రము

| | | | |
|---|---|---|---|
| 1. ఆస్తి విలువ మదింపు, ఇంటి నంబర్ కేటాయింపు | 15 రోజులు | 2. మురుగు కాల్వలలో అడ్డంకుల తొలగింపు | 2 రోజులు |
| 2. నిర్మాణాల అనుమతుల మంజూరు/ నిరాకరణ | 15 రోజులు | 3. దోమల నిర్మూలనకై యాంటిలార్వా ఆపరేషన్ | 2 వారాలకోసారి |
| 3. నీటి సరఫరా కనెక్షన్ | | | |
| ఎ. సాధారణ కేటగిరీ | 30 రోజులు | 4. చెత్తకుండీల ఏర్పాటు | 2 రోజులు |
| బి. ఓ.వై.టి. కేటగిరి | 10 రోజులు | 5. పైపులైన్ల మరమ్మత్తులు | 1 రోజు |
| 4. జననమరణాల ధృవపత్రాలు మంజూరు | 5 రోజులు | 6. వీధిలైట్ల మరమ్మత్తులు | 5 రోజులు |
| 1. చెత్త చెదారాల తొలగింపు | 1 రోజు | 7. రోడ్ల అడ్డంకుల తొలగింపుకు | 7 రోజులు |

**పై సేవలు నిర్ణిత సమయంలో అందనిచో, దరఖాస్తుదారునకు రోజుకు రు. 50/- నష్టపరిహారం ఇవ్వాలి.**
**ఇవి తప్పక చేయవలసిన సేవలు. వీటికి జరిమాన లేదు,**

## ఒక చెత్త కుప్ప కథ

ఆంధ్రరాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి ప్రకాశం పంతులుగారి పేరు పెట్టిన ప్రకాశం జిల్లా ముఖ్య పట్టణం ఒంగోలు. నగరం నడిబొడ్డున పది ఎకరాల స్థలంలో అదో పెద్ద "డంప్‌యార్డ్" చుట్టూ ఇళ్ళు ఉన్నా నగరంలోని చెత్తనంతా మున్సిపాలిటీ వారు సేకరించి అక్కడే పడేస్తారు. ఇటీవలే అక్కడ చెత్తనంతా పక్కకు తొలగించి, చెత్తమధ్యలో బ్రహ్మాండమైన మార్కెట్ యార్డ్ నిర్మించారు. కూరగాయల మార్కెట్‌నుండి మొదలుకొని నిత్యావసర సరుకులు, మాంసం, చేపల దుకాణాలు, చివరికి పూలఅంగడి వరకు అక్కడే నిర్మించారు. మార్కెట్ అంతా సిమెంట్ రోడ్లు, భవనాలు బాగున్నాయి. మంచినీరు, మరుగుదొడ్డ సౌకర్యం కల్పించకుండానే నగరం నడి బొడ్డున మరో చోట ఉన్న ఈ మార్కెట్లను కొత్త మార్కెట్లోకి బలవంతంగా తరలించారు. మార్కెట్ యార్డ్ చుట్టూ ఉన్న చెత్త "డంప్‌యార్డ్" మాత్రం అలాగే కొనసాగిస్తున్నారు. దాంతో చెత్త మురిగి దుర్వాసన, కుళ్ళిన మాంసం, వ్యర్థ పదార్థాలు, వెరసి అక్కడికి వెళ్ళిన ప్రజలకి జబ్బులు కొనుక్కోవడం తప్పనిసరి అయింది. దాంతో ఆ మార్కెట్‌కి ప్రజలు పోవడం మానేశారు. అడపాదడపా అక్కడికి కొనుక్కోవడానికి వెళితే, అక్కడి పరిసరాలు చూసిన వారు జీవితంలో మళ్ళీ మాంసం తిననని ఒట్టు వేసుకోవలసిందే. ఈ చెత్త "డంపింగ్ యార్డ్"ను ఎత్తివేయాలని చుట్టు ప్రక్కల ఇళ్ళవారు ఎన్నో రోజులుగా కోరుతున్నా మున్సిపాలిటీ వారు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొసమెరుపు ఏమిటంటే అట్లాంటి పరిస్థితులు ఉన్న ఆ చెత్త కుప్ప ప్రక్కనే మార్కెటింగ్ శాఖ మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి పూల అంగండి కొట్లను రేకుల షెడ్‌లలో ప్రారంభించారు. ప్రారంభించిన రోజు అధికారులు మంత్రిగారికి చెత్త కుప్ప కనబడకుండా చుట్టూ అందమైన తెరలు కట్టారట. చెత్తను మంత్రి గారి కళ్ళకు కనబడకుండా చేశారే కానీ, ఆయన ముక్కు ఏమి చేసింది వాసన రాలేదా? అని ప్రజలు ఆశ్చర్యపోయారు. ఆ పూల అంగడి పక్కనే ఒక "అత్తరు దూకాణాన్ని" కూడా తెరిస్తే సరిపోయేది, మంచి గిరాకీ ఉండేది, అని ప్రజలు నవ్వుకున్నారు. ఇది ఒక ఒంగోలు నగరానికే పరిమితం కాదు, రాష్ట్రంలోని "ఏ నగర చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం సమస్త నగరాల ప్రజల జీవితం నరక ప్రాయం." అని మనం కవిత చదువుకోవచ్చు. ❑

**2030 నాటికి మన నగరాల పరిస్థితి :** 2030 నాటికి మన దేశ జనాభా 147 కోట్లకు చేరుకుంటుందని ఒక అంచనా. అందులో 40% సుమారు 60కోట్ల మంది నగరాలు, పటణాలలో నివసిస్తారు. తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్ర, కర్నాటక, పంజాబ్ రాష్ట్రాలలో పట్టణ ప్రాంత జనాభా 2030 నాటికి 50% మించుతుంది. 10లక్షల జనాభా దాటే నగరాల సంఖ్య దేశంలో ఆనాటికి 70కి చేరుతుంది. దేశంలోని ఆరు మెగాసిటిలు ఢిల్లీ, ముంబాయి, కోల్‌కత, చెన్నై, హైదరాబాద్, బెంగుళూరు కోటి జనాభా ధాటికి కిక్కిరిసిపోతాయి. ఢిల్లీ, ముంబాయిలు ప్రపంచంలోని ఐదు పెద్దనగరాల జాబితాలో చోటు సంపాదించుకుంటాయి.

**పట్టణీకరణ - విసురుతున్న సవాళ్ళు :** 12వ పంచవర్ష ప్రణాళిక ముగిసే 2017నాటికి మురికి వాడలు లేని భారతదేశాన్ని ఆవిష్కరిస్తామని, మన భారత ప్రభుత్వం సంకల్పించింది. కానీ పట్టణీకరణ విసురుతున్న సవాళ్ళు దీనికి అడ్డుగా నిలుస్తున్నాయి. 'మెకెన్సీ' నివేదిక ప్రకారం ప్రస్తుతం ప్రతీ భారతీయుడికి రోజుకి సగటున 105 లీటర్ల నీరు అందుబాటులో ఉంది. అది 2031 నాటికి 65 లీటర్లకు పడిపోతుంది. ప్రజలు నీటిని కొనుక్కొని త్రాగవలసిన దుస్థితి ఇప్పటికే ఉంది. కానీ అప్పటికి ఇతర అవసరాలకు కూడా నీరు కొనుక్కొనే సమస్య పెరుగుతుంది. 2001 నాటికి మురికి వాడల్లో నివసిస్తున్న జనాభా ఆరుకోట్లు. 2011 జనాభా లెక్కలు అందుబాటులోకి వస్తే ఖచ్చితంగా ఇది రెట్టింపై ఉంటుంది. పట్టణ పేద ప్రజల కోసం గృహనిర్మాణపథకం రాజీవ్ ఆవాస్ పథకం కింద మురికివాడలలో నివసించే వారందరికీ ఇళ్లు నిర్మించాలంటే సుమారు 10లక్షల కోట్ల రూపాయలు అవసరం.

**నగరాలలో కాలుష్యం :** దేశంలో వాహనాల సంఖ్య ఏటా 10% పెరుగుతోంది. ఇందులో పట్టణ వాసులు కొనేవే ఎక్కువ. 2010 నాటికి కోటి 50లక్షల వాహనాలు 35లక్షల కిలోమీటర్ల మేరకు విస్తరించి ఉన్న భారతీయ రోడ్లపై తిరుగుతున్నాయి. రానున్న కాలంలో వీటి సంఖ్య మరింత పెరుగుతుంది. పట్టణాలు నగరాల అవసరం తీరాలంటే మరో 250 కోట్ల చదరపు మీటర్ల రోడ్డు వేయవలసి ఉంటుంది. 7500 కిలోమీటర్ల దాకా 'సబ్‌వే'లు, రవాణారహదారులు, నిర్మించవలసి ఉంటుంది. వాహన, పారిశ్రామిక కాలుష్యం కారణంగా కార్బన్‌మోనాక్సైడ్, హైడ్రోకార్బన్, ధూళికణాలు, వాతావరణంలో నిండి నగరజీవి ఊపిరి అందక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పాతబడి పనికి రాకుండా పోతున్న, పర్సనల్ కంపూటర్లు, మొబైల్ ఫోన్లు, టెలివిజన్లు ఏటా 50 వేల టన్నుల మేరకు అభివృద్ధి చెందిన దేశాల నుండి మన దేశంలోనికి దిగుమతి చేసుకుంటూ భారతదేశాన్ని ఎలక్ట్రానిక్ వ్యర్థాల కుప్పతొట్టిగా మారుస్తున్నాయి.

# సూక్ష్మఋణాలు
## (మైక్రోఫైనాన్స్)



### డ్వాక్రా మహిళాగ్రూపులు, పలుకుటుంబాల మహిళా సభ్యులతో అవగాహనా సదస్సులు

రాష్ట్రంలోని సూక్ష్మఋణ సంస్థలు "పేదల కుటుంబ అవసరాలు తీర్చడానికంటూ" ఇంటింటికీ వెళ్లి ఋణాలు ఇస్తూ వుండటంవలన, ఆ సూక్ష్మఋణాలపై అవగాహన సరిగ్గా లేని ఎంతో మంది పొదుపు సంఘాల మహిళలు(డ్వాక్రా సంఘాలు), ఇతర అనేక కుటుంబాల సభ్యులు అది ఒక మంచి అవకాశంగా భావించి, మైక్రోఫైనాన్స్ సంస్థలు పెట్టే అన్ని షరతులకి అంగీకరించేసి, విపరీతమైన అప్పులు చేయడానికి ముందడుగు వేస్తున్నారు. తీరా తాము తీసుకున్నగోతిలో తామేపడినట్టు ఆ తీసుకున్న అప్పులపై పడిన వడ్డీలు, చక్రవడ్డీలు గడువులోపల తీర్చలేక.. ఆ ఋణసంస్థలు పెట్టే ఇబ్బందులు తట్టుకోలేక నానాఅవస్థలు పడుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా ప్రతీ చోటా ఇదే పరిస్థితి కనపడుతుంది.

రాష్ట్ర మహిళాసత్తా ప్రథమంగా గ్రేటర్ హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని అత్తాపూర్ డివిజన్ శివాజీనగర్ కాలనీలో డిసెంబర్ 17, 2010వ తేదీన, ఉప్పరపల్లి గాంధీనగర్ కాలనీలో డిసెంబర్ 20, 2010వ తేదీన 18 డ్వాక్రా మహిళాగ్రూపుల సభ్యులను కలిసి పై సూక్ష్మఋణాలకు సంబంధించిన విషయాలను గురించి చర్చించి, వారి అభిప్రాయాలను తెలుసుకోవడం జరిగింది.

### సూక్ష్మఋణాలపై ఆ మహిళల మాటల సారాంశం

ప్రభుత్వం డ్వాక్రా గ్రూపుల వారికి, పావలావడ్డీ ఋణాలు సరిగ్గా అమలు పర్చకపోవడం వలన... మహిళల ఇబ్బందులు తీరక, సూక్ష్మఋణాలకు దగ్గర అవుతున్నారు. అయితే, ఆ ఋణాల వడ్డీలు కట్టడం కూడా వారి తలకు మించిన భారంగా తయారయ్యింది. పోనీ, కుటుంబానికి ఆసరాగా ఉపయోగపడే ఉపాధి కార్యక్రమాలు చేపడదామన్నా అవి ఏ విధంగా చేయాలో తోచక వాళ్ళు వ్యక్తిగతంగా చేపట్టిన పొదుపు విధానాన్ని కూడా మానేసి ఆయా మహిళా గ్రూపులు నిర్వహణని కూడా ఇంక ఆపేద్దామనిపిస్తోందని ఆ డ్వాక్రా గ్రూపు మహిళలు వారి బాధలు చెప్పుకున్న మీదట "సూక్ష్మ ఋణాలపై ప్రభుత్వం ఎలా స్పందించాలో, సూక్ష్మఋణాలను ఏ రీతిన అమలుపర్చాలో" వారికి మహిళాసత్తా అవగాహన కల్గించడం జరిగింది.

అంతేగాక... తక్కువ ఖర్చు, సులువైన పద్ధతిలో ఉపాధి అవకాశాలను, తగిన శిక్షణని ఇప్పించే ఏర్పాటుని ఆ మహిళలకు కల్పించే ప్రయత్నం మహిళసత్తా చేస్తుందని కూడా చెప్పిరావడం జరిగింది.

ఈ కార్యక్రమాన్ని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థిగా నిలబడిన కె.విజయకుమారి ఆధ్వర్యంలో రాష్ట్ర మహిళాసత్తా అధ్యక్షురాలు ఎన్.సరోజాదేవి, మహిళాసత్తా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.గీతామూర్తి, జి.హెచ్.ఎమ్.సి. మహిళాసత్తా కార్యదర్శి యస్.గజానని తదితరులు చేపట్టడం జరిగింది. ❑


యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారతః
అభ్యుత్థానం అధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్



జనవరి 14 పుట్టినరోజు

ఎప్పుడైతే ప్రజాస్వామ్యం అరాచకీయుల చేతుల్లో బందీ అయ్యిందో ఆ క్షణాన్నే తన వ్యక్తిగత జీవితాన్ని, భవిష్యత్తును త్యాగం చేసి ప్రజాస్వామ్యం పరిరక్షణకై రెండవ స్వాతంత్ర్య పోరాటానికి నాంది పలికిన భారతమాత ముద్దుబిడ్డ, మా అందరి ఆశాజ్యోతి డా॥ నాగభైరవ జయప్రకాష్ నారాయణ నిండు నూరేళ్ళు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని పుట్టినరోజు సందర్భంగా ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తూ..



డా॥ మర్రి రాంరెడ్డి
రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు
మరియు
అధ్యక్షులు, నిజామాబాద్ జిల్లా లోక్‌సత్తా పార్టీ

# మనకు ఎంత విద్యుత్తు కావాలి

అభివృద్ధి అంటే ఏమిటి? ఒక దేశ, ప్రాంత అభివృద్ధిలో విద్యుత్ పాత్ర ఎంత? వాతావరణాన్ని ఏ విధంగానూ నష్టపరచకుండా అభివృద్ధి సాధించగలమా? ఒకవేళ అటు వంటి నష్టం తప్పనిసరి అయితే, దానిని వీలయినంత తక్కువ స్థాయికి కుదించటానికి అయ్యే ఖర్చును ఎవరు భరించాలి? ఆ నష్టం, కాలుష్యం పర్యవసానాలను ఎవరు భరించాలి? గత జూలైలో బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పే విషయంలో సోంపేట (శ్రీకాకుళం జిల్లా)లో చోటు చేసుకున్న సంఘటనల నేపథ్యంలో దేశ ప్రజలకు ఎదురవుతోన్న మౌలిక ప్రశ్నలివి.

సోంపేటలో ఒక ప్రైవేట్ కంపెనీవారు బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నిర్మించే ప్రయత్నాలు మొదలుపెట్టగా, ఆ ప్రాంత ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. పోలీసు కాల్పులు జరిగి కొందరు చనిపోవటం జరిగింది. కాలుష్యానికి వ్యతిరేకంగా పోరాడే స్వచ్ఛంద సంస్థలు సోంపేట ప్రజా ఉద్యమంలో పాల్గొన్నాయని తెలుస్తున్నది. మీడియా ముక్త కంఠంతో ప్రజల వ్యతిరేకతను సమర్థించి థర్మల్ విద్యుదుత్పత్తి ప్రాజెక్టుని నిశితంగా విమర్శించింది. ఈ రాష్ట్రంలో ప్రతి సంవత్సరం వేసవి మొదట్లో విద్యుత్ కొరత ఎక్కువై అప్రకటిత విద్యుత్ కోతలు అనివార్యమవుతున్నాయి. ఆ సందర్భంలో రైతులు, ప్రజలు విద్యుత్ కార్యాలయాలపై దాడి చేసి విద్యుత్ ఇంజనీర్లను, సిబ్బందిని బంధించడం జరుగుతుంది. ఈ సంఘటనల్లో కూడా మీడియా, మేధోవర్గాలు ఆయా ప్రజల పక్షానే సానుభూతి ప్రకటిస్తున్నాయి.

నలభై యాభై ఏళ్ళ క్రితం వరకూ పల్లెల్లో పట్టణాలలో ఇంటి వాడకానికి నీళ్ళు నూతుల్లో నుంచి తోడుకునేవారు. వ్యవసాయానికి దిగుడు బావుల నుంచి, మోట బావుల నుంచి, ఏతం ద్వారానో మరో విధంగానో తోడిపోసుకునే వారు. ఈ రోజున స్విచ్చి నొక్కితే వ్యవసాయానికి పంపుసెట్ల ద్వారా నీరు, కుళాయి తిప్పితే ఇంటి వాడకానికి నీరు రావాలని ప్రజలంతా ఆశిస్తున్నారు. విద్యుచ్ఛక్తి ఒక కనీస అవసరమైపోయింది. రాత్రిపూట ఇళ్ళలో, వీధుల్లో వెలుగు కోసం, రాత్రింబగళ్ళూ గాలి కోసం, వ్యవసాయానికి, గృహ అవసరాలకు, భూగర్భం నుంచి నీరు తోడటం కోసం, వినోద సాధనాలైన రేడియో, టెలివిజన్ వంటివి వాడటానికి ఎంత మారుమూల గ్రామాల్లో అయినా విద్యుత్ అందుబాటు తప్పనిసరి అయింది. విద్యుచ్ఛక్తి లేకుండా పరిశ్రమలు లేవు, ఉపాధి కల్పన ఉండదు. ఎక్స్‌రే మెషిన్లు లేవు, టెలిఫోన్లు లేవు, కంప్యూటర్లు లేవు, ఆధునిక వైద్య సాంకేతిక వ్యవస్థలు లేనట్టే. 'అభివృద్ధి' అన్న పదానికి అర్థం 'మెరుగైన కుటుంబాదాయాలు, జీవన ప్రమాణాలు, మనిషి జీవితాన్ని సౌకర్యవంతం చేసే శాస్త్ర సాంకేతిక వ్యవస్థ' అని అనుకుంటే, దీని మొత్తానికి మూలం అని చెప్పదగ్గది విద్యుచ్ఛక్తి.

శాస్త్ర పరంగా చూస్తే, విద్యుచ్ఛక్తిని అనేక విధాలుగా ఉత్పత్తి చేయవచ్చు. కొండలలో పైనుంచి క్రిందకు దూకే జలపాతాల నుంచి, కొండ అంచుల్లోనూ విశాల మైదానాల్లోనూ సముద్ర తీరాల్లోనూ వీచే గాలి నుంచి, తీక్షణంగా కాచే ఎండ నుంచి ఎటువంటి కాలుష్యం లేకుండా కూడా విద్యుచ్ఛక్తి తయారు చేయవచ్చు. అయితే ఇప్పుడు లభ్యంగా ఉన్న శాస్త్ర సాంకేతిక విజ్ఞానం, ఇటువంటి ప్రాకృతిక వనరుల నుంచి ఉత్పత్తి చేయగలిగే విద్యుచ్ఛక్తి, మన అవసరాలకు సరిపడిన స్థాయిలో ఉత్పత్తి చేయటానికి అనుకూలంగా లేదు. కనుక పెద్ద ఎత్తున విద్యుదుత్పత్తి చేయటానికి మనం తప్పనిసరిగా బహుళార్థ సాధన నీటి ప్రాజెక్టులు, బొగ్గు, పెట్రోలియం ఉత్పత్తులు, సహజ వాయువు వంటి వాటితో పనిచేసే 'థర్మల్' విద్యుత్కేంద్రాలపైనే ఆధారపడవలసి వస్తున్నది. వీటిల్లో ఏ పద్ధతిలోనైనా, కాలుష్యం వెలువరించకుండా లేదా వాతావరణానికి నష్టం కలుగజేయకుండా విద్యుదుత్పత్తి చేయటం దాదాపు అసాధ్యం.

విద్యుదుత్పత్తి కోసం నిర్మించే పెద్ద డ్యాములు రిజర్వాయర్లలో కొన్ని వేల లేదా లక్షల ఎకరాల అడవి భూములు, సాగు భూములు మునిగిపోతాయి. ఈ విధంగా వాతావరణానికి జరిగే నష్టం ఒక్కసారే అయినా శాశ్వతంగా జరుగుతుంది. పెట్రోలియం ఉత్పత్తులు, సహజ వాయువులను మండించటం ద్వారా జరిగే 'థర్మల్' విద్యుదుత్పత్తి కేంద్రాలలో వ్యర్థ పదార్థంగా బొగ్గు పులుసు వాయువు పెద్ద ఎత్తున విడుదల అవుతుంది. ఇది కంటికి కనిపించకపోయినా దీర్ఘకాలంలో భూగోళం వేడెక్కటానికి, సముద్రాల మట్టం పెరగటానికి కారణమవుతుంది. అణుశక్తి ఆధారిత విద్యుదుత్పత్తి కేంద్రాలలో అణు సంబంధమైన ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎంత తక్కువైనప్పటికీ, ఒకవేళ అటువంటి ప్రమాదం జరిగితే దాని వలన కలిగే కాలుష్యం కొన్ని దశాబ్దాల పాటు ఆ ప్రాంత ప్రజలపై దుష్ప్రభావం చూపిస్తుంది. ఇక బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తి కేంద్రాలలో బొగ్గు కాల్చటం వలన వచ్చే బూడిద అతి పెద్ద కాలుష్య సమస్య.

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా మానవాళి తన ఇంధన అవసరాలను భూమి పొరల్లో ఉండే బొగ్గు, పెట్రోలియం వంటి పదార్థాల ద్వారానే తీర్చుకుంటున్నది. వీటిల్లో పెట్రోలియం కన్న కొన్ని శతాబ్దాలు ముందే మనిషికి తెలిసిన ఇంధన వనరు బొగ్గు. 2000 సంవత్సరం నాటికి మొత్తం ప్రపంచం విద్యుత్ అవసరాలు

సుమారు 153 లక్షల మెగావాట్లని అంచనా. ఇందులో 57.4 లక్షల మెగావాట్లు పెట్రోలియం ఉత్పత్తులతోనూ, 42.7 లక్షల మెగావాట్లు బొగ్గు ద్వారానూ, 36.1 లక్షల మెగావాట్ల అవసరాలు సహజ వాయువు ద్వారానూ, మిగిలిన 20.9 లక్షల మెగావాట్ల అవసరాలు బహుళార్థ సాధక నీటి ప్రాజెక్టులు, అణు విద్యుత్ కేంద్రాలతోనూ తీరుతున్నాయి. అంటే ప్రపంచ విద్యుచ్ఛక్తి అవసరాలలో సుమారు 45 శాతం బొగ్గు ద్వారానే జరిగింది.

2010 జూన్ నాటికి భారతదేశ విద్యుదుత్పాదన సామర్థ్యం సుమారు 1,62,360 మెగావాట్లు, ఇందులో 53 శాతాన్ని బొగ్గు ఆధారిత, 11శాతాన్ని సహజవాయువు ఆధారిత, 21 శాతం నీటి ఆధారిత విద్యుదుత్పాదన కేంద్రాలు సమకూరుస్తున్నాయి. ప్రపంచ విద్యుదుత్పాదన సామర్థ్యంలో మన దేశం వాటా 1 శాతం మాత్రమే. అయితే మన దేశం తనకు తాను నిర్దేశించుకున్న అభివృద్ధి లక్ష్యాలను సాధించాలంటే, 2030 సంవత్సరం నాటికి మన దేశ విద్యుదుత్పత్తి సామర్థ్యం 9,50,000 మెగావాట్లకు (ఇప్పటికి ఆరు రెట్లు) పెరగవలసి ఉంటుందని అంచనా.

మన రాష్ట్ర ప్రస్తుత విద్యుత్ ఉత్పాదనా సామర్థ్యం 14,700 మెగావాట్లు. నీటి ఆధారిత విద్యుత్కేంద్రాల ద్వారా 3750, సంప్రదాయేతర వనరుల ద్వారా 700, బొగ్గు ఆధారిత కేంద్రాల ద్వారా 4400 మెగావాట్లు సమకురుతుంది. రాష్ట్రంలోని ఎన్‌టిపిసి ప్రాజెక్టులలో మన వాటా 1900 మెగావాట్లు. కర్ణాటక, తమిళనాడులలోని అణు విద్యుత్ కేంద్రాలలో మన వాటా 279 మెగావాట్లు. తమిళనాడులోని నైవేలీ, ఒడిషాలోని తాల్చేరు థర్మల్ విద్యుత్ కేంద్రాలలో మన వాటా 784 మెగావాట్లు. ఇవన్నీ కాక మన రాష్ట్రంలోనే ఉన్న వివిధ ప్రైవేట్ విద్యుత్కేంద్రాల ద్వారా దాదాపు 2900 మెగావాట్ల విద్యుత్తు సమకూరుతుంది. విద్యుదుత్పాదన ముఖ్యంగా బొగ్గు ఆధారిత ప్రాజెక్టులు, వాతావరణ కాలుష్యం మధ్య ఉన్న మౌలిక సంబంధాన్ని విశ్లేషించటానికి ఈ చర్చ చేయవలసి వస్తోంది.

ఈ సందర్భంగా జేన్‌కో వారి 4400 మెగావాట్లు కాక ఎన్‌టిపిసి 3600 (రామగుండం, సింహాద్రి), సింహాద్రిలో త్వరలో పూర్తి కాబోతున్న ఇంకొక 1100 మెగావాట్ల ప్రాజెక్టు, కృష్ణపట్నం ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న సుమారు 16,600 మెగావాట్ల ప్రాజెక్టులను కూడా మనం పరిగణనలోకి తీసుకోవాలి.

ఒక దేశానికి లేదా రాష్ట్ర/ప్రాంతానికి ఎంత విద్యుదుత్పాదన సామర్థ్యం సరిపోతుంది? ఈ సందర్భంలో కొన్ని మౌలిక అంశాలు పరిగణనలోకి తీసుకోవాలి. మొదటిది విద్యుచ్ఛక్తి కాంతివేగంతో ప్రయాణిస్తుంది కనుక ఏ ఒక్క క్షణంలోనైనా ఎంత ఉత్పత్తి అవుతుందో అంత పూర్తిగా వినియోగమై పోతుంది. కనుక విద్యుచ్ఛక్తిని వీలున్నప్పుడు ఉత్పత్తిచేసి నిల్వ చేసుకుని అవసరమైనప్పుడు వాడుకునే అవకాశం అసలు లేనే లేదు. ఇంకొక అంశం – ఉత్పత్తి జరిగిన చోట ఉండే విద్యుత్ సామర్థ్యం, అది దూరం ప్రయాణం చేసిన కొద్దీ తగ్గుతుంది. ఇంకొక ముఖ్య అంశం– ఒక రాష్ట్ర లేదా ప్రాంత విద్యుత్ అవసరాలు ఒక రోజులోని 24 గంటలూ లేదా సంవత్సరంలోని అన్ని నెలల్లోనూ సమానంగా ఉండవు. సాధారణంగా ఒక రోజు సమయంలో విద్యుత్ వాడకం ఉదయం సూర్యోదయంతో పుంజుకుని, సాయంత్రం చీకటి పడిన తర్వాత నుంచీ రాత్రి పదిగంటల వరకూ అత్యధిక స్థాయిలో ఉంటుంది. అప్పటి నుంచి తిరిగి సూర్యోదయం వరకూ తక్కువగా ఉంటుంది.

అదే విధంగా ఒక సంవత్సర కాలంలో దక్షిణ భారతదేశంలో శీతాకాలంలో విద్యుత్ వాడకం తక్కువగా ఉంటుంది. (ఫ్యాన్లు, ఎసిల వాడకం బాగా తగ్గటం, ఖరీఫ్ పూర్తయి ఇంకా రబీ మొదలుకాక పోవటం వలన). జనవరి నెల తర్వాత, పెరిగే ఎండల వలన, రబీ పంటకై వ్యవసాయ పంపు సెట్ల వాడకం వలన విద్యుత్ వాడకం పెరిగి, ఏప్రిల్ నెలకు అత్యధిక స్థాయికి చేరుకుంటుంది. జూన్ నెలలో వర్షాలు మొదలైన తర్వాత విద్యుత్ వాడకం నెమ్మదిగా తగ్గుతుంది. చలి ఎక్కువగా ఉండే మధ్య. ఉత్తర భారతదేశ ప్రాంతాల్లో విస్తృతంగా హీటర్ల వాడకం వలన చలికాలంలో కూడా విద్యుత్ వాడకం హెచ్చుగానే ఉంటుంది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని చూసినట్టయితే, ఒక రాష్ట్ర / ప్రాంత ప్రజల గృహ, వ్యవసాయ, పారిశ్రామిక, వాణిజ్య, ఇతర సంస్థాగత (విద్యాలయాలు, అస్పత్రులు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు వగైరా) విద్యుత్ అవసరాలు సంవత్సరంలోని ఏ నెలలో లేదా ఏ భాగంలో అత్యధికంగా ఉంటాయో (ఉదా: మార్చి, ఏప్రిల్ నెలలు), ఆ రోజుల్లో ఒక రోజులోని విద్యుత్ వాడకం ఏ సమయంలో అత్యధికంగా ఉంటుందో (మధ్యాహ్నాలు, సూర్యాస్తమయం నుంచి రాత్రి పది గంటల వరకు) ఆ స్థాయి విద్యుత్ అవసరాలకు సరిపడే విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఆ రాష్ట్రంలో ఉన్నప్పుడే అక్కడ విద్యుత్ కొరత సమస్య లేకుండా ఉంటుంది.

## అనివార్యాలకు అవరోధాలు

ఆంధ్రప్రదేశ్ ఒకప్పుడు విద్యుత్ పరంగా మిగులు రాష్ట్రంగా ఉండేది. గత మూడు దశాబ్దాలలో రాష్ట్రం నూరు శాతం గ్రామీణ విద్యుదీకరణను సాధించింది. పారిశ్రామికీకరణ విస్తృతమయింది. ఉచిత విద్యుత్తు కారణంగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు అత్యధికంగా పెరిగాయి. పేదల గృహాలకు విద్యుత్ వెలుగులు అందుతున్నాయి. ఈ పురోగతి కారణంగా రాష్ట్ర విద్యుత్ అవసరాలు భారీగా పెరిగాయి. అయితే అదే నిష్పత్తిలో విద్యుదుత్పత్తి పెరగలేదు. దీంతో విద్యుత్ కొరత తీవ్రమవుతున్నది.

రాష్ట్ర విద్యుదుత్పత్తి సామర్థ్యం 14,700 మెగావాట్లు. ఇందులో ఎపి జెన్‌కో వారి బొగ్గు ఆధారిత థర్మల్ కేంద్రాల సామర్థ్యం 4382.5 మెగావాట్లు. వీటి నూరు శాతం ఉత్పత్తి స్థాయి సంవత్సరానికి 38,391 మిలియన్ యూనిట్లు. 2009–10లో ఈ కేంద్రాల నుంచి 26,566 మిలియన్ యూనిట్ల (69.2శాతం)

విద్యుత్తు మాత్రమే మనకు లభ్యమైంది. బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ కేంద్రాలు తమ పూర్తి సామర్థ్యంలో విద్యుదుత్పత్తి చేయలేక పోవటానికి కొన్ని ముఖ్య కారణాలు ఉన్నాయి. అవి : (అ) రిపేర్లు, మెయింటెనెన్సుల కోసం విద్యుదుత్పాదన టర్బైన్లను నిలిపివేయవలసిరావటం (ఆ) ఒక రోజులోని వివిధ సమయాల్లో, సంవత్సరంలోని వివిధ నెలల్లో హెచ్చుతగ్గులుగా ఉండే విద్యుత్ వాడకం (తత్కారణంగా ఉత్పాదన సామర్థ్యం ఉన్నా, విద్యుత్ వాడకం తక్కువగా ఉన్నప్పుడు తక్కువ స్థాయిలో ఉత్పత్తి అవుతుంది) (ఇ) ఉత్పాదన అయిన విద్యుత్తు వాడకం దార్లకు చేరే క్రమంలో 5 శాతం మేరకు తరుగుదలకు లోను కావటం (ఈ) బొగ్గు కొరత, నీటి అలభ్యత ఇత్యాదులు.

ఇదే విధంగా 2009-10లో ఏపిజెన్‌కో వారి హైడల్ విద్యుత్ సామర్థ్యం 3750 మెగావాట్ల నుంచి మనకు 5531 మిలియన్ యూనిట్లు (17శాతం) మాత్రమే లభ్యమైంది. దీనికి కారణం హైడల్ రిజార్వయర్లలో ఒక ఏడాది కాలంలో ఆ మేరకు మాత్రమే విద్యుదుత్పత్తి చేయటానికి తగిన నీరు ఉండటం. కేంద్ర విద్యుదుత్పాదన ప్రాజెక్టుల (ఎన్‌టిపిసి, నైవేలీ, తాల్చేరు, అణు విద్యుత్తు) నుంచి మన వాటాగా మనకు 2009-10లో 20,880 మిలియన్ యూనిట్లు (పూర్తి సామర్థ్యంలో 80.4 శాతం) లభ్యమైంది. 2009-10లో రాష్ట్రం మొత్తం మీద సుమారు 72,780 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అయి, వినియోగదారులకు లభ్యమైంది. ఇది కాకుండా లోటు సమయాల్లో సుమారు 2081 మిలియన్ యూనిట్ల విద్యుత్తును బయట రాష్ట్రాలు, కేంద్ర ప్రాజెక్టుల నుంచి కొనుగోలుచేసి వినియోగదారులకు సరఫరా చేయటం జరిగింది. మనకు మిగులు విద్యుత్తు ఉన్న సమయాల్లో సుమారు 890 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఇతర రాష్ట్రాలకు అమ్మటం జరిగింది.

పూర్తి స్థాయిలో ఎటువంటి కోతలు అవసరం లేకుండా ప్రస్తుతం రాష్ట్ర విద్యుత్ అవసరాలు సుమారు 83,800 మిలియన్ యూనిట్లని అంచనా. సంవత్సరంలో వర్షాకాలం, శీతాకాలం కలిపి నాలుగైదు నెలల మినహా (వర్షాకాలంలో నీటి పారుదల ప్రాజెక్టులు నిండినప్పటి నుంచి) మిగిలిన సమయం అంతా. (పెద్ద నగరాలు తప్ప) పట్టణాలు, పల్లెలు అంతటా పద్ధతి ప్రకారం విద్యుత్ కోతలు అమలు చేస్తున్నారు. ఏ విధంగా చూసినా రాష్ట్రం ఇప్పటికే సంవత్సరంలో చాలా భాగం తీవ్రమైన విద్యుత్ కొరతను ఎదుర్కొంటున్నదనే చెప్పాలి. మరి 2019-20 నాటికి మన విద్యుత్ అవసరాలు ఏడాదికి 2,28,500 మిలియన్ యూనిట్ల (ఇప్పటికి మూడు రెట్లు)కు పెరుగుతాయని అంచనా. ఒక దశాబ్దంలోనే ఎదురవనున్న ఆ గడ్డు పరిస్థితిని ఎలా అధిగమించగలుగుతాం?

రాష్ట్రం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన 'జలయజ్ఞం'లో భారీ 'ఎత్తిపోతల' పథకాలు చాలా ఉన్నాయి. వాటన్నిటికీ కలిపి ఏడాదికి సుమారు 25 వేల మిలియన్ యూనిట్ల విద్యుత్తు (పంటకాలమైన నాలుగు నెలల వ్యవధిలోనే) అవసరమవుతుందని అంచనా. ఈ విద్యుత్తును ఉత్పత్తి చేయటానికి సంవత్సరం మీద సరాసరి 70 శాతం సామర్థ్యంతో పనిచేస్తాయని భావిస్తే, సుమారు 8700 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని అదనంగా నెలకొల్పవలసి ఉంటుంది. ఇది రాష్ట్రంలో ప్రస్తుతం లభ్యంగా ఉన్న విద్యుదుత్పత్తి సామర్థ్యానికి 60 శాతం అదనం.

ఈ పరిస్థితుల్లో ఒక విషయం స్పష్టమవుతున్నది. సమీప భవిష్యత్తులో రాష్ట్రం పెద్ద ఎత్తున అదనపు విద్యుదుత్పాదన (20 నుంచి 30వేల మెగావాట్ల) సామర్థ్యాన్ని నెలకొల్పాలి. నీటి ఆధారిత హైడల్ విద్యుత్ కేంద్రాలు నెలకొల్పే అవకాశాలను మనం దాదాపు పూర్తిగా వినియోగించుకున్నట్లే. కనుక ఈ రంగంలో అదనపు విద్యుదుత్పాదన సామార్థ్యాన్ని పెద్ద ఎత్తున నెలకొల్పే అవకాశాలు లేవనే చెప్పాలి. రాబోయే దశాబ్ద కాలంలో అవసరమయ్యే అదనపు విద్యుత్ సామర్థ్యాన్ని, బొగ్గు, సహజ వాయువు లేదా అణు విద్యుత్ ఆధారిత ప్రాజెక్టుల ద్వారానే ఏర్పాటు చేయవలసి ఉంటుంది. ఈ సందర్భంగా రాష్ట్ర తీర ప్రాంతంలోని సముద్ర గర్భంలో పెద్ద ఎత్తున సహజ వాయు నిక్షేపాలు కనుగొన బడటం మనకెంతో ఆశాజనకమైన విషయం. అయితే ఈ నిక్షేపాలు ప్రైవేటు కంపెనీలచే కనుగొనబడటం, వీటిపై మొదటి హక్కు వారికే ఉండటం మన ఆశలపై కొంత చన్నీళ్ళు జల్లినట్లే.

కనుక వచ్చే పది సంవత్సరాల కాలంలో రాష్ట్ర అవసరాలకే పూర్తిగా లభించే రీతిలో బొగ్గు, సహజవాయువు, అణు విద్యుత్తు లేదా సంప్రదాయేతర పద్ధతుల ద్వారా 30 వేల మెగావాట్ల విద్యుత్ సామర్థ్యాన్ని నెలకొల్పుకోవాలి. వీటన్నింటికి సహజ వాయువు ఆధారిత విద్యుత్ కేంద్రాలు కాలుష్యరీత్యా అతి తక్కువ కాలుష్యం కలిగించేవని చెప్పవచ్చు. సంప్రదాయేతర విద్యుత్ కేంద్రాలలో అసలు ఏ మాత్రం కాలుష్యం వెలువడనప్పటికీ, వీటి ద్వారా విద్యుదుత్పాదన పెద్ద ఎత్తున చేపట్టటం ఆచరణలో సాధ్యం కాకపోవచ్చు. ఉదాహరణకి సూర్యరశ్మి ఆధారంగా విద్యుదుత్పాదన చేసే కేంద్రాలకు 'ఫోటో వోల్టాయిక్ సెల్స్' అనే పరికరాలు పెద్ద సంఖ్యలో అవసరమవుతాయి. ప్రస్తుతం లభ్యంగా ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో వీటి నిర్మాణం చాలా ఎక్కువ ఖర్చుతో కూడుకున్న పని. ఈ విధంగా ఉత్పత్తయ్యే విద్యుత్తు, బొగ్గు ఆధారిత విద్యుత్ కన్న నాలుగు రెట్లు ఎక్కువ ఖరీదు ఉండవచ్చు. ఈ పరిస్థితుల్లో ఇంత హెచ్చు ఖర్చుతో విద్యుదుత్పాదన చేసి, ప్రస్తుతం అమలులో ఉన్న రాయితీల తోనూ, కొందరు వినియోగదారులకు (వ్యవసాయదారులకు, ఇంటికి ఒక బల్బు చొప్పున పేద కుటుంబాలకు) ఉచితం గానూ విద్యుత్ సరఫరా చేయటం ప్రభుత్వం చేయలేకపోవచ్చు. గాలిమరల ద్వారా విద్యుదుత్పాదనకు పెట్టుబడి కొద్దిగా ఎక్కువగానే (రెండు రెట్లు) అవసరమైనప్పటికీ ఇటువంటి మరలు ఏర్పాటు చేయటానికి అనువైన ప్రదేశాలు రాష్ట్రంలో ఎక్కువగా లేవనే చెప్పాలి. గాలిమరలకు, బలంగా రోజులో ఎక్కువసేపు నిరంతరాయంగా గాలివీచే ప్రదేశాలు

కావాలి. కొండలు, గుట్టలు వంటి అడ్డంకులు లేని సమతల ప్రదేశాలలోనే ఇది సాధ్యం. ప్రపంచ వ్యాప్తంగా గాలిమరల ద్వారా పెద్ద ఎత్తున విద్యుదుత్పాదన చేసే దేశాలు వాటినెక్కువగా తీరం వెంబడి, సముద్రంలోనే నిర్మిస్తున్నాయి. ఇది ఇంకా ఎక్కువ పెట్టుబడితో కూడుకున్న పని.

ఈ పరిస్థితులన్నీ నిశితంగా పరిశీలిస్తే పెద్ద ఎత్తున అదనపు విద్యుదుత్పాదక సామర్థ్యాన్ని నెలకొల్పే అవకాశాలు బొగ్గు లేదా అణు శక్తి ఆధారిత రంగాల్లోనే ఉన్నాయని స్పష్టమవుతున్నది. సోంపేటలో అయినా, మరెక్కడైనా దేశంలో దాదాపు అన్ని రాష్ట్రాలు/ ప్రాంతాల్లోనూ నూతన విద్యుదుత్పాదన ప్రాజెక్టులు (ముఖ్యంగా బొగ్గు ఆధారిత లేదా అణు శక్తి ఆధారిత విద్యుత్ కేంద్రాలు) నెలకొల్పే విషయంలో ప్రజల నుంచి, కాలుష్యాన్ని వ్యతిరేకించే స్వచ్ఛంద సంస్థల నుంచి వ్యతిరేకత ఎదురవుతున్నది. ఇందుకు రెండు ముఖ్య కారణాలు : భూమిని కోల్పోవడం ద్వారా (ప్రాజెక్టు కోసం జరిగే భూసేకరణలో) తమ జీవనాధారం కోల్పోతామనే ప్రజల ఆవేదన విద్యుత్ కేంద్రాలు (ముఖ్యంగా బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ కేంద్రాలు) వెలువరించే కాలుష్యం, ఆ ప్రాజెక్టు ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందనే ఆందోళన. అణు శక్తి ఆధారిత విద్యుత్ కేంద్రాలు నిర్మాణం అత్యంత క్లిష్టమైన సాంకేతిక పరిజ్ఞానంతో కూడుకున్న వ్యవహారం. అణుశక్తి రంగంలో పనిచేసే శాస్త్ర సాంకేతిక వేత్తల నైపుణ్యత, పనితనం మీద మనం నమ్మకం ఉంచగలిగితేనే అణు విద్యుత్‌ను మనం పొందగలుగుతాము.

## ప్రగతి ఫలం బూడిదేనా!

విద్యుత్ వెలుగుల్లో చీకటి ఉంటుంది సుమా! బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాల నుంచి వెలువడే కాలుష్యం అంశాన్ని పరిశీలిద్దాం. ఈ కేంద్రాల్లో బొగ్గు మండించి, తద్వారా నీటిని ఆవిరిచేసి ఆ ఆవిరితో విద్యుత్తు తయారు చేసే టర్బైన్‌ను నడిపిస్తారు. ఇలా బొగ్గును మండించడం వలన వెలువడే కాలుష్య పదార్థాలలో ముఖ్యమైనవి. బూడిద, బొగ్గు పులుసు వాయువు. వాయు రూపంలో ఉండే బొగ్గు పులుసు వాయువు వెలువడిన వెంటనే గాలిలో కలిసిపోతుంది. ఈ కారణంగానే సామాన్య ప్రజానీకానికి దాని గురించి పెద్దగా తెలియదు. వాతావరణ శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం విద్యుదుత్పాదనకై మండించే బొగ్గు నుంచి వెలువడే బొగ్గు పులుసు వాయువే భూగోళం వేడెక్కటానికి కారణమవుతోంది. దీనివల్ల భవిష్యత్తులో సముద్రపు నీటి మట్టాలు పెరిగి తీరప్రాంతాలు మునకకు గురై కొన్ని కోట్ల మంది ప్రజల జీవితాలు దుర్భరం అవటానికి కారణం కావచ్చు.

బొగ్గు ఆధారిత విద్యుదుత్పాదన కేంద్రాల విషయమై సామాన్య ప్రజలకు భయాందోళనలు కలిగించే కాలుష్య వ్యర్థ పదార్థం బూడిద. మన దేశంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలలో ఉపయోగించే బొగ్గులో, మండిన తర్వాత సుమారు 40 శాతం వరకు బూడిద మిగులుతుందని అంచనా. ఒక 500 మెగావాట్ల విద్యుత్ టర్బైన్ ఒక గంట పనిచేస్తే సుమారు 350 టన్నుల బొగ్గుమండించాల్సి ఉంటుంది. అయితే, టర్బైన్ పరిమాణం పెరిగినకొద్దీ ఉపయోగించవలసిన బొగ్గు పరిమాణం తక్కువ నిష్పత్తిలో పెరుగుతుంది (సాంకేతికంగా మెరుగైన పద్ధతులలో పనిచేయడం వలన), టర్బైన్ సామర్థ్యం తక్కువైన కొద్దీ అదే ఎక్కువ నిష్పత్తిలో బొగ్గును ఖర్చు చేస్తాయి. కనుక వీలైనంత హెచ్చు మెగా వాట్ల సామర్థ్యం గల టర్బైన్లను నెలకొల్పుకుంటే, సగటున ఒక మెగావాట్‌కి ఖర్చు అయ్యే బొగ్గు పరిమాణం తగ్గి, కాలుష్యం కూడా తగ్గుతుంది.

2009-10లో ఏపి జెన్‌కో తన 3882.5 మెగావాట్ల ఆధారిత థర్మల్ విద్యుత్ సామర్థ్యంతో 197.03 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు వినియోగించి 26,566 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి చేసింది. జెన్‌కో, తన ప్లాంట్లు అన్నింటిలోనూ కలిపి సగటున (60 మెగావాట్ల నుంచి 500 మెగావాట్ల వరకు ఉన్న టర్బైన్లను కలిపిచూస్తే) 500 మెగావాట్లకు గంటకు 371 మెట్రిక్ టన్నుల బొగ్గు ఉపయోగించింది. ఎన్‌టిపిసి రామగుండం, సింహాద్రి ప్రాజెక్టులు తమ 3600 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో పనిచేస్తూ 2009-10లో 190 లక్షల టన్నుల బొగ్గు వినియోగించి 30,095 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి చేశాయి.

ఎన్‌టిపిసి రామగుండం, సింహాద్రిలో ఉన్న టర్బైన్లనన్నీ కలిపి పరిగణిస్తే, సగటున 500 మెగావాట్లకు గంటకు 316 మెట్రిక్ టన్నుల బొగ్గు వినియోగించాయి. ఇలా 2009-10లో రాష్ట్రంలోని జెన్‌కో, ఎన్‌టిపిసిలు కలిసి 387 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు ఉపయోగించి, సుమారు 7500 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యాన్ని వినియోగించి, 57,660 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేశాయి. ఈ క్రమంలో వారు సుమారు 154.8 లక్షల టన్నుల బూడిద ఉత్పత్తికి కారకులయ్యారు. 2019-20 నాటికి, రాష్ట్ర విద్యుత్తు డిమాండు ఇప్పుడున్న సుమారు 83,800 మిలియన్ యూనిట్ల నుంచి 2,30,000 మిలియన్ యూనిట్లకు పెరుగుతుందని అంచనా (ఇప్పటికి సుమారు మూడు రెట్లు). పెరిగిన ఈ విద్యుత్ అవసరాలను తీర్చుకోవడానికి 15,000 మెగావాట్ల అదనపు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని నెలకొల్పుకోవాల్సి ఉంటుంది. (పెరగాల్సిన ఉత్పత్తి సామర్థ్యంలో సగం మాత్రమే బొగ్గు ఆధారిత ప్లాంట్ల నుండి వస్తుందని, ఆ మొత్తం ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించబడుతుందని అనుకుంటే.) ఇవన్నీ మాత్రమే కాకుండా ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'వాణిజ్య విద్యుదుత్పత్తి ప్రాజెక్టు'ల పద్ధతి క్రింద ఇప్పటికే రాష్ట్రంలో సుమారు 16,000 మెగావాట్ల బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రాన్ని ప్రైవేటు పారిశ్రామిక వేత్తలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలియవస్తోంది.

ఇంతేకాక రాబోయే ఐదు నుంచి పది సంవత్సరాలలో ఈ 'వాణిజ్య విద్యుత్ కేంద్రాల' పద్ధతి పైన, రాష్ట్రంలోని తీర ప్రాంతాల్లో

సుమారు 50 వేల మెగా వాట్ల సామర్థ్యంతో బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తి ప్రాజెక్టులను నెలకొల్పనున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇవన్నీ కార్యరూపం దాల్చితే రాష్ట్రం అద్భుతమైన పారిశ్రామికీకరణ సాధిస్తుందనడంలో సందేహం లేదు. అయితే ఆ ప్రగతితో పాటు 2020 సంవత్సరం నాటికి ఏటా సుమారు 1381.2 లక్షల టన్నుల బూడిద సమస్యను ఎదుర్కొనవలసి ఉంటుంది.

బూడిద కాలుష్య కారకం కావటానికి, దీనివలన ఆయా ప్రాంత ప్రజలు భయాందోళనలకు గురికావటానికి కారణాలు లేకపోలేదు. మొదటిది: బూడిద కణాలు అత్యంత సూక్ష్మ పరిమాణం. ఈ బూడిద కణాలు 0.5 నుంచి100 మైక్రోమీటర్ల (ఒక మైక్రోమీటరు అంటే ఒక మిల్లీ మీటర్‌లో వెయ్యోభాగం) వ్యాసం కలిగి ఉంటాయి. ఇంత సూక్ష్మ పరిమాణం కలిగి ఉండడం వలన, నిల్వ చేసిన ప్రాంతం నుంచి ఈ బూడిద గాలి ద్వారానూ, వర్షపు నీటి ద్వారానూ చాలా విస్తారంగా, పది పదిహేను కిలో మీటర్ల దూరం వరకూ వ్యాపించి భూమిలోకి ఇంకిపోయి, భూగర్భ జలాలను కలుషితం చేస్తుంది. బొగ్గులో భాగంగా ఉండి, బొగ్గు కాల్చబడిన తరువాత ఆక్సైడ్‌ల రూపంలో, ఎంత అత్యంత సూక్ష్మ స్థాయిలో ఉన్నప్పటికీ, బూడిదలో కనిపించే కొన్ని విషపూరితమైన రసాయన, ధాతు పదార్థాలు ప్రజల భయాందోళనలకు రెండవ ముఖ్యకారణం. వీటిల్లో ముఖ్యమైనవి- అవి ఎంత పరిమాణంలో ఈ బూడిదలో ఉంటాయో ఈ విధంగా చూడవచ్చు : (బ్రాకెట్‌లోని అంకె బూడిదలోని ప్రతి పదిలక్షల భాగాలలో ఒక ధాతువు ఎన్ని భాగాలు ఉందో తెలిపేది) : బేరియం(806) స్ట్రోంటియం (779) బోరాన్ (311) వనేడియం (252) మాంగనీసు (250) క్రోమియం (220) జింకు (176) రాగి (112) నికెల్ (77) సీసం (56) అర్సెనిక్ (43) కోబాల్ట్ (36) ఫ్లోరిన్ (29). ఇవే కాక ఇంకా అత్యంత సూక్ష్మస్థాయిలో అణు ధార్మిక స్వభావం ఉండే పదార్థాలు మాలిబ్డినమ్, థోరియం, యురేనియం, రేడియంలు ఈ బూడిదలో ఉంటాయని శాస్త్ర వేత్తలు నిర్ధారించారు. కానీ, ఈ స్థాయిలోని అణు ధార్మిక స్వభావం సాధారణ గ్రానైట్ రాళ్లలోనూ, కొన్ని రకాల ఇసుకలోను ఉంటాయి. అయితే ఇవి మానవ శరీరానికి హాని కలిగించే స్థాయికి దిగువనే ఉండటం వలన ఇది అంత ఆందోళన చెందవలసిన విషయం కాదు.

ఇంతేకాక విడుదల అయిన బూడిదను నూటికి నూరు శాతం అన్ని జాగ్రత్తలు తీసుకుని భూగర్భ జలాలలోకి ఇంకకుండా చూసి దీనిని ఉపయోగించగల ప్రయోజనాలన్నింటికీ దీనిని వినియోగించగలిగితే దీని వలన ఆ ప్రాంత ప్రజల ఆరోగ్యానికి కలిగే దుష్ప్రభావాలను పూర్తిగా నివారించటం సాధ్యమవుతుంది.

ప్రస్తుత పరిస్థితిలో కూడా ఈ హానికారక పదార్థాలు అత్యంత తక్కువ స్థాయిలో ఉండటం వలన ఈ బూడిద ద్వారా కాలుష్యానికి గురైన వారు వెంటనే తీవ్ర అనారోగ్యానికి గురికాకపోయినా, దీర్ఘకాలంలో వీటి దుష్ప్రభావాలకు గురయ్యే అవకాశం ఉంది. ఈ బూడిద వలన కలిగే కాలుష్యం పీల్చే గాలి ద్వారానూ, తాగటానికి ఉపయోగించే భూగర్భ జలాల ద్వారానూ వ్యాపిస్తుంది.

## 'వెలుగు' పంచితేనే పరిష్కారం

వాతావరణ కాలుష్యం కలిగించే బూడిద పెద్ద ఎత్తున కేవలం బొగ్గు ఆధారిత విద్యుదుత్పాదన కేంద్రాలలోనే కాకుండా, ఉక్కు కర్మాగారాలు, అల్యూమినియం తయారీ ఫ్యాక్టరీలు వంటి వాటిల్లో కూడా విడుదలవుతుంది. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ మంత్రిత్వ శాఖ ఈ విషయమై ఇప్పటికే కొన్ని ఉత్తర్వులు జారీ చేసింది. బొగ్గు, ఇతర పదార్థాల వాడకం వలన ఏ కర్మాగారాలయితే పెద్ద ఎత్తున వ్యర్థ పదార్థంగా బూడిదను విడుదల చేస్తాయో, ఆయా కర్మాగారాలు ఆ బూడిదను, వాతావరణంలోకి ప్రవేశించి కాలుష్యం కలిగించకుండా, కొన్ని ఖచ్చితమైన పద్ధతులలో వినియోగంలోకి తేవాలనేది ఆ ఉత్తర్వుల సారాంశం.

అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ బూడిదను అనేక ఇతర ఉపయోగాలకు మళ్లిస్తున్నారు. అవి : (అ) బొగ్గును వెలికి తీసిన తరువాత బొగ్గు గనుల్లో ఏర్పడే ఖాళీలను నింపటానికి ఈ బూడిదను వాడుతున్నారు. భూగర్భ బొగ్గు గనులు ఉన్నచోటే థర్మల్ విద్యుదుత్పాదన కేంద్రాలు ఏర్పాటు చేయటం ద్వారా గనుల నుంచి విద్యుత్ కేంద్రానికి బొగ్గు రవాణా ఖర్చు, తిరిగి బూడిదను భూగర్భ గనుల్లోకి పంపటానికి అయ్యే రవాణా ఖర్చు చాలావరకు తగ్గించుకొనవచ్చును.

(ఆ) సిమెంటు తయారీలో 30 శాతం వరకు ఈ బూడిదను వాడుతున్నారు. బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తి కేంద్రం దగ్గరే సిమెంటు ఫ్యాక్టరీ ఏర్పాటు చేసుకుంటే, బూడిద రవాణా ఖర్చు తగ్గుతుంది. రవాణాలో బూడిద గాలిలోకి ఎగిరి కాలుష్యం కలిగించే అవకాశం తక్కువవుతుంది. విద్యుత్ కేంద్రం వద్దే ఏర్పాటయింది కాబట్టి సిమెంటు ఫ్యాక్టరీలో ఖచ్చితంగా బూడిద వినియోగం జరుగుతుంది. ఇలా విద్యుత్ కేంద్రం వద్ద సిమెంటు ఫ్యాక్టరీలు నెల కొల్పేలా, ఆ సిమెంటు ఫ్యాక్టరీకి అవసరమయ్యే విద్యుత్‌ని కొంత రాయితీతో ఆ విద్యుదుత్పాదనా కేంద్రం నుంచి సరఫరా చేయవచ్చు. చివరిగా విద్యుదుత్పాదనా కేంద్రం నుంచి సరఫరా చేయవచ్చు. చివరిగా విద్యుదుత్పాదనా కేంద్ర యాజమాన్య నిర్వహణలోనే సిమెంటు ఫ్యాక్టరీలు నెలకొల్పితే (లేదా 'జాయింట్ వెంచర్' పద్ధతిలో) బూడిద వలన జరిగే కాలుష్యం నివారణ ఇంకా ఖచ్చితమైన రీతిలో జరగటానికి అవకాశం ఉంటుంది.

(ఇ) ఈ బూడిదలో జిప్సమ్, ఇంకొన్ని పదార్థాలు, ఇసుక కలిపిఇటుకలు (ఫ్లై ఆష్ (బ్రిక్స్) తయారు చేస్తున్నారు. మన దేశంలో అనేక శతాబ్దాలుగా ఇళ్ళ నిర్మాణానికి మట్టితో చేయబడి, కాల్చబడిన ఇటుకలను ప్రతిఏటా కొన్ని వందల కోట్ల సంఖ్యలో వాడుతున్నారు.

మట్టి ఇటుకల తయారీకి భూమిపై పొరలో ఉండే నాలుగైదు అడుగుల లోతు వరకు ఉన్న మట్టిని వాడుతున్నారు. భూమిపై పొరలోని అయిదారు అడుగుల మట్టి కొన్ని వేల సంవత్సరాల ప్రకృతి శ్రమకి ఫలితం. భూమిపై రెండు సెంటీమీటర్ల మట్టి పొర ఏర్పడటానికి సుమారు 500 సంవత్సరాలు పడుతుందని శాస్త్రజ్ఞుల అంచనా. అంటే 50వేల సంవత్సరాలు గడిస్తే గాని రెండు మీటర్లలోతు మట్టి పొర ఏర్పడదు. పై భాగంలో ఉండే ఈ మట్టిపొరే చాలా సారవంతమైనది. దానిని ఇటుకలుగా మార్చడం వలన మనం దాన్ని శాశ్వతంగా కోల్పోతున్నాం. దీని ప్రభావం రాబోయే దశాబ్దాలలో ఆహార ధాన్యాల ఉత్పత్తిపై ఉండవచ్చు. ఏటా దేశవ్యాప్తంగా నిర్మాణమయ్యే ఇళ్ళు, పరిశ్రమల షెడ్లు, గోడౌన్లు వంటి వాటి నిర్మాణానికి అవసరమయ్యే కొన్ని వందల కోట్ల ఇటుకలను ఈ బూడిదను ఉపయోగించి తయారుచేయవచ్చు. అన్ని ప్రభుత్వ నిర్మాణాల్లో వీటి వాడకం 'కంపల్సరీ' చేయవచ్చును. ధర తగ్గింపు వంటి విధానాలతో సామాన్య పౌరులు కూడా వారి నిర్మాణ అవసరాల్లో వీటిని వాడేటట్లు ప్రోత్సహించవచ్చును. (ఈ) రోడ్ల నిర్మాణంలో సిమెంటుకు బదులుగా ఈ బూడిదను అభివృద్ధి చెందిన దేశాల్లో విస్తృతంగా వాడుతున్నారు.

ముగింపుగా ఒక్క అంశం గురించి అందరూ ఆలోచించాలి. సరిపడినంత విద్యుచ్ఛక్తి లేనిదే మనం అభివృద్ధిని సాధించలేము. పరిశ్రమలకు, వ్యవసాయానికి, గృహ అవసరాలకు, వాణిజ్య వ్యాపారాలకు అవసరమైన సమయంలో అవసరమైనంత మేరకు విద్యుత్‌ను అందించలేము. అదనపు విద్యుదుత్పాదనా సామర్థ్యం కోసం చాలా చోట్ల బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ కేంద్రాలో, అణు విద్యుత్ కేంద్రాలో పెట్టకుండా అదనపు విద్యుచ్ఛక్తి ఉత్పత్తి చేయలేము. బొగ్గు ఆధారిత విద్యుదుత్పాదనా కేంద్రాలు సాధారణంగా బొగ్గు గనుల దగ్గర గాని, బొగ్గు దిగుమతి చేసుకొనే పక్షంలో ఓడరేవులకు సమీపంలో గాని నెలకొల్పటం జరుగుతుంది. అదే విధంగా అణువిద్యుత్ కేంద్రాలు వీలయినంతరకు జన సాంద్రత తక్కువ ఉన్న ప్రదేశాల్లో, సముద్రతీరానికి దగ్గర ఉన్న ప్రదేశాల్లో నెలకొల్పడం జరుగుతుంది. బొగ్గు ఆధారితమైనా, అణుశక్తి ఆధారితమైనా విద్యుదుత్పాదనా కేంద్రాలు నెలకొల్పే ప్రతిపాదన వచ్చినప్పుడు సంబంధిత ప్రాంత ప్రజలు కాలుష్యం కారణమో, ప్రమాదాలు జరిగే అవకాశమో నేపథ్యంగా 'అసలు ఇటువంటి ప్రాజెక్టు మా ప్రాంతంలో వద్దే వద్దనడం' జరుగుతోంది. మరి మనం అదనపు విద్యుత్ సామర్థ్యాన్ని ఎలా నెలకొల్పుగలుగుతాము? 'స్విచ్ నొక్కగానే లైటు వెలగాలి. పంపు సెట్టు నుంచి నీళ్ళు పారాలి కాని విద్యుత్ కేంద్రం మాత్రం మా దగ్గర పెట్ట వద్దు, ఇంకెక్కడైనా పెట్టి మాకు విద్యుత్ మాత్రం కోతలు లేకుండా సరఫరా చేయండి' అంటే ఎలా సాధ్యం? అలా అని మనం ఎక్కడి విద్యుత్ అవసరాలకు అక్కడ, సరిపడ చిన్న చిన్న విద్యుదుత్పాదనా కేంద్రాలు తాలూకా స్థాయిలోనో, జిల్లా స్థాయిలోనో పెడితే ఈ సమస్య పరిష్కారమవుతుందా? ఆ విధంగా చేస్తే, విద్యుత్ ఖరీదు రెండు మూడు రెట్లు అవుతుంది. అసలు విద్యుచ్ఛక్తితో అవసరంలేని జీవన విధానాన్ని అభివృద్ధి నమూనాలకు మనం పాటించదలిస్తే ఈ విషయంలో ఏ సమస్యా ఉండక పోవచ్చు. కానీ అటువంటిది ఆచరణ సాధ్యం కాదు కాబట్టి, ఈ సమస్యపై సాధ్యమైన పరిష్కార మార్గాలు అన్నీ పరిశీలించి, ఆచరణ సాధ్యమైనవి ఏ ఒక్కటీ వదిలిపెట్టకుండా అమలు చేసుకుంటూ అవసరమైన మేరకు విద్యుదుత్పాదన కేంద్రాలను నెలకొల్పుకోవాలి.

ఈ సందర్భంగా ఈ క్రింది అంశాలన్నింటినీ పరిశీలించవచ్చును. (అ) ప్రభుత్వ రంగంలోనైనా, ప్రైవేటు రంగంలోనైనా విద్యుదు త్పాదన కేంద్రాల స్థాపనకైనా భూసేకరణ వీలైనంతవరకు 'అంగీకార పద్ధతి'పైననే జరపాలి. నష్టపరిహారం ఉదారంగా ఇవ్వాలి. (ఆ) ఇప్పుడు అమలులో ఉన్న 'వాణిజ్య విద్యుదుత్పాదన కేంద్రాల' విధానం చాలా అన్యాయమైనది, దుర్మార్గమైనదీనూ. పెట్టుబడి ఉన్న వాళ్ళు 'మేం ఎక్కడైనా విద్యుదుత్పత్తి కేంద్రాలు పెట్టుకుంటాము ఆ విద్యుచ్ఛక్తిని దేశంలో ఎక్కడైనా మంచి ధర వచ్చిన చోట అమ్ముకుంటాము' అంటే మరి ఆ విద్యుత్కేంద్రానికి తమ భూమి ఇచ్చి, దాని కాలుష్యాన్ని భరించే ప్రాంత/రాష్ట్ర ప్రజల మాటేమిటి? కనుక ఈ విధానాన్ని సమూలంగా మార్చాలి. దేశంలో ఎక్కడైనా, వాణిజ్య విద్యుదుత్పత్తి చేయటానికి ప్రైవేటు పెట్టుబడిదారులు ముందుకొచ్చినప్పుడు కనీసం 50 లేదా 33 శాతం విద్యుత్తును 'ఉత్పత్తి ఖర్చు, కనీస లాభం పద్ధతిపై ఆ రాష్ట్రానికే సరఫరా చేయాలి. ఈ విధంగా, ఈ విద్యుదుత్పాదన కేంద్రాల వలన కలిగే కాలుష్యం, కష్టనష్టాలను భరించినందుకు ఆ రాష్ట్రానికి, ప్రజలకూ న్యాయం జరుగుతుంది. (ఇ) ఇదే విధంగా బొగ్గు ఆధారిత విద్యుదుత్పాదనే కేంద్రాలు నెలకొల్పబడిన ప్రదేశానికి కొంత నిర్దిష్ట పరిధిలో ఉన్న గ్రామాలలోని అర్హులైన యువతీ యువకులకు ఆ ప్రాజెక్టులో ఉపాధి కల్పించాలి. ఒక స్థాయి వరకు ఉన్న ఉద్యోగాల ఎంపికలో ఖచ్చితమైన ప్రాధాన్యాన్ని వారికి (అర్హతలకు లోబడి) ఇవ్వాలి. ఇలా ఆ విద్యుదుత్పాదనా కేంద్రాలో ఆ చుట్టూ పక్కల గ్రామ ప్రజలను భాగస్వాములను చేయవచ్చు. (ఈ) విద్యుత్ ప్రాజెక్టు నెలకొని ఉన్న గ్రామం, దానికి నాలుగు వైపులా ఉన్న సమీప గ్రామాలకూ, నిర్ణీత స్థాయిలో (ఇంటికి నెలకు కొన్ని యూనిట్లచొప్పున) విద్యుదుత్పత్తి కేంద్రం నుంచి దాని ఖర్చు పై ఉచిత విద్యుత్ సరఫరా చేయవచ్చు. ఇదే విధంగా విద్యుత్ ప్రాజెక్టుకు కొంత దూరం లోపల ఉన్న అన్ని గ్రామాల ప్రజలకూ శుభ్రమైన తాగునీటి సరఫరా బాధ్యత, ప్రాజెక్టులో భాగంగా చేయవచ్చు.

(ఉ) బొగ్గు ఆధారిత విద్యుదుత్పాదన కేంద్రాలు నెలకొల్పిన వెంటనే, ఆ ప్రాజెక్టులో భారత ప్రభుత్వ నిబంధనల మేరకు కాలుష్య నివారణ చర్యలు ఖచ్చితంగా అమలు అవుతున్నదీ లేనిదీ

ప్రతి సంవత్సరం లేదా ఆరునెలల కొకసారి స్వతంత్ర సంస్థచే 'పర్యావరణ ఆడిట్' వంటిది జరిపించాలి. ఇందులో ఆ ప్రాజెక్టు చుట్టుపక్కల గ్రామాల ప్రజల తరపున మంచిపేరున్న ఆ ప్రాంత స్వచ్ఛంద సంస్థను భాగస్వామిగా చేయాలి. (ఊ) వ్యర్థ పదార్థంగా విడుదలయ్యే బూడిద ఏ మాత్రం గాలిలోగాని, భూగర్భ జలాల్లో గాని కలువకుండా కచ్చితమైన ఏర్పాట్లు ఉండాలి. విడుదలయ్యే బూడిదను 100 శాతం ఆ విద్యుదుత్పాదన కేంద్రంలోనే సిమెంటు, ఫ్లై ఆష్ ఇటుకల కర్మాగారాలను నెలకొల్పాలి. ఈ రెండూ కూడా పనిచేయటానికి సిద్ధంగా ఉన్నప్పుడే విద్యుత్కేంద్రం పనిచేయటానికి అనుమతి ఇవ్వాలి. ఒకవేళ ఈ రెండు కర్మాగారాలూ పనిచేయటంలో ఏవైనా నష్టాలు వస్తే ఆ నష్టం విద్యుదుత్పాదన కేంద్రం ఖర్చులలో కలిపి, ఆ కేంద్రం ఉత్పత్తిచేసే విద్యుత్ ఖరీదును కూడా అవసరమైన మేరకు పెంచాలి. ఇలా బూడిదతో తయారైన సిమెంటు, ఇటుకలను ఆ సమీప గ్రామస్తులకు వారి అవసరం మేరకు తక్కువ ధరకు లేదా ఉత్పాదన ఖరీదుకే సరఫరా చేయాలి.

ఈ సూచనలన్నిటినీ పరిశీలించి అమలు చేస్తే విద్యుదుత్పాదనా కేంద్రాలు నెలకొల్పటానికి ఏ ప్రాంతంలో నైనా గ్రామస్తులు విముఖత చూపించకపోవచ్చు. సోంపేట వంటి ఉదంతాలను మనం పూర్తిగా నివారించవచ్చు. ఈ సందర్భంగా విద్యుదుత్పత్తి కేంద్రాలు నెలకొల్పే అంశం గురించి హర్యానాలోని ఒక గ్రామ మాజీ సర్పంచ్ చెప్పిన ఈ మాటలు ఆలోచింపజేసేవిగా ఉన్నాయి. 'విద్యుదుత్పాదన కేంద్రాలను ప్రభుత్వం దాని నెత్తిన పెట్టుకోలేదు కదా? వాటిని నెలకొల్పడానికి ఎక్కడో ఒకచోట భూమి అవసరం. మా భూములకు మంచి ధర ఇచ్చి, ఫ్యాక్టరీలో మాకు ఉద్యోగాలు కూడా ఇస్తే భూమి ఇవ్వటానికి మాకు అభ్యంతరం లేదు.' ❑

**- డా॥ సి.బి.ఎస్. వేంకటరమణ** (సీనియర్ ఐ.ఎ.ఎస్ అధికారి)

# రంగుమారిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలి

### 50శాతం పంట దెబ్బతిన్న వారికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి

అకాల వర్షాలతో తడిసి రంగు మారిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్.సి.ఐని, ప్రభుత్వ సంస్థలను వెంటనే రంగంలోకి దింపాలి. 50శాతం పంట దెబ్బతిన్న రైతులకు ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలి. కౌలురైతులకు కూడా సాయం అందేలా నిర్దిష్ట ఏర్పాట్లను చేయాలి. పంట నష్టం అంచనాలను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసేందుకు వీలుగా పక్క గ్రామాల నుంచి ఉపాధ్యాయులు, రాష్ట్రప్రభుత్వాన్ని ఇతర విభాగాల అధికారుల సేవల్ని కూడా వినియోగించాలి. ఎకరాకు కనీసం రూ.4,000 సబ్సిడీని ఇవ్వాలి. రైతులు స్థయిర్యం కోల్పోకుండా వెంటనే రబీ పంటకు వడ్డీలేకుండా రుణాల్ని అందించాలి.

మరోవైపు, రైతులు అల్లాడిపోతుంటే ధాన్యం కొనుగోలు చేయబోమంటూ రైస్ మిల్లర్లు సమ్మెకు దిగటం సబబు కాదు. కష్టాల్లో మునిగిఉన్న రైతుల్ని ఆదుకునేందుకు కలిసిరావాలి. డెల్టాలో మురుగువ్యవస్థను పూడిక తీయటంలో దీర్ఘకాల నిర్లక్ష్యం వల్ల వర్షం ప్రభావం తగ్గినా పొలాల్లో నీటిప్రవాహం తగ్గాక వరి రైతు పరిస్థితి దయనీయంగా ఉంది. చాలాచోట్ల పనల మీద ఉన్న ధాన్యం కింద మొలకలు మొదలయ్యాయి. ప్రభుత్వ సహాయచర్యలకు లోక్‌సత్తా పూర్తి తోడ్పాటునందిస్తుంది. అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో రైతు సంక్షోభానికి తొలి ప్రాధాన్యతనిచ్చి శాశ్వత పరిష్కారం అందించే దిశగా పార్టీలకతీతంగా చర్చ చేయాలి.

# హింసను ప్రోత్సహిస్తే నష్టపోయేది ఉద్యమాలే

### ప్రజాస్వామ్య విలువల కోసం అందరూ గళం విప్పాలి: లోక్‌సత్తా

రాష్ట్రవ్యాప్తంగా సాగిన ఉద్యమాలు, సంఘటనల సందర్భంగా పెట్టిన కేసుల ఉపసంహరణ అంశంపై శాసనసభలో చర్చ సందర్భంగా లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ చేసిన ప్రసంగం ఏదో ఒక ప్రాంతానికి, మతానికి ఉద్దేశించి చేసినదికాదు. విద్యార్థులు, యువతపై పెట్టిన కేసుల ఎత్తివేతను జేపీ వ్యతిరేకించకపోగా వారి పట్ల సానుభూతితో వ్యవహరించాలని కోరారు. అయితే కేసుల ఉపసంహరణకు కొన్ని ప్రమాణాలు ఉండాలని, హింసాత్మక ఘటనలు, దహనకాండ, విధ్వంసక ఘటనలు, బలవంతపు వసూళ్ల ఘటనలలో ప్రమేయం ఉన్న కేసులను మినహాయించాలన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతల కోసం ఇలాంటి ప్రమాణాలు అవసరమవుతాయి. కేసుల ఉపసంహరణకు సూత్రబద్ధమైన ప్రమాణాలు సూచించడాన్ని ఒక ప్రాంతానికి వ్యతిరేకంగా, మరో ప్రాంతానికి అనుకూలంగా చిత్రీకరించటం వాస్తవాల్ని వక్రీకరించటమే తప్ప వేరు కాదు.

"కేసుల ఎత్తివేత అన్ని ప్రాంతాలకూ సంబంధించినది. అందుచేత దీనికి ప్రాంతాల రంగు పులమడం పూర్తిగా అనుచితం". ప్రజాస్వామ్య విలువలకు, అన్ని ప్రాంతాల ప్రయోజనాలకూ కట్టుబడిన లోక్‌సత్తా పార్టీ ఆఫీసులపై దాడుల్ని ప్రోత్సహించటం, కొన్ని ప్రాంతాల్లో తిరగనివ్వబోమని ప్రకటనలు చెయ్యటం అప్రజాస్వామికమైనది.

# అవినీతిపై పోరాడదాం

అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం సందర్భంగా లోక్‌సత్తా ప్రధాన కార్యాలయంలో పార్టీ లీగల్‌సెల్ రాష్ట్ర కన్వీనర్ సివిఎల్ నరసింహారావు ఆధ్వర్యంలో అక్టోబర్9న జరిగిన కార్యక్రమంలో వివిధ పార్టీలు, సామాజికసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో, దేశంలో అవినీతిపై పోరాడేవారి కొరత తీవ్రంగా ఉంది. అవినీతి అంతం కోసం పట్టుదలతో, చిత్తశుద్ధితో పనిచేసే వారు పెద్దసంఖ్యలో ముందుకు రావాలి. ప్రజలు కూడా అవినీతి కుంభకోణాల పట్ల మౌనప్రేక్షకుల్లా వ్యవహరించకుండా తమ పరిధిలో అవినీతిని ప్రశ్నించటం, దోషుల్ని శిక్షించేందుకు పోరాడటం చేస్తే తప్ప దేశాన్ని అవినీతి మహమ్మారి నుంచి బైటపడేయలేము. ఇందుకు సమాచార హక్కు చట్టాన్ని ఆయుధంగా ఉపయోగించుకోవాలి. ఎన్నికల్లో ప్రలోభాలకు లోనుకాకుండా నిజాయతీపరులైన అభ్యర్థులను ఎన్నుకోవాలి. అవినీతి మీద బహుముఖ పోరాటంలో భాగంగా స్వతంత్ర ప్రతిపత్తిగల అవినీతి వ్యతిరేక కమిషన్‌ను రాష్ట్ర, జాతీయస్థాయిలో ఏర్పాటు చేయాలి. పాలనలో పారదర్శకతను పెంచటం, అధికారాన్ని వికేంద్రీకరించి ప్రజల్ని భాగస్వాముల్ని చేయటం అవసరం. లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే డా॥ జయప్రకాష్ నారాయణ్ రూపొందించిన అవినీతి వ్యతిరేక బిల్లును చట్టం చేయటం అవసరం. రాష్ట్రంలో జరిగిన ఎమ్మార్ కుంభకోణంపై న్యాయపోరాటం చేస్తున్న న్యాయవాది శ్రీరంగారావుకు సమావేశం పూర్తి మద్దతను ప్రకటించింది. ఆ పోరాటాన్ని చివరికంటా తీసుకెళ్లి అవినీతిపై విజయాన్ని నమోదు చేసి, సామాన్యరైతులు కోల్పోయిన భూముల్ని వారికి తిరిగిచ్చి దేశానికి ఒక సందేశాన్ని రాష్ట్రం నుంచే ఇవ్వాలి. అవినీతికి వ్యతిరేకంగా పోరాడటానికి ఒక యాంటీ కరప్షన్ ఫోర్స్‌ను రాజకీయాలకతీతతంగా పార్టీలు, పౌరసమాజం భాగస్వామ్యంతో ఏర్పాటుచేయాలని లీగల్‌సెల్ నిర్ణయించింది.

అవినీతి అంటే కేవలం లంచం తీసుకోవటమేకాదు. ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటూ చేయాల్సిన పనిని చేయకపోవటం కూడా అవినీతే. తప్పు జరిగితే న్యాయవ్యవస్థనైనా ప్రశ్నించే చైతన్యం ప్రజల్లో రావాలి. ఒక్కో ఎమ్మెల్యే ఎన్నికల్లో కనీసం రూ.2–5 కోట్లు ఖర్చు చేయగలిగితేనే టికెట్లు ఇస్తున్నారు. జెడ్‌పీటీసీలు కూడా కోట్లలో ఖర్చుపెడుతున్నారు. అలా డబ్బును వెదజల్లి, అంతకు కొన్ని రెట్లు ఆర్జించుకోవటానికి అవినీతికి పాల్పడటం ఒక విషవలయంగా మారింది. ఆ సంస్కృతిని మార్చి... నిజాయతీ, అర్హత గలవారే గెలిచే మంచి రాజకీయాన్ని తేవటం అవినీతి వ్యతిరేక పోరాటంలో కీలకం కావాలి. 2–జీ స్పెక్ట్రం కుంభకోణం చూశాక ఇక దేశానికి రక్షణ ఏమిటి అనే భయం పట్టుకుంది. ఇది ప్రతిఒక్కరూ తీవ్రంగా పరిగణించాల్సిన విషయం. అవినీతిపై లోక్‌సత్తా పార్టీ చేస్తున్న పోరాటంలో భాగస్వాములమవుతామని, ఎన్నికల సమయంలో తప్ప మిగిలిన సమయంలో ప్రజాపోరాటాల మీద పార్టీలకతీతంగా కృషి చేయాలి. పైస్థాయిలో, క్షేత్రస్థాయిలో ఏకకాలంలో అవినీతిపై పోరాటం జరగాలి.

లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి. భాస్కరరావు మాట్లాడుతూ "1967 వరకూ రాజకీయ నేతల పట్ల ప్రజల్లో విశ్వాసం ఉండేది. అప్పుడు మొదలైన రాజకీయ అవినీతితో ప్రజలు అధికార గణాన్ని నమ్ముకున్నారు. వారు కూడా అవినీతిపరులు కావటంతో న్యాయవ్యవస్థను నమ్ముకున్నారు. చివరకు న్యాయవ్యవస్థ కూడా అవినీతిమయం కావటంతో ఇక ప్రజలకు అవినీతి గురించి చెప్పుకునే దిక్కు లేకుండా పోయింది. చదువు పెరుగుతున్న కొద్దీ ప్రజల్లో అవినీతిపై స్పందించే శక్తి కొరవడటం ఆందోళనకరం. భగత్‌సింగ్‌లు, సుభాష్‌బోస్‌లు పక్కవారి ఇళ్లలో పుట్టాలనుకునే ధోరణి వీడాలి. ఆత్మపరిశీలన చేసుకుని అవినీతి వ్యతిరేక పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలి" అన్నారు. ఎమ్మార్ అవినీతిపై న్యాయపోరాటం చేస్తున్న శ్రీరంగారావు మాట్లాడుతూ, "ఎమ్మార్ సుమారు రూ.11,000కోట్ల కుంభకోణమని, పార్టీలతో సంబంధం లేకుండానే సమాచార హక్కు చట్టం ద్వారా దాదాపు 650 డాక్యుమెంట్లను సేకరించి అవినీతి నిరోధక చట్టం ద్వారా పోరాడుతున్నా, ఎమ్మార్‌తో ఒప్పందంలో ఏపీఐఐసీ వాటా 49 నుంచి 26కు దిగిపోయి, ఆ తర్వాత రాజకీయ పెద్దల అండదండలతో జరిగిన అక్రమాల వల్ల చివరికి 6.5 శాతం మాత్రమే వచ్చే పరిస్థితి ఉంది. ప్రజలు ఎన్నికల్లో డబ్బు అడుగుతున్నారు కాబట్టే తాము అవినీతికి పాల్పడుతున్నామని చాలా రాజకీయ పార్టీల నేతలు చేస్తున్న వాదనలు సిగ్గుచేటని, బీహార్‌లో నితీష్‌కుమార్, గుజరాత్, ఒరిస్సాలలో నరేంద్రమోడి, నవీన్ పట్నాయక్‌లను చూసైనా సిగ్గుతెచ్చుకుని సుపరిపాలన, కనీస విలువల ద్వారా నెగ్గటం అలవర్చుకోవాలి" అన్నారు.

సిటిజన్ ఛార్టర్ల అమలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించటం ద్వారా అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలి. అవినీతిపై ప్రజల్లో చైతన్యం పెంచటం కోసం 2–జీ స్పెక్ట్రం కుంభకోణంపై లోక్‌సత్తా భారీ సంఖ్యలో పోస్టుకార్డుల్ని రాయించి ప్రధాని కార్యాలయానికి రాయించి పంపింది. అవినీతిని అంతం చేసేందుకు సమగ్రపోరాటం అవసరం. ❑

# సంజీవని

## సెక్షన్ 4(1)(బి) మీద సంజీవని యుద్ధభేరి!!

సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి ఐదు వసంతాలు పూర్తి అయిన శుభ తరుణంలో, ఆ హక్కు మనకు అందించ దలచిన ఫలాలను అందరికి అందుబాటులోకి తెచ్చేందుకు ఏదైన వినూత్నంగా చెయ్యాలన్న లోక్‌సత్తా సంజీవని సూత్రదారుల తలపుల్లో నుండి, తపనలో నుండి పుట్టినదే ఈ 'సెక్షన్4(1)(బి)పై యుద్ధభేరి' ఘట్టం. అందులో భాగంగా, ఒకటో రెండో కాదు.. పదులూ ఇరవైలూ కాదు... ఏకంగా 500 ఆర్.టి.ఐ దరఖాస్తులు, ఒకే సెక్షన్ 4(1)(బి) మీద పెట్టి, ఒక చరిత్రాత్మక మార్పుకు శ్రీకారం చుట్టారు సంజీవని సభ్యులు. ఈ దరఖాస్తులలో అధిక భాగం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ శాఖలు మరియు సచివాలయంలోని వివిధ విభాగాల ప్రధాన కార్యదర్శులకు, మిగిలినవి రంగారెడ్డి, నల్గొండ మరియు హైదరాబాద్ జిల్లాల కార్యాలయాలకు ఉద్దేశింపబడినవి. దరఖాస్తులకు వచ్చిన సమాధానాలు స్వల్పంగాను, అసంతృప్తికరంగాను ఉండటంతో సంజీవని బృంద సభ్యులు 350 ఫిర్యాదులు దాఖలు చేసారు.

## సెక్షన్4(1)(బి) ఏం చెపుతోందంటే :

సమాచార హక్కు చట్టం చేసిన తేదీ నుండి 120 రోజుల లోపు, ప్రభుత్వ కార్యాలయాలు ఈ క్రింది అంశాలను ప్రకటించాలి. సంస్థ నిర్మాణ స్వరూపం, విధులు, కర్తవ్యాల వివరాలు, దాని అధికారుల, ఉద్యోగుల అధికారాలు, విధులు, పర్యవేక్షణ, జవాబుదారీతనంతో, సహ నిర్ణయాలు చేసే ప్రక్రియలో అనుసరించే కార్య విధానం, కార్యకలాపాలు నిర్వర్తించేందుకు రూపొందించినట్టి ప్రమాణాలు కార్యకలాపాలు నిర్వర్తించేందుకు తమ ఉద్యోగులకు సంబంధించిన నియమాలు, నిబంధనలు, ఆదేశాలు లేదా తమ నియంత్రణ క్రింద ఉన్న లేదా తాము ఉపయోగించే నియమాలను వివరించే సంపుటిలు, రికార్డులు, తమ అధికారుల, ఉద్యోగుల డైరెక్టరి, తమ అధికారులు, ఉద్యోగులలో ప్రతి ఒక్కరు తీసుకునే నెల వారి ప్రతిఫలం, తమ నిబంధనలలో వీలు కల్పించిన విధంగా పరిహార విధానం, అన్ని ప్రణాళికలు, ప్రతిపాదిత వ్యయాలు, చేసిన పంపిణీలపై నివేదికల వివరాలను సూచిస్తూ తమ ఏజెన్సీలో ప్రతి ఒక్కరికి కేటాయించిన బడ్జెటు వివరాలు, తదితరాలు.

## సంజీవని ఈ సెక్షన్‌నే ఎందుకు ఎంచుకున్నదంటే :

ఏ ప్రభుత్వమైనా సక్రమంగా పని చేయాలంటే, దానికి తప్పక తోడుండవలసినవి – జవాబుదారీతనం, పారదర్శకత, సమర్థులైన అధికారులు. అయితే మొదటి తప్పక అమలయ్యే సమాజంలో, సమర్థులైన అధికారులు, వాళ్ళంతట వాళ్ళే పుట్టుకొస్తారన్నది చరిత్ర నేర్పిన పాఠం, ఈ సెక్షన్ రూపకల్పనలో అంతర్లీనంగా దాగి ఉన్న రహస్యము, తద్వారా ఇది సమాజానికి చేయబోయే సాయము, ఇదే...!

ఈ సెక్షన్ అందుబాటులో ఉంచమని కోరినది, ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి, అతి ప్రాథమిక సమాచారం. ప్రతి కార్యాలయము ఈ వివరాలను ప్రకటించడం వలన , ప్రజలకు ఏ సమస్యకు ఎవరిని సంప్రదించాలో తేలిగ్గా అర్థం అవుతుంది. అనవసర ప్రయాసలూ, అక్కర్లేని ప్రయాణాలూ తగ్గుతాయి. పారదర్శకత పెరుగుతుంది. ఏ పనికి ఏ ప్రభుత్వ అధికారి బాధ్యుడో స్పష్టంగా తెలియడం వల్ల, తరచుగా జరిగే జాప్యాలకు సంబంధిత అధికారులను ప్రశ్నించేందుకు వీలు చిక్కుతుంది. తత్ఫలితంగా, జవాబుదారీతనం పెరిగి, అధికారులు మరింత సమర్థవంతంగా పని చేసేందుకు అవకాశాలు మెరుగు పడతాయి.

## సంజీవని స్ఫూర్తి - సమాలోచనలు :

ప్రజల యొక్క – ప్రజలచేత – ప్రజలకొరకు – అన్న సిద్ధాంతం ఇకపై కాగితాలకే పరిమితమా అన్న సందేహం బాధ్యతలెరిగిన కొందరు పౌరులను వేధిస్తున్న తరుణంలో కొడిగడుతున్న ఆశా దీపాన్ని వెలిగించేందుకు, ప్రజాస్వామ్యపు సిసలైన స్ఫూర్తిని మిగిల్చేందుకు, రగిల్చేందుకు వచ్చినదే, "సమాచార హక్కు చట్టం" ఈ చట్టం భారత దేశపు సగటు పౌరుడి చేతిలోని సుదర్శన చక్రం అని తెలుసుకోవడం తొలి అడుగయితే, దానిని సెక్షన్ 4(1)(బి) లాంటి ఒక ముఖ్యమైన విభాగపు పని తీరు పర్యవేక్షణకై ఉపయోగించాలని సంజీవని నిర్ణయించుకోవడం మలి అడుగు.

ఆలోచనలు రేకెత్తినది మొదలు, బృంద నాయకుడిగా, అబ్దుల్ అజీజ్ నెల రోజులకు పైగా శ్రమించి దీనికి సంభందించిన వివరాలను సేకరించి, పకడ్బందీ ప్రణాళికను రూపొందించడం ఒక ఎత్తయితే, పది మందికి పైగా సభ్యులు, పిలవగానే 'నేను సైతం' అంటూ వచ్చి, వారి వారి పనులను నిర్ణీత సమయంలోనే పూర్తి చేసి, సంపూర్ణ సహాయ సహకారాలు అందించడం మరో ఎత్తు. ఎడతెరిపి లేకుండా సాగే ఆఫీసు పనుల మధ్యలోనూ, రాక రాక వచ్చే సెలవు రోజుల్లోనూ, విసుగూ విరామం లేకుండా, వంకలు చెప్పి తప్పించుకు పోకుండా, ఒక గురుతర బాధ్యతలా దీనిని స్వీకరించడంలో వారు చూపించిన స్ఫూర్తి అనితర సాధ్యం!

## ఈ బృహత్కార్యాన్ని భుజాలకెత్తుకున్న బృంద సభ్యులు :

ఎలక్షన్ రెడ్డి, సంతోష్ కుమార్ గౌత, భరత్, అవనీష్ జోషి, ఉదయ్ భాస్కర్, నరసింహరావు, మధు, ప్రదీప్ దండు, శ్రీనివాస రావు గంజి, సావన్, సుబ్రహ్మణ్యం, అభిలాష్ గార్లపాటి మరియు అబ్దుల్ అజీజ్.

**అధికారుల స్పందన :**

సమాచార హక్కు చట్టం ప్రతీ ప్రభుత్వ కార్యాలయానికి ఒక ప్రభుత్వ సమాచార అధికారిని నియమించింది. ప్రతీ అధికారికి సెక్షన్ 4(1)(బి) తాలూకు సమాచారం సమకూర్చే బాధ్యత వుంది. నియమాల ప్రకారం ఈ సమాచారమంతా, అక్టోబర్ 12, 2005 నాటికే అందుబాటులో ఉండాలి. అలా ఉన్నట్లయితే, మన దరఖాస్తులకు, వెనువెంటనే జవాబులూ రావాలి. అయితే ఈకార్యక్రమానికి సంబంధించి సంజీవని అనుభవాలు మాత్రం నిరాశాజనకంగానే ఉన్నాయి.

స్థూలంగా చెప్పాలంటే, ఈ దరఖాస్తులకు వచ్చిన అధికారిక స్పందన, ప్రభుత్వ శాఖలు, కార్యాలయాల యందు సమాచార హక్కు చట్టంలోని ఈ ముఖ్యమైన అంశాన్ని అమలు పరచటం పట్ల నెలకొన్న తీవ్రమైన నిర్లక్ష్యానికి నిలువెత్తు దర్పణంగా నిలిచింది. సరైన, సంపూర్ణమైన సమాచారాన్ని అభ్యర్థించిన విధంగా పంపడమే కాక, అంతర్జాలంలో కూడా అందుబాటులో ఉంచిన కార్యాలయాల సంఖ్య అతి స్వల్పంగా ఉండడం దురదృష్టకరం. సమాచారాన్ని తెలుగులో సైతం అందిస్తున్న వారి సంఖ్యా దీనికి భిన్నంగా లేదు. సంబంధిత అధికారులు కొందరు సమాచారాన్ని పంపకపోగా, నియమాలకు విరుద్ధంగా, సీడీలు, తపాలా చార్జీలు, తర్జుమా చార్జీల నిమిత్తం పది వేల రూపాయల వరకు అధికారికంగా జమ కట్టమనడం ఆశ్చర్యకరం. అసలీ సమాచారాన్ని అందిచ్చే అవసరమే లేదని తప్పించుకోజూసిన వారూ లేకపోలేదు. ప్రధాన కార్యాలయాలదే ముఖ్య సమాచార నిర్వహణ బాధ్యత అని స్థానిక కార్యాలయాలూ, అన్ని ప్రాంతీయ కార్యాలయాల సమాచారాన్ని భద్రపరచడం మాకు సాధ్యం కాని పని అంటూ ప్రధాన కార్యాలయాలూ, సంజీవని చేసిన అభ్యర్థనలను తోసిరాజనడం తీవ్రమైన నిరాశకు గురి చేయడమే కాక, ప్రాంతీయ ప్రధాన కార్యాలయాల మధ్య నిర్వహణ రీత్యా పేరుకు పోయిన అస్పష్టతను తేటతెల్లం చేసింది.

**సంజీవని ప్రతిస్పందన :**

దరఖాస్తులకు వచ్చిన సమాధానాలు స్వల్పంగానూ, అసంతృప్తికరంగానూ ఉండటంతో సంజీవని బృంద సభ్యులు 350 ఫిర్యాదులు దాఖలు చేసారు. ఆర్.టి.ఐ.సెక్షన్ 18(1) కింద (బి) తిరస్కరించబడిన, (సి) జవాబు రాని, (డి) డబ్బు జమా కోరిన మరియు (ఇ) అసంపూర్ణమైన సమాధానాలు వచ్చిన వాటిపై ఫిర్యాదులు దాఖలు చేసారు. బృంద సభ్యులు సంబంధిత సమాచార అధికారుల వివరాలు, వారి చిరునామాలు, మరియు జవాబులకు సంబంధించిన గణాంకాల వివరాలన్నీ లిఖిత పూర్వకంగా ప్రకటిస్తున్నారు.

**తక్షణ చర్యలు చేపట్టేనా ఇకనైనా :**

లోక్‌సత్తా సంజీవని రాష్ట్ర ప్రభుత్వాన్ని మరియు సమాచార కమీషన్‌ను, సమాచార హక్కు చట్ట నిబంధనల అమలులో వేళ్ళూనుకుని ఉన్న నిర్లక్ష్య వైఖరిని ఖండించి, సంపూర్ణ ఆచరణకు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతోంది. ఈ సందర్భంగా, కేంద్రీయ సమాచార కమీషన్ శాఖలు మరియు కార్యాలయాలు ఆర్.టి.ఐ.లకు కట్టుబడి, సెక్షన్ 4(1)(బి) ఆవశ్యకతను గుర్తించి, దాని సక్రమ అమలుకు చేసిన కృషి ప్రస్తావనార్హం, ప్రశంసనీయం. వారిని ఆదర్శంగా తీసుకుని, ఆంధ్ర ప్రదేశ్ సైతం ఈ హక్కు అమలుకై సంపూర్ణ సహకారాన్ని అందించిన నాడే, ప్రభుత్వ యంత్రాంగం పని తీరుపై ప్రజల్లో నెలకొన్న సందేహాలకు ఒక సమర్ధవంతమయిన సమాధానాన్ని ఆశించగలం. సంజీవని పౌరులందరికి సమాచార హక్కు చట్టం అమలుకు తమ వంతు కృషి చెయ్యాలనీ, తద్వారా పరిణమించే బహువిధ ప్రయోజనాలను సాధించుకోనేందుకు సన్నద్దులు కావాలని పిలుపునిస్తోంది. ❑

అనువాదం : **మానస & సందీప్ పట్టెం**

## రైతుల తక్షణ, దీర్ఘకాల సమస్యలపై రాజకీయాలకతీతంగా పోరు చేద్దాం

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడి నిరాహారదీక్షను భగ్నం చేసినందుకు నిరసనగా ఆ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను తీవ్ర అవస్థలకు గురిచేసే బంద్, రాస్తారోకోలు చేపట్టటం సమర్ధనీయం కాదు. రైతుల కోసం ఎవరు పోరాటం చేసినా లోక్‌సత్తా స్వాగతిస్తుంది. అయితే వ్యవసాయ సంక్షోభాన్ని పక్కదోవ పట్టించేలా కేవలం డిసెంబర్ 7,8 తేదీల్లో కురిసిన వర్షాల వల్లే రైతులకు కష్టాలు వచ్చినట్టు తక్షణ ప్రయోజనాలకు పరిమితం కావటం, బందలు, రాస్తారోకోలకు దిగటాన్ని నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తుంది.

ప్రకృతి ఆటుపోట్లను కూడా తట్టుకుని నిలబడేలా రైతుకు లాభసాటి ధర అందించటం, అందుకోసం రైతులు తమ ఉత్పత్తుల్ని ప్రపంచంలో డిమాండ్ ఉన్న చోట అమ్ముకునే వీలు కల్పించటం అసలైన అంశం. ఆ కీలకాంశం ప్రస్తుతం పక్కదోవ పడుతోంది. బంద్, రాస్తారోకోల వల్ల అనేకచోట్ల రాకపోకలు నిలిచిపోవటం, బస్సుల్ని ధ్వంసం చేయటం వంటి చర్యల వల్ల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. చంద్రబాబు నాయుడు ఏ రైతుల కోసం ఆందోళన చేస్తున్నారో వారి ప్రయోజనాలను కూడా దెబ్బతీస్తుంది. "రైతులు తమ ఉత్పత్తుల్ని మార్కెట్ యార్డులకు తీసుకెళ్లలేకపోయారు. రోజు కూలీలు, చిన్న వ్యాపారులు తమ ఆదాయాన్ని కోల్పోయారు. చాలాచోట్ల సామాన్య ప్రజల అత్యవసర వైద్యసేవలకు ఆటంకం ఏర్పడింది. ఇప్పటికే బందలతో ప్రజలు విసిగిపోయారు. పరిణితి, బాధ్యతగల ప్రధాన ప్రతిపక్షంగా తెలుగుదేశం బందలు, రాస్తారోకోలకు దిగి జనజీవనాన్ని స్తంభింపచేయటం సరికాదు".

# యువతతోనే అవినీతి అంతం

## మరో స్వాతంత్ర్య సమరానికి సన్నద్ధం కండి : జేపీ

***డిసెంబర్ 9, అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం సందర్భంగా విశాఖపట్నంలో జరిగిన అవినీతి వ్యతిరేక వాక్, బహిరంగ సభలో లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పాల్గొన్నారు. 'యూత్ ఫర్ బెటర్ ఇండియా' పేరిట విద్యార్థిసత్తా రాష్ట్ర అధ్యక్షుడు పి.శివాజీ చేపట్టిన ఈ కార్యక్రమంలో... జేపీతోపాటు విద్యార్థులు, యువత పెద్దసంఖ్యలో ఉదయం 9గంటలకు విశాఖ రామకృష్ణా బీచ్ కాళీ దేవాలయం ప్రాంగణం నుంచి నడకగా బయల్దేరి 2.6 కిలోమీటర్ల దూరంలోని వై.ఎం.సి.ఎ ప్రాంగణానికి చేరుకుని బహిరంగ సభను నిర్వహించారు. అవినీతికి వ్యతిరేకంగా యువత చేత జేపీ ప్రతిజ్ఞ చేయించారు.***

"దేశంలో ఇప్పుడు అవినీతి, దోపిడీ వ్యవస్థ రాజ్యమేలుతున్నాయి. రాజకీయం వ్యాపారమైంది. అధికారం ఆదాయ మార్గంగా మారింది. వీటన్నింటినీ సమర్థంగా ఎదుర్కొనడం యువత వల్లే సాధ్యమవుతుంది. వారు గళమెత్తితే అవినీతి రహిత సమాజం ఆవిష్కృతమవుతుంది" అని లోక్‌సత్తా జాతీయ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో 73 శాతం మంది యువతే అని, భవిష్య భారతం వారివైపే ఎంతో ఆశగా చూస్తోందన్నారు. పెచ్చరిల్లిపోతున్న అవినీతి, కుళ్లిపోయిన ప్రభుత్వ వ్యవస్థను మార్చాలంటే తొలుత రాజకీయాల్లో సమూల మార్పులు తేవాలన్నారు. అవినీతి రహిత సమాజ స్థాపనకు రెండో స్వాతంత్ర్య సమరం అవసన్న మైందన్నారు. యువతీ యువకులు నిరాశ, నిస్పృహలను వీడి సమాజ చైతన్యానికి పూనుకోవాలని పిలుపునిచ్చారు. అవినీతిని ఉక్కుపాదంతో అణచివేసేందుకు మౌనం వీడండి. గొంతు విప్పండి. కదం తొక్కండి. భుజం కలపండి. అంటూ ఉద్వేగంగా ఉద్బోధించారు. రూ॥1.76 లక్షల కోట్ల స్పెక్ట్రం కుంభకోణానికి బాధ్యులైనవారి ఆస్తులన్నీ జప్తు చేసి, జీవితాంతం కారాగారంలో ఉంచాలని ఆవేశంగా అన్నారు. అక్రమంగా స్పెక్ట్రం లైసెన్సులు పొందిన వారి నుంచి విండ్‌ఫాల్ ప్రాఫిట్ ట్యాక్స్ చట్టం కింద సొమ్ము వసూలు చేయాలని సూచించారు. వారికి ఇచ్చిన లైసెన్సులు రద్దుచేసి తాజాగా టెండర్లు పిలవాలన్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో గనుల లీజు వ్యవహారాల్లోనూ ఇదే పద్ధతి పాటించాలన్నారు. స్పెక్ట్రం వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) నియామకం పేరిట అధికార, ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయని జేపీ ఆరోపించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ దేశంలో ఇతర వ్యవస్థలతో పాటు న్యాయ, పత్రికా వ్యవస్థలు కూడా అవినీతితో భ్రష్టు పట్టాయని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే అద్భుతాలు జరగబోవు.. ఉపద్రవాలేవీ ముంచుకురావని అభిప్రాయపడ్డారు.

### మేము సైతం... అవినీతిపై పోరుసాగిస్తాం!

అవినీతికి వ్యతిరేకంగా పరస్పరం చేయికలుపుతాం.. యువసత్తా ఏంటో చూపిస్తాం అంటూ విద్యార్థులు ముందుకు కదిలారు. ప్రపంచ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా యూత్‌ఫర్ బెటర్ ఇండియా సంస్థ ఇచ్చిన పిలుపు మేరకు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, యువతీ, యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కాళీమాత ఆలయం వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ బీచ్‌రోడ్డులో వై.ఎం.సి.ఎ. వరకు సాగింది. విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ అధ్యక్షులు జయప్రకాష్‌నారాయణ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అవినీతి వ్యతిరేక పోరాటానికి యువసత్తా అవసరమేంటో వివరించారు. అవినీతి భూతం దిష్టిబొమ్మను సముద్రంలో నిమజ్జనం చేశారు. ఈ ర్యాలీలో లోక్‌సత్తా నాయకులు విష్ణుమూర్తి, బిహారీలాల్, యూబీఐ సంస్థ ప్రతినిధులు శివాజీ, విజయ్‌భాస్కర్, వేణు తదితరులుపాల్గొన్నారు.

### జేపీ ఆటోగ్రాఫ్‌కు యువత ఉత్సాహం

విద్యార్థుల్లో 'స్ఫూర్తిని రగిలిస్తున్న జేపీ ఒక్కసారిగా వారి మధ్యకు రావడంతో యువతీయువకుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ర్యాలీలో పాల్గొన్న జయప్రకాష్‌నారాయణను విద్యార్థులు అనుసరించారు. చివర్లో జేపీ ఆటోగ్రాఫ్ కోసం ఎగబడ్డారు. ❏

## 11న బెంగళూరులో జరిగిన అవినీతి వ్యతిరేక ర్యాలీలో పాల్గొన్న జేపీ

అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని డిసెంబర్ 11న బెంగళూరులో జరిగిన అవినీతి వ్యతిరేక ర్యాలీలో లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పాల్గొన్నారు. కర్ణాటక లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 20కిపైగా పౌరసమాజ సంస్థలు, నిజాయతీకి పేరొందిన జస్టిస్ వెంకటాచలయ్య వంటి ప్రముఖులు కూడా పాల్గొన్నారు.

# పౌరసేవాకేంద్రం

**సరూర్‌నగర్ డివిజన్/ గ్రేటర్ హైదరాబాద్**

గత 14 సంవత్సరాలుగా ఎస్‌బీహెచ్ కాలనీ, వెంచర్ III ఎల్‌బీనగర్, హైదరాబాద్‌లో రాష్ట్ర కాలుష్య నియంత్రణమండలి అనుమతి లేకుండా ఏర్పాటైన Tavhio Enterprise (ప్లైఉడ్‌ఫ్యాక్టరీ, నుంచి వెలువడుతున్న పొగ. దుమ్ము, ధూళీ, దుర్వాసనల వలన కాలనీలో వందలాది మంది పిల్లలు, వృద్ధులు, మహిళలు, ప్రజలు అనారోగ్యం అవస్థలు పడుతున్నారు.

ఈ విషయమై కాలనీవాసులు ఎన్నోసార్లు కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు, పురపాలక సంఘం అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదు. కాలనీ వాసులు తేది: 23.10.2010న పౌరసేవాకేంద్రానికి ఇచ్చిన వినతిమేరకు కాలుష్యకారకప్లైఉడ్ ఫ్యాక్టరీపై చట్టపరమైన చర్యలు తీసుకోవలసింది. తేది: 25.10.2010న భారత ప్రభుత్వం, పర్యావరణశాఖకు ఫిర్యాదు చేశాము.

ఫిర్యాదును స్వీకరించిన భారతప్రభుత్వం, పర్యావరణశాఖ లేఖ సంఖ్య Q -16016/86/2010/ CPA, తేది 01.11.2010 ద్వారా మేము పంపిన ఫిర్యాదుపై పరిశోధన జరుపమని మెంబర్ సెక్రటరీ PCB న్యూ ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్ వారికి ఆదేశించింది.

కావున రాష్ట్ర కాలుష్య నయంత్రణ మండలి అధికారులు అనధికారిక కాలుష్యకారక ప్లైఉడ్ ఫ్యాక్టరీపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

# శాంతిగీతం

\- సి.యస్.ఆర్

ఎచ్చటివారమో - ఇచ్చట కలిశాము
వట్టిచేతులతో వెళ్ళిపోయే - మట్టి మనుషులం

కష్టాలను, నష్టాలను - కలిసి పంచుకుందాం
గాయాలను, బాధలను - సహనంతో భరిద్దాం
యుద్ధాలకు, ఉన్మాదాలకు - తావేలేదని ప్రకటిద్దాం
ప్రకృతివైపరీత్యాలను - కలిసికట్టుగా ఎదుర్కొందాం
భాషలెన్నున్నా - రంగులెన్నయినా

ఆచారాలేమైనా - వ్యవహారాలు ఎంకేమైనా
ఆకలి, అభద్రతలను - జయించడానికి
నిరంతరం సమైఖ్యంగా - పోరాడుదాం
మనమంతా మనుషులం - మంచికి ప్రతిరూపాలం

పరిగెత్తి పరిగెత్తి - అలిసిపోయిన ఓ మనిషి
అనంత సంపదల భూగోళం - మన తల్లి, మన తండ్రి
సాటి మనుషుల్లో - దేవున్ని చూడు
ఓకింత చేయూతనిచ్చి - ఆపై సమాజాన్ని చూడు
మానవతకు ప్రాధాన్యత - భావితరాలకు శుభసూచిక

ఎచ్చటివారమో - ఇచ్చట కలిశాము
వట్టి చేతులతో - వెళ్ళిపోయే మట్టి మనుషులం





లోక్‌సత్తా కుటుంబ సభ్యులు, మిత్రులకు

**నూతన సంవత్సర శుభాకాంక్షలు**

**చిట్టబోయిన వినోద్ యాదవ్**
సర్వజన సత్తా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

**దుర్గా రామచంద్రారావు (రాము)**
ఖైరతాబాద్

**భూపతి లక్ష్మి నవీన్‌కుమార్ శర్మ**
యువసత్తా రాష్ట్ర కార్యదర్శి

# అదుపులేని మాదకద్రవ్యాల అమ్మకాలు
# యువత - భవిత - చట్టాలు

ఎ. అన్నపూర్ణ

నేను1994వ సంవత్సరం నుంచీ తరచుగా అమెరికా వెళ్ళి వస్తూండటం వలన అక్కడి జీవన విధానాన్ని పరిశీలించడం అలవాటైంది. ఇందులో భాగంగా ఒకసారి డాక్టర్ చెకప్ మెడికల్ షాపులు తీరుతెన్నులు తెలుసుకున్నాను. ఏదైనా అనారోగ్యం కలిగినపుడు ఏ టాబ్లెట్నూ స్వంతంగా కొనుక్కోవడం కుదరదు. డాక్టరు ప్రిస్కిప్షన్ వుండాల్సిందే. అలా అని ప్రతి చిన్న అనారోగ్యానికీ డాక్టర్ దగ్గరకు వెళ్ళాలంటే మందు ఖరీదు కన్నా డాక్టర్ ఫీజు ఎక్కువ. ట్రావెల్ ఇన్సూరెన్సు చిన్న వాటికి ఉపయోగపడదు. యమర్జెన్సీ సీరియస్ ప్రాబ్లమ్ అయితే తప్ప అందువలన సాధారణంగా వచ్చే రుగ్మతలకు ఇండియా నుంచి తీసుకువెడతాను. మా ఫ్యామ్లీ డాక్టర్ని అడిగిన తర్వాత. మనదేశంలో ఎలాంటి వ్యాధికైనా డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా అమ్మరాదన్నా, కొనరాదన్నా మనవాళ్ళు పాటించరు. అసలు డాక్టర్ దగ్గరకి వెళ్ళరు. షాపతన్ని అడిగి అతను ఇచ్చిన మందులను నిర్భయంగా వాడేస్తారు. వీటివలన వచ్చే ప్రమాదాలు ఎన్నో వుంటాయన్న స్పృహే వుండదు కొందరికి.

అమెరికాలో డాక్టర్ మందులు రాసిచ్చి మీరు వెళ్ళి తెచ్చుకోండి అని చెప్పరు. ఫలానా రోగికి ఫలానా మందుల మేము సూచించాము వారికి ఇవ్వండి అని హాస్పిటల్ నుంచి మందులషాపుకి ఫోన్చేస్తారు. అక్కడ మందుల షాపులను ఫార్మసీ అనీ డ్రగ్స్ స్టోర్ అనీ అంటారు. ఆ మందులు అక్కడ వున్నాయా లేవా అని అడుగుతారు. స్టోరు వాళ్ళు కూడా ఆ మందులు వున్నాయో లేదో చెప్పాలి. మందులు రాయించుకున్న వ్యక్తి స్టోర్కి వెళ్ళి ప్రిస్కిప్షన్ ఇచ్చి ఐడి చూపించాలి. ఆ ఐడి తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ అయివుంటుంది. లేదా డ్రైవింగ్ రానివారు, కారు లేని వారు స్టేట్ ఐడి తీసుకోవాల్సి వుంటుంది. రెండూ రాసిచ్చిన మందులే అయినా వాటిని కొనుక్కోవడానికి రూల్సు ఫాలో అవ్వాలి. డ్రగ్ కంట్రోల్ సిస్టమ్ అనుసరించకపోతే ఎంతటి మనదేశంలో అయితే ఏ మాత్రము జంకుగొంకూ లేకుండా కిరాణాషాపులో వెచ్చాలు కొనుక్కున్నంత సులువుగా మనం మందుల కొనుక్కుంటారు. అమ్మేవాళ్ళు అమ్ముతారు. చదువు మందుల పట్ల ఏమాత్రమూ అవగాహన లేనివారు చిన్నపిల్లలు అడిగినా చాలు ఇచ్చేస్తారు. ఈ నిర్లక్ష్యం కట్టడి లేని పద్ధతి కొందరి ప్రాణాలకు ముప్పుకావచ్చు. ఈ విధానం వలన కొత్తరకాల మాదకద్రవ్యాలు కృత్రిమరసాయనాలు ఉత్ప్రేరకాలు వాడకం కూడా సామాన్య విషయంగా మారింది. మనదేశ ముఖ్యనగరాలలో ప్రముఖంగా మాదకద్రవ్యాల అమ్మకాలు పెరిగిపోతూ యువతకు చేటుతెస్తున్నాయి. కేవలం షాపుల వరకూ వెళ్ళి కొనుక్కోవలసిన అవసరం లేదు. ఇంటర్నెట్ కొరియర్ సర్వీసుల ద్వారా మనదేశంలోకి ఇళ్ళలోకి సునాయాసంగా ప్రవేశిస్తున్నాయి. ఇవన్నీ ప్రత్యేకంగా ఎక్కడినుంచో తెచ్చుకోవాల్సిన అవసరం కూడా లేదు. వీటిలో చాలా వరకు వైద్యచికిత్సకు వాడే రసాయన మందులే. అందుకే మహానగరాల నుంచి పట్టణాల వరకూ మాదకద్రవ్యాల వాడకానికి బానిసలైపోయారు. ప్రయోగశాలల్లో తయారుచేసిన పదార్థాలు సులువుగా అన్ని షాపుల్లోనూ దొరుకుతున్నాయి.

మాదకద్రవ్యాలకు అలవాటు పడిన వారు రుగ్మతల కారణంగా ప్రతి సంవత్సరం ఢిల్లీలోని ఆలిండియా మెడికల్ సైన్సెస్లోని నేషనల్ డ్రగ్ డి-ఎడిక్షన్ ట్రీట్మెంట్ సెంటర్లో 32,000 మంది వైద్యసహాయాన్ని పొందుతున్నారు. మిగిలిన చోట్ల 21 వేల మంది సహాయాన్ని కోరుతున్నారు. రోగాలను నయం చేసే మందులు మత్తుమందులుగా తయారుచేసుకుని దుర్వినియోగం చేయడమే కాక తమ ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పు తెచ్చుకుంటున్నారు. సింథటిక్ డ్రగ్లు లాబ్స్లో తయారుచేసిన సైకోయాక్టివ్ పదార్థాలు విపరీతంగా వాడుకలో వున్నాయి. హెరాయిన్ను భారతదేశంలోనే ఎక్కువగా వాడుతున్నట్టు తెలిసింది.

యాంఫెటేమైన్స్ ఎక్టసీ ఎల్ఎస్డి (లైసర్జిక్ ఆసిడ్ డిలైథమిన్) కృత్రిమానందం కలిగించే ఔషధాలు. డ్రగ్ కాక్టైల్స-ప్రాపాక్సిఫైన్ బుప్రెనోర్ఫిన్ మహిళలు వాడే పెయిన్ కిల్లర్స్ నిద్రమాత్రలు. దురదృష్టకరమైన విషయం ఏమిటంటే మనదేశంలోని కార్పొరేట్ సంస్థలలో ఉన్నత పదవుల్లో వున్నవారు కూడా ఈ మాదక ద్రవ్యాలకు బానిసలవుతున్నారు. వీరిలో మహిళలు కూడా వున్నారంటే ఈ వ్యసనం ఆడ మగ తేడా లేకుండా ఎందరినీ లోబర్చుకుంటున్నదో అర్థం అవుతోంది. వీరిలో సాంప్రదాయ సనాతన భావాలు కలవారు కూడా వుంటున్నారు. సాఫ్ట్వేర్ ఉద్యోగాలు దక్కించుకుని తల్లితండ్రులకు మంచి ఇల్లు సదుపాయాలూ అమర్చి లగ్జరియస్ లైఫ్ని అలవాటు చేసి వృత్తిపరంగా ఉన్నతస్థాయికి చేరుకోవాలంటే తపనతో ప్రయత్నాలలో పాకుడు మెట్లవైపు ప్రయాణం సాగిస్తున్నారు. నైతిక విలువలను ఏ మాత్రం పట్టించుకోడం లేదు. ఆడ మగ స్నేహితులు విందువినోదాలు పార్టీలు ద్వారా యువతరం అలవాటు పడిపోతున్నారు.. అనేక వృత్తులలో రాణిస్తున్న యువతరం కావలసిన దానికంటే ఎక్కువే డబ్బు చేతికి అందుతుండటం వలన

వారాంతంలో ఏమీ తోచక మాదకద్రవ్యాల వ్యసనానికి బానిసలైపోతున్నారు. పనిచేయాల్సిన టైమ్ ఎక్కువ కావడంతో స్ట్రెస్‌కి గురి అవుతున్నారు. చురుకుగా వుంటే తప్ప సాఫ్ట్‌వేర్ రంగంలో సక్సెస్ కాలేరు కనుక గమ్యం చేరుకోడం కోసం ఆత్మవిశ్వాసం కలగడం కోసం వారీ మార్గాన్ని ఎంచుకుంటున్నారు. 15-17 సంవత్సరాల పిల్లలు కూడా ఈ మాదకద్రవ్యాలను రుచిచూడటం భయాందోళనలను కలిగిస్తున్నాయి. వీరు తమంత తాముగా చెడు అలవాట్లకు బానిసలు కాకపోయినా స్నేహితుల ప్రోద్బలం ఇంట్లో పెద్దవారి అదుపులేకపోవడం మితిమీరిన స్వేచ్ఛ, అందులో ఏముందో తెలుసుకోవాలనే కుతూహలంతో మొదలై చివరకు చదువుకోవలసిన వయసులో దురలవాట్లకు లోనైన వీరికి భవిష్యత్ మసకబారిపోతుంది. రాత్రివేళల్లో మాదకద్రవ్యాలను వాడుతున్న వారు మోటారు వాహనాలు నడిపి ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. అమ్మాయిలూ, అబ్బాయిలూ స్నేహాల పేరుతో విచ్చలవిడిగా పెరుగుతుండటం మత్తుమందులకు అలవాటుపడి చదువు నిర్లక్ష్యం చేయడం జరుగుతోంది. ఈ విషయాలు తల్లితండ్రులకు తెలియవు. చాలాకాలం క్రితం మాదకద్రవ్యాలను వాడేవారు తల్లితండ్రులకు దూరంగా వున్నవారు జులాయిగా తిరిగేవారు నేరపూరిత స్వభావం కలవారుగా భావించేవారు. కానీ ఇప్పుడు మధ్యతరగతి వారు కూడా వీటికి అలవాటు పడుతున్నట్లు సర్వేలలో బైటపడుతున్నాయి.

ఇక సినిమా, టివీ కళాకారులు క్రీడాకారులు కావాలనుకునేవారు అందంగా కనబడతామని చురుగ్గా ఉత్సాహంగా వుంటామనుకునే భ్రమలకు లోనైనవారు కావాలని వీటిని వాడుతున్నారు. మణిపూర్ ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్, పంజాబ్, హర్యానా మాదకద్రవ్యాలకు ప్రధాన కేంద్రాలుగా భాసిల్లుతూ యుపి మహారాష్ట్ర గోవా, కేరళ, తమిళనాడు గుజరాత్ రాష్ట్రాలకు వ్యాపించాయి. తల్లితండ్రులకు తెలిసే సరికీ చేయిదాటిపోయే పరిస్థితిని తెచ్చుకోకుండా మేల్కోనకపోతే వారి భవిష్యత్ చీకటిలో మగ్గిపోవాల్సి వస్తుంది. అంతేకాదు మందులు యధేచ్ఛగా ఎవరికైనా ఇచ్చే విధానాన్ని మానుకోవాలి. చట్టాలు కఠనతరం చేసి అమ్మేవారి మీద కొనేవారి మీద చర్యలు తీసుకోవాలి. అవసరం వస్తే డాక్టర్ మీద కూడా కేసులు పెట్టాలి. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటానికి చట్టాలను కఠినతరంగా అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది. ❑

## పట్టణం యూనిట్‌గా కార్యక్రమాలు ప్రారంభించండి

**యువసత్తా శ్రేణులకు డి.వి.వి.ఎస్ వర్మ సూచన**

"పట్టణాన్ని యూనిట్‌గా తీసుకుని యువసత్తా కార్యక్రమాలు ప్రారంభించాలి. యువతకు ఉపాధి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలి. స్థానిక సమస్యల పరిష్కారంలో యువతను భాగస్వామ్యం చేయాలి, ప్రజాసంక్షేమ కార్యక్రమాల ద్వారా జనంలోకి వెళ్ళి, వారిని చైతన్యపరచాలి". అని లోక్‌సత్తా పార్టీ అనుబంధ విభాగమైన యువసత్తా ప్రాంతీయ సమన్వయకర్తల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షుడు డి.వి.వి.యస్. వర్మ సూచించారు. యువసత్తా రాష్ట్ర సలహాదారు పాండురంగారావు మాట్లాడుతూ ఆయా రాజకీయ పార్టీలు యువతను వివిధ రూపాలలో ఉపయోగించుకుంటున్నారని, లోక్‌సత్తా పార్టీ మాత్రం యువతను ఆచరణాత్మకమైన పద్ధతిలో జనజీవితంలోకి పంపిస్తోంది. దేశ జనాభాలో 38 శాతం యువ ఓటర్లే వున్నారని గుర్తించాలన్నారు. రాష్ట్ర యువసత్తా అధ్యక్షులు దాసరి రత్నం మాట్లాడుతూ సమస్య యువతదైతే ఎజెండా మనది కావాలన్నారు.

కార్యక్రమంలో యువసత్తా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు రాజా రామకృష్ణ వర్మ, కుడికాల ఆంజనేయులు, రీజినల్ కో-ఆర్డినేటర్లు పంచాది రాంబాబు, నవీన్ శర్మ, ఎమ్. శ్రీధర్, జీహెచ్ఎమ్‌సి నాయకులు దోసపాటి రాము, యువసత్తా ఉపాధ్యక్షురాలు గోక మంగళ, కిషోర్, రాజశేఖర్, శివ, కృష్ణప్రియ, గిరీష్, సంతోష్, బాబూ ఆనంద్, హేమంత్, రవి, మహేష్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## యూత్ ఫర్ బెటర్ ఇండియా

అవినీతి నిరోధక బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి లోక్‌సత్తా విద్యార్థి విభాగం ఉద్యమం చేపట్టనుంది. దీనికోసం వై.బి.ఐ. (యూత్ ఫర్ బెటర్ ఇండియా) పేరుతో కాలేజీలలో కమిటీలు వేయనున్నాం. దాదాపు 20కి పైగా కాలేజీల్లో వై.బి.ఐ. కమిటీలు వేయబడ్డాయి. కాబట్టి ఉద్యమాన్ని ఉదృతం చేయడానికి మీ అందరి సహకారం కోరుతున్నాము. మీకు పరిచయాలు ఉన్న కాలేజీల్లో విద్యార్థులను దీనిలో భాగస్వాములను చేయవలసిందిగా కోరుతున్నాము. వై.బి.ఐ. ఆధ్వర్యంలో జనవరి 26న హైదరాబాదులో భారీ ర్యాలీ, తరువాత బహిరంగ సభ నిర్వహించాలనుకుంటున్నాము.. దీనిలో అందరిని పాలుపంచుకోవలసిందిగా కోరుతున్నాము. వివరాలకు: **డి. నరసింహరావు, 97002 81992** ను సంప్రదించాలి.

# 2010లో రాజకీయానికి కేంద్రబిందువు దిశగా లోక్‌సత్తా ఎజెండా

## (లోక్‌సత్తా పార్టీ 2010-11పై స్థూల సమీక్ష)

జనం చేతికి అధికారాన్నిచ్చేందుకు ప్రత్యామ్నాయ విధానాలతో పనిచేసే లోక్‌సత్తా పార్టీ ఉండటం వల్ల రాజకీయాల్లో ఎంత మార్పు ఉంటుందో ప్రస్ఫుటంగా చూపించిన సంవత్సరం 2010. ఏ అంశాలను, విధానాలను రాష్ట్రంలో, దేశంలో పార్టీలు చేపట్టక పోవటంతో లోక్‌సత్తా ఉద్యమం లోక్‌సత్తా పార్టీగా మారిందో... ఆ అంశాలు రాజకీయ ఎజెండాగా మారటం ఈ ఏడాది మొదలైంది. "వ్యవసాయ సంస్కరణలు కావచ్చు, సమగ్ర జలవనరుల వినియోగం కావచ్చు, న్యాయవ్యవస్థ సంస్కరణలు కావచ్చు, ప్రాంతీయ అసమానతలకి పరిష్కారాలు కావచ్చు, యువతకి ఉపాధి అవకాశాలు కావచ్చు, మద్యనియంత్రణ ఉద్యమం కావచ్చు, అసెంబ్లీలో చర్చల తీరు కావచ్చు, 2-జీ మహాకుంభకోణం-అవినీతి నిర్మూలన కావచ్చు, చట్టబద్ధ పాలన కావచ్చు... కేవలం లోక్‌సత్తా ఉండటం వల్ల ప్రజలకు వాస్తవాలు అర్థమవుతూ సరైన దిశగా బలమైన చర్చ, డిమాండ్లు ముందుకొస్తున్నాయి. రాజకీయ ప్రయోజనాలు కాకుండా ప్రజాప్రయోజనాల ప్రాతిపదికన ఏ అంశం మీదైనా స్పందించి ప్రజల మద్దతు కూడగట్టే పార్టీగా కొత్త రాజకీయానికి లోక్‌సత్తా చిరునామాగా మారింది. విధిలేని పరిస్థితుల్లో మిగిలిన పార్టీలు కూడా ప్రస్తుతానికి పైపైన అయినా అనుసరించాల్సి వస్తోంది."

జనాభాలో 65శాతానికి జీవనాధారమైన వ్యవసాయరంగంలో లైసెన్స్ రాజ్యాన్ని అంతం చేసి స్వేచ్ఛావాణిజ్య సంస్కరణలు తెచ్చి వ్యవసాయాన్ని లాభసాటి చేసి గ్రామీణ ఆర్థికవ్యవస్థను బాగుచేసి తద్వారా దేశాన్ని స్థిరమైన అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ రాజకీయాలకు అతీతంగా ప్రారంభించిన రైతు ఐక్యతా ఉద్యమం' పెద్దఎత్తున విజయవంతమైంది. రాష్ట్రంలోని కోస్తాంధ్ర, తెలంగాణ, రాయలసీమతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలలో కూడా జేపీ పర్యటించి రైతునేతల్ని, పార్టీల్ని సమీకరించి జాతీయస్థాయిలో పోరాటాన్ని ప్రారంభించారు. 2010 ముగిసేనాటికి పాత, కొత్త తేడా లేకుండా రాష్ట్రంలో అందరు నేతలూ, అన్నిపార్టీలూ నభూతో అనే స్థాయిలో రైతు ఉద్యమాన్ని భుజాన వేసుకున్నారు. గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో వ్యవసాయరంగంలో ఉత్పత్తులు పెరిగినా రైతులు మాత్రం పేదలుగానే, ఏటా చేయి జాచి అర్థించే బిచ్చగాళ్లుగానే మిగిలిపోయారని, వారి పంటలు పరిశ్రమలు, ఇతర వర్గాలకు ముడిసరుకులుగా మాత్రమే ఉపయోగపడ్డాయని లోక్‌సత్తా లేవనెత్తిన వాదన అందర్నీ ఆలోచింపచేసింది. ఇతర రంగాలలోవారిలాగే రైతు తన వ్యవసాయోత్పత్తుల్ని ప్రపంచంలో డిమాండ్ ఉన్నచోట అమ్ముకునే అనుమతి ఇవ్వాలని లేదా ఆ రేటును ప్రభుత్వమే ఇవ్వాలని లోక్‌సత్తా నిర్దిష్టంగా డిమాండ్ చేసింది. లోక్‌సత్తా వాదన రాష్ట్రంలోని రైతుల్లోకి, ప్రజల్లోకి బలంగా వెళ్లింది. జాతీయ స్థాయిలోని రైతుసంఘాలు, ఆలోచనాపరులు కూడా గళం కలిపారు. రాష్ట్రంలో ఇక తప్పనిసరి పరిస్థితుల్లో పాలకులు, రాజకీయ పార్టీలు కదిలాయి. లోక్‌సత్తా, రైతుసంఘాల కృషి వల్లే బియ్యంపై జిల్లాల మధ్య, రాష్ట్రం వెలుపల ఉన్న ఆంక్షల్ని డిసెంబర్ 4న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తొలగించి ఎగుమతికి అనుమతినిచ్చింది. అయితే ఆ పార్టీల్లాగా తాత్కాలికంగా రాజకీయ లబ్ధితో పోరాటం చేసే ధోరణితో కాకుండా వ్యవసాయానికి సంకెళ్లు పూర్తిగా తెంచేందుకు రాజకీయాలకు అతీతంగా దీర్ఘకాలిక, మౌలిక సమస్యల మీద రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోరాటం కీలకమని భావించిన లోక్‌సత్తా... ఆ దిశగా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తోంది. ఇందుకు మరో రెండేళ్లు పడుతుందని పార్టీ అంచనా.

ఇక మరో కీలకాంశం ప్రత్యేక తెలంగాణపై కూడా లోక్‌సత్తా లేకుంటే సాంప్రదాయ రాజకీయ పార్టీల (సా.రా పార్టీల) తీరు పూర్తిగా భావోద్వేగాల చుట్టూ తిరుగుతూ ప్రజల మధ్య చిచ్చుపెట్టేతీరుగానే సాగేదనటంలో సందేహం లేదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు వల్ల ఉపద్రవం రాదు, అది సర్వరోగ నివారిణి కూడా కాదు. అందువల్ల ఆ అంశం మీద బలమైన అభిప్రాయం అక్కర్లేదు అని లోక్‌సత్తా చెప్పిన హేతుబద్ధ వాదన రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్రేకాలను రెచ్చగొట్టే కొంతమందిని మినహాయించి, అన్ని ప్రాంతాల్లో సాధారణ ప్రజల్ని, సమాజహితం కోరే వారిని ఆలోచింపచేస్తోంది. జాతీయత, హేతుబద్ధత, సామరస్యత ప్రాతిపదికన ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటాం, కానీ ప్రాంతీయ అసమానతలు తొలగటానికి అధికారాన్ని వికేంద్రీకరించి జిల్లా స్థాయి పాలన తేవటమే పరిష్కారం అని లోక్‌సత్తా చేసిన వాదన వైపు మొగ్గేవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

అవినీతి నిర్మూలన, మద్యనియంత్రణ, అధికార వికేంద్రీకరణ, విద్య, ఆరోగ్యం ప్రధాన స్రవంతి రాజకీయ ఎజెండాగా ముందుకొచ్చాయి. 2010లో మద్యం వేలంపాటల్ని అడ్డుకున్న ఒకే ఒక్క రాజకీయ పార్టీ లోక్‌సత్తా. మద్యం వేలంపాటలకు ముందు, ఆ తర్వాత కూడా లోక్‌సత్తా ఆ సమస్య మీద, సాంప్రదాయ

పార్టీల దొంగాట మీద ప్రజలను పెద్దఎత్తున చైతన్య పరిచింది. ప్రజలు ముందుకొచ్చిన చోట ఎక్కడికక్కడ మద్యనియంత్రణ కమిటీల్ని ఏర్పాటు చేసింది. ఎన్నికల్లో మద్యం, డబ్బు పంపిణీని అడ్డుకోవటం, అందరి ఓటుకూ విలువ ఉండేలా దామాషా ఎన్నికల పద్ధతిని తేవాలని లోక్‌సత్తా చేస్తున్న ప్రయత్నాలకు పౌరసమాజం నుంచి, కొన్ని రాజకీయ పార్టీల నుంచి సూత్రప్రాయ మద్దతు లభిస్తోంది.

ఓటుహక్కు వినియోగంపై చైతన్యం, రాజకీయ పార్టీలకు విరాళాలు, చట్టసభ స్థాయి పెంచటం, ఎన్నారై ఓటింగ్ వంటి అంశాలు ప్రజల్లోకి క్రమంగా వెళ్తున్నాయి. వ్యవసాయ సంక్షోభంపై డిసెంబర్ 15న కూకట్‌పల్లి శాసనసభ్యునిగా జయప్రకాష్ నారాయణ్ అసెంబ్లీలో చేసిన ప్రసంగం అసెంబ్లీ స్థాయిని పెంచిందనటంలో సందేహం లేదు. అలాగే నిషేధాజ్ఞల్ని ఉల్లంఘించిన అప్పటి ముఖ్యమంత్రి రోశయ్యను ఎందుకు అరెస్టు చేయలేదని జేపీ లేవనెత్తిన ప్రశ్న చట్టబద్ధ పాలన దిశగా ప్రజల్ని లోతుగా స్పందింపచేసింది. హైదరాబాద్ ఫ్రీజోన్ వివాదంపై మిగిలిన పార్టీలకు భిన్నంగా 14 (ఎఫ్)ను తొలగించాలని మొట్టమొదటే తేల్చిచెప్పిన పార్టీ లోక్‌సత్తా. కూకట్‌పల్లి సమస్యలను ఒక క్రమపద్ధతిలో అవినీతి రహితంగా పరిష్కరిస్తుండటం, అక్కడ పాఠశాలలను, ఆసుపత్రులను మెరుగుపరుస్తుండటం, భూకబ్జాలను నియంత్రించటం వంటి చర్యలతో ఆ నియోజకవర్గం ఒక మోడల్‌గా రూపుదిద్దుకుంటోంది.

హైదరాబాద్‌కు మంచినీటికి కేవలం రూ.700కోట్లతో తేలిగ్గా పూర్తయ్యే కృష్ణానది మూడోదశ పథకాన్నే చేపట్టాలని, రూ.3800కోట్లతో ఎల్లంపల్లి నుంచి ఎంతో సమయం, ప్రయాసతో కూడిన గోదావరి జలాలను తేవటం తగదని జేపీ గట్టిగా పోరాడుతున్నారు.

2009లో కృష్ణా వరద తాకిడికి గురైన మహబూబ్‌నగర్, కర్నూలు, గుంటూరు, కృష్ణా జిల్లాల్లో లోక్‌సత్తా దత్తత తీసుకున్న నాలుగు గ్రామాలలో పాఠశాల, మంచినీటి పథకం, కమ్యూనిటీ హాలు, ఎత్తిపోతల పథకాలు ప్రారంభమయ్యాయి. 25లక్షల క్యూసెక్కుల వరద మళ్లీ వచ్చినా తట్టుకునేలా కృష్ణా కరకట్టల నిర్మాణం చేపట్టాలని ప్రధానమంత్రికి జేపీ అందించిన విజ్ఞాపనకు స్పందించిన కేంద్రప్రభుత్వం ఆ మేరకు రాష్ట్రం నుంచి వచ్చే ప్రతిపాదనలకు తగిన నిధుల్ని ఇస్తామని నిర్దిష్ట హామీ ఇచ్చింది. కరకట్టల నిర్మాణానికి పార్టీ గట్టిగా కృషి చేస్తోంది.

2-జీ స్పెక్ట్రంపై లోక్‌సత్తా జాతీయస్థాయి పోరాటం కూడా మిగిలిన పార్టీలకు భిన్నంగా, ప్రజాప్రయోజనాలను పరిరక్షించేలా పూర్తి నిర్మాణాత్మకంగా ఉంది. జేపీసీ వేయటం వంటి పైపై అంశాలు కాకుండా స్పెక్ట్రం స్కాంలో దేశం పోగొట్టుకున్న రూ.1,76,000 కోట్లు తిరిగి రాబట్టాలని, స్పెక్ట్రం కేటాయింపుల్ని రద్దు చేయాలని, ఇకపై అలాంటివి జరగకుండా స్వతంత్ర ప్రతిపత్తిగల అవినీతి వ్యతిరేక కమిషన్ (ఐ.ఎ.సి.సి)ని ఏర్పాటు చేయాలని డిమాండ్లు ముందుకు తీసుకొచ్చింది. సామాన్యులు సైతం ఈ ఉద్యమంలో పాలుపంచుకునేలా పోస్టుకార్డులు, ఎం.వోలు, ఈ-మెయిళ్లతో ప్రధాని కార్యాలయాన్ని హోరెత్తించే కార్యక్రమాన్ని చేపట్టింది. తనవంతుగా లక్షలాది సందేశాల్ని పంపింది. యువత, విద్యార్థులతో హైదరాబాద్, విశాఖపట్నం, బెంగళూరుల్లో అవినీతి వ్యతిరేక వాక్‌లను, సభలను నిర్వహించింది. లింగ్డో, రెబెరో, గోపాలస్వామి వంటి జాతీయస్థాయిలో నిజాయతీపరులైన ప్రముఖులతో కలిసి స్పెక్ట్రం కేటాయింపుల రద్దు కోసం సుప్రీంకోర్టులో లోక్‌సత్తా పిటిషన్ దాఖలు చేసింది.

అలాగే న్యాయవ్యవస్థలో అవినీతి మొత్తం జాతి సమగ్రతకే గొడ్డలిపెట్టుగా మారుతున్నందున న్యాయమూర్తుల ఎంపిక, నియామకాలలో, పనితీరులో అవినీతిని కట్టడి చేసి జవాబుదారీతనం తెచ్చేందుకు జాతీయ జ్యుడీషియల్ కమిషన్ కోసం లోక్‌సత్తా గట్టి కృషి చేస్తోంది.

స్థానిక సంస్థలకు బడ్జెట్‌లో 7శాతం నిధుల్ని నేరుగా కేటాయించాలని ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద జాతీయస్థాయి ప్రముఖులతో కలిసి జయప్రకాష్ నారాయణ్ బైఠాయింపులో పాల్గొన్నారు. అలాగే రాష్ట్రంలో ప్రజలకు ప్రత్యక్ష సేవలను అందించే మున్సిపాలిటీలలో ఎన్నికలను వాయిదా వేయకూడదని, అధికారాన్ని వికేంద్రీకరించి సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 60 మున్సిపాలిటీలలో కూడా ధర్నా కార్యక్రమం నిర్వహించారు. వచ్చే స్థానిక ఎన్నికల నాటికి మున్సిపాలిటీలలో ప్రతి వార్డుకూ సమస్యలు-నిర్దిష్ట పరిష్కారాలతో వార్డు మేనిఫెస్టో తయారు చేసేందుకు పార్టీ కసరత్తు చేస్తోంది. ఆ ప్రయత్నాన్ని గ్రామప్రాంతాలకు కూడా విస్తరించేందుకు తొలిదశగా ఎంపిక చేసిన పంచాయతీలలో కృషి జరుగుతోంది.

**వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా యువనాయకత్వ తయారీ మీద ప్రత్యేక దృష్టి.. విదేశాల్లో సైతం...**

**పంచసూత్రాల ప్రాతిపదికన విశాల రాజకీయ వేదిక నిర్మాణానికి కృషి ప్రారంభం**

రాష్ట్రంలో, దేశంలో యువత పెద్దసంఖ్యలో ఉండటం వల్ల రాజకీయాల్లో మంచి మార్పునకు అవకాశం కన్పిస్తున్నా వారిలో నాయకత్వ లోపం శాపంగా మారిందని గుర్తించిన పార్టీ... వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా యువనాయకులను తయారుచేసే కార్యక్రమాన్ని పెద్దఎత్తున చేపట్టింది. అందుకే లోక్‌సత్తా 4వ వార్షికోత్సవాన్ని కూడా 'నాయకత్వ సదస్సు'గా నిర్వహించారు. అమెరికాలో 'పీపుల్ ఫర్ లోక్‌సత్తా' ఆధ్వర్యంలో వేసవిలో జరిగిన వివిధ సమావేశాల్లో పాల్గొన్న జేపీ... ప్రధానంగా ఈ అంశం మీద దృష్టిపెట్టారు. భారత్‌కు నూతనోత్తేజం పేరుతో జరిగిన ఈ కార్యక్రమాలకు ఎన్నారైలు కులం,మతం,భాష, ప్రాంతంతో సంబంధంలేకుండా పెద్దఎత్తున హాజరుకావటం ఓ నూతన చరిత్ర. రాష్ట్రంలో వివిధ మున్సిపాలిటీలలో కూడా

యువతను ఎంపిక చేసి నాయకత్వ శిక్షణా కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వహించారు. యువతలో నైపుణ్యాల్ని పెంచి వ్యవసాయాధారిత, తదితర పరిశ్రమలతో చిన్నపట్టణాలను, ఎంటర్‌ప్రైజ్‌లను అభివృద్ధి చేసి పెద్దఎత్తున యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలనే విధానంతో పార్టీ ముందుకెళ్తోంది. సాంప్రదాయ రాజకీయపార్టీలతో విసిగిపోయిన యువత సంకుచిత, వ్యక్తి రాజకీయాల బారిన పడకుండా సరైన కొత్త రాజకీయం వైపు మళ్లించటం అవసరమని, ఇందుకోసం హేతుబద్ధత, నైతికత, జాతీయత, లౌకికవాదం, ప్రజాస్వామ్య దృక్పథం అనే పంచసూత్రాల ప్రాతిపదికన కలిసొచ్చే పార్టీలతో ఒక విశాల రాజకీయ వేదికను నిర్మించేందుకు కూడా ఈ ఏడాది లోక్‌సత్తా కృషిని ప్రారంభించింది.

తమిళనాడు, కర్ణాటకల్లో కూడా లోక్‌సత్తా కార్యక్రమాలు ఈ ఏడాది చురుగ్గా సాగాయి. బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 5 స్థానాల్లో పోటీచేసిన లోక్‌సత్తాకు గణనీయంగా ఓట్లు వచ్చాయి. రాష్ట్రంలో పర్యావరణాన్ని, ప్రజాహితం కాపాడేలా విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటునకు నిపుణులతో ఒక కమిటీని, ప్రతి అంశంపై సరైన విధానాలను రూపొందించి పోరాడేందుకు నేషనల్ సెంటర్ ఫర్ పబ్లిక్ పాలసీ అండ్ అడ్వొకసీని రాజకీయాలకు అతీతంగా ఏర్పాటు చేసేందుకు కూడా లోక్‌సత్తా ఈ ఏడాది కృషిని ప్రారంభించింది. వ్యవసాయ సంస్కరణలకు, స్థానిక ప్రభుత్వాల సాధికారతకు, అవినీతి నిర్మూలన, న్యాయవ్యవస్థ ప్రక్షాళనకు జాతీయస్థాయిలో కూడా లోక్‌సత్తా గట్టి పోరాటం చేస్తోంది. ❏

**లోక్‌సత్తా పార్టీ జిల్లా శాఖలకు, పార్టీ అనుబంధ విభాగాల జిల్లా శాఖలకు విజ్ఞప్తి**

లోక్‌సత్తా పార్టీ 2010-11 స్థూల సమీక్ష భవిష్యత్తులో మరింత చురుగ్గా, పటిష్టంగా, నిబద్ధతతో ముందుకెళ్లేందుకు ఎంతగానో ఉపయోగపడుతుంది. అలాగే ప్రతి జిల్లా నుంచీ కూడా 2010లో చేసిన కార్యక్రమాల గురించి నివేదికను ప్రచురించాలని భావిస్తున్నాం. విధానాలను ప్రతిబింబిస్తూ, ప్రజల్ని ప్రభావితం చేస్తూ, నాయకత్వాన్ని పెంచే రీతిలో చేసిన కార్యక్రమాలను, ఫలితాలను వివరిస్తూ మీ మీ జిల్లాల నుంచి నివేదికను, కొన్ని ఫొటోలతో సహా వారంలోగా పంపవలసిందిగా మనవి.

**– వర్కింగ్ ఎడిటర్**

# విద్యార్థిసత్తా కార్యక్రమాల నివేదిక

విద్యార్థిసత్తా డిసెంబర్ 13, 2009న అధికారికంగా ప్రకటించడమైనది. అక్టోబర్ 2 అవినీతి వ్యతిరేక ర్యాలీతో విద్యార్థిసత్తా కార్యక్రమాలు మొదలయ్యాయి. ఈ ర్యాలీని మనం 'యూత్ ఫర్ బెటర్ ఇండియా' అనే పేరుతో చేశాము. ఈ సంస్థను మున్ముందు కూడా ఉపయోగించుకోనున్నాము. ఈ ర్యాలీలో మనకు దాదాపు 40 కాలేజీల నుంచి విద్యార్థులు రావటం జరిగింది. నవంబర్ 13వ తేదీన విద్యార్థి సత్తా అధ్యక్షునిగా పి. శివాజీ బాధ్యతలు స్వీకరించారు. డిసెంబరు 9వ తేదీన విశాఖపట్నంలో దాదాపుగా 4,000 మంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించటం జరిగింది.

**విద్యార్థిసత్తా భవిష్యత్ కార్యచరణ:**

1. విద్యార్థిసత్తాను ఒక ప్రధాన విద్యార్థి సంస్థగా అభివృద్ధి చేయడానికి 3 నెలల్లో 25,000 విద్యార్థి సత్తా సభ్యత్వాలు చేర్పించడం.
2. అన్ని జిల్లాల్లో పర్యటించి ఉత్సాహంగా ఉన్న విద్యార్థులను గుర్తించి జిల్లా కమిటీలు ఏర్పాటు చేయటం.
3. అన్ని జిల్లాలలో వీలైనన్ని పట్టణాలలో విద్యార్థులకు సమాచార హక్కు చట్టంపై శిక్షణా తరగతులు నిర్వహించటం.
4. కెరీర్‌గైడెన్సు ద్వారా మనం సులభంగా కాలేజీల్లో ప్రవేశించవచ్చు. వివిధ విద్యాసంస్థలు అవి అందించే కోర్సుల వివరాలను ఒకచోటకు చేర్చే బాధ్యతను విజయభాస్కర్‌కు అప్పగించటం జరిగింది.
5. కాలేజీలు, యూనివర్శిటీలలోని స్థానిక సమస్యలపై విద్యార్థిసత్తా సభ్యులు పనిచేయుటకు తగిన శిక్షణ ఇవ్వడం.
6. డా॥ జయప్రకాష్ నారాయణ ఉపన్యాసాలను అలాగే జేపీ సాధించిన విజయాలను డివిడీల ద్వారా వివిధ కాలేజీల్లో స్క్రీనింగ్ నిర్వహించటం.
7. విద్యార్థిసత్తా, 'యూత్ ఫర్ బెటర్ ఇండియా' – ఈ రెండింటికి ఎటువంటి భేదం లేదు. విద్యార్థిసత్తా అధికారికంగా వెళ్ళలేని కాలేజీలకు **'యూత్ ఫర్ బెటర్ ఇండియా'** పేరుతో వెళ్ళటం జరుగుతుంది.
8. రానున్న మున్సిపల్ ఎన్నికలకు పార్టీ ఎంపిక చేసిన వార్డులలో అభ్యర్థులకు 5 నుండి 10 మంది విద్యార్థులను అందించడానికి ప్రయత్నించడం.
9. లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్ష కార్యదర్శుల నుంచి వారి వారి జిల్లాలలో, మండలాలలో చురుకుగా పనిచేస్తున్న విద్యార్థుల వివరాలను తీసుకోవడం. ❏

# లోక్‌సత్తా పార్టీ జిల్లాల సమాచారం

## విజయనగరం

### అధికారుల్లో చిత్తశుద్ధి లోపిస్తోంది : లోక్‌సత్తా

**కెమిశిల(కొమరాడ, కురుపాం) :** కెమిశిల పంచాయతీలో శివారు గ్రామం లేకున్నా 11 ఏళ్లుగా మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని నడుపుతూ ప్రజల్ని మోసగించారని లోక్‌సత్తా అధ్యక్షుడు రవి అన్నారు. ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధులకు జాగీర్దారులుగా పని చేస్తున్నారని ఆరోపించారు. అంగన్‌వాడీ ప్రాజెక్టు అధికారులు కేంద్రాలను పరిశీలించడం లేదనడానికి ఇది నిదర్శనం అని అన్నారు. కురుపాం సెక్టారు నుంచి పార్వతీపురం సెక్టారుకు విలీనం అయిన కేంద్రాలు జాబితా అందించాలని కురుపాం సీడీపీఓను కోరినట్లు వెల్లడించారు. ఇలా ఎన్ని కేంద్రాలను సంబంధిత అధికారులు నడుపుతూ వస్తున్నారో వాటి వివరాలు సేకరిస్తున్నామని అన్నారు.



### జన రాజకీయమే లోక్‌సత్తా ధ్యేయం

**పార్వతీపురం :** జన రాజకీయం కోసమే లోక్‌సత్తా పార్టీ శిక్షణ తరగతులు నిర్వహిస్తోందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి బందారు రామ్మోహన్‌రావు అన్నారు. స్థానిక కల్యాణమండపంలో శిక్షణ తరగతులను ప్రారంభించి ఉపన్యసించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల అవసరాలను పక్కనపెట్టి రాజకీయం చేస్తుందన్నారు. జిల్లా అధ్యక్షుడు బి.బాబ్జీ మాట్లాడుతూ అవినీతి లేని రాజకీయం కోసం జయప్రకాష్ నారాయణ పార్టీని స్థాపించారని అన్నారు. కార్యక్రమంలో కురుపాం, పార్వతీపురం నియోజకవర్గాల ఇన్‌చార్జి పట్లాసింగ్ రవికుమార్, జిల్లా పార్టీ నాయకులు దొంకాద సాయి పార్థసారథి, కోఆర్డినేటర్ మహంతి, జగదీష్ పాల్గొన్నారు.

> గెలవగలనన్న నమ్మకం గలవాడే గెలుస్తాడు
> –జాన్ డ్రైడెన్

## చిత్తూరు



### ప్రజలతో లోక్‌సత్తా ముఖాముఖి

**తిరుపతి:** లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో స్థానిక అశోక్‌నగర్ డివిజన్ ప్రజల సమస్యలపై ముఖాముఖి లోక్‌సత్తా పార్టీ నగర అధ్యక్షులు నీలకంఠేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు తమకు రేషన్‌కార్డులు లేవని, ఇందిరమ్మ ఇంటిస్థలాలు రాలేదని, వంటగ్యాస్, వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు పింఛన్లు సక్రమంగా అందడం లేదని ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిద్ధయ్యనాయుడు, బాలసుబ్రహ్మణ్యం, విక్రమన్, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

### చింతలచేనుకు రోడ్డు సౌకర్యం కల్పించండి

**మంగళం:** మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న చింతలచేనుకు రోడ్డు సౌకర్యం కల్పించాలని లోక్‌సత్తా పార్టీ నగర అధ్యక్షులు వి. నీలకంఠేశ్వరరావు మున్సిపల్ కమిషనర్ జానకికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ ప్రాంతంలో 600 మంది నివశిస్తున్నారని, రోడ్డు సౌకర్యం లేకపోవడంతో షేర్‌ఆటోలు, స్కూల్ ఆటోలు తిరగడం లేదన్నారు. దీంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో లోక్‌సత్తా పార్టీ నాయకులు సిద్దయ్య నాయుడు, బెల్లంకొండ సురేష్, శశికాంత్, శ్రీనివాసరావ్, వెంకటరత్నంలు ఉన్నారు.

## ఖమ్మం

### అవినీతిని అంతం చేయాలి

**ఖమ్మం :** దేశంలో పెరిగిపోతున్న అవినీతిని అంతం చేయాలని జిల్లా లోక్‌సత్తా పార్టీ పిలుపునిచ్చింది. స్థానిక జిల్లా లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవ

కార్యక్రమం లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు జూపల్లి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అవినీతిపై యుద్ధం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. దీనిలో వి. హరీష్ ప్రథమ బహుమతి, ఆర్ శ్రీనివాస్ ద్వితీయ బహుమతి, దుర్గాప్రసాద్ తృతీయ బహుమతి సాధించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి చింతల లింగేశ్వరరావు, టౌన్ అధ్యక్షులు ఆర్ఎస్ఆర్కె ప్రసాద్ యువసత్తా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఆంజనేయులు, జిల్లా యువసత్తా ప్రధాన కార్యదర్శి భద్రునాయక్, విద్యార్థి సత్తా నాయకులు మహేష్, రఘుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## 2జీ స్కాంపై లోక్‌సత్తా పోస్ట్‌కార్డుల ఉద్యమం

**పాల్వంచ రూరల్ :** టెలికం రంగంలోని 2జీ స్పెక్ట్రం కుంభకోణంపై ప్రధానమంత్రి చర్యలు చేపట్టాలని కోరుతూ లోక్‌సత్తా పార్టీ , ఉద్యమ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ అవినీతి నిరోధక దినం సందర్భంగా పోస్టుకార్డుల ఉద్యమాన్ని చేపట్టారు. దీనిలో భాగంగా పాల్వంచలోని వివిధ కళాశాలల విద్యార్థులచే పోస్టుకార్డులను రాయించి పాల్వంచలోని తపాలా కార్యాలయంలో అందచేశారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా ఉద్యమ సంస్థ జిల్లా నాయకులు చారుగుండ్ల వెంకటేశ్వర్లు, శనగ రాంచందర్‌రావు, లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ నాయకులు పగిళ్ల వెంకటేశ్వర్లు, సి. హెచ్. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## యువసత్తా ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి

**గాంధీచౌక్ :** అంబేద్కర్ ఆశయాలే నేటి యువతకు సరైన మార్గమని యువసత్తా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుడికాల ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని లోక్‌సత్తా కార్యాలయంలో అంబేద్కర్ వర్ధంతి సభ జరిగింది. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జూపల్లి సత్యనారాయణ, చింతల లింగేశ్వరరావు, నాయకులు రాంరెడ్డి భద్రునాయక్, అనిల్ కుమార్, శ్రీనివాస్, రమేష్, ఉపేందర్, రాజేందర్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# అనంతపురం

## జన రాజకీయాలను అలవరచుకుందాం

**ఎమ్మిగనూరు టౌన్ :** ధన రాజకీయాలతో ప్రజలను దోపిడీ చేస్తున్న సాంప్రదాయ రాజకీయ పార్టీలకు దీటుగా జనరాజకీయాన్ని అలవరుచుకోవాలని లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి బందారు రామ్మోహన్‌రావు పిలుపునిచ్చారు. స్థానిక రాజేశ్వరి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన రెండు రోజుల రాజకీయ నాయకత్వ శిక్షణ శిబిరాన్ని రాష్ట్ర కార్యదర్శి ఓంకార్ అధ్యక్షతన ప్రారంభించారు. నేటి సారా పార్టీల దురాగతాలను అడ్డుకట్ట వేసేందుకే లోక్‌సత్తా పార్టీ ప్రజారాజకీయం వైపు అడుగులు వేస్తోందన్నారు. ప్రజల మౌలిక సమస్యల పరిష్కారంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. మధ్యతరగతి విద్యావంతులను కూడగట్టి లోక్‌సత్తా పార్టీ రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందన్నారు.

**రైతు సమస్యలపై ఉద్యమించాలి..**

కుల,మత రాజకీయ పార్టీల వారీగా రైతులు చీలిపోయారని వీరందరిని ఒక తాటిపై చేర్చి ఉద్యమాలు చేయాలని అన్నారు. నవంబర్ 20 నుండి రాష్ట్రవ్యాప్తంగా 200 మండలాలల్లో రైతు చైతన్యయాత్రలు నిర్వహిచినట్లు తెలిపారు. నియోజకవర్గ ఇన్‌చార్జి సూర్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.




## అవినీతిని వ్యతిరేక ఉద్యమం

**అనంతపురం :** అనంతపురం జిల్లా లోక్‌సత్తా పార్టీ నాయకులు డిసెంబరు 3న 2జీ స్పెక్ట్రం లైసెన్సును రద్దు చేయాలని పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. అందులో భాగంగా స్థానిక క్లాక్ టవర్ వద్ద ఒక టెంట్ వేసుకుని సుమారు 200 పోస్టుకార్డులు ప్రధాని మన్మోహన్ గారికి ప్రజలచే లేఖలు రాయించారు. అవినీతి నిరోధం మీద లోక్‌సత్తా పార్టీ అభిప్రాయాన్ని ప్రజలకు వివరించే కరపత్రాన్ని ప్రజలకు అందచేసారు. ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రజల నుంచి విరాళంగా ఒక రూపాయిని ప్రధానికి ఎం.ఓ ద్వారా పంపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డా॥ జె శ్రీనాథ్‌తో పాటు నగర అధ్యక్షులు నిజాంవలి, మహిళా నాయకులు సరస్వతమ్మ, సత్తెమ్మ మరియు సుధాకర్, నాగేంద్ర పాల్గొన్నారు.

అంతర్జాతీయ అవినీతి నిరోధక దినోత్సవం అయిన డిసెంబరు 9న అవినీతిని వ్యతిరేకిస్తూ జిల్లాలో ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీ పార్టీ కార్యాలయం నుండి బయలుదేరి సప్తగిరి సర్కిల్, క్లాక్‌టవర్ మీదుగా ప్రధాన సర్కిళ్లలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు డా॥ జె. శ్రీనాథ్ మాట్లాడుతూ అవినీతిపరుల పట్ల కఠిన చట్టాలు తేవాలని వాటిని కచ్చితంగా అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ సందర్భంగా అవినీతి వ్యతిరేక కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళాసత్తా – విద్యార్థిసత్తా నాయకులు జిల్లా కార్యదర్శి, వన్నూరప్ప, తదితరులు పాల్గొన్నారు.




### రైతాంగ సమస్యలు విస్మరిస్తే పుట్టగతులుండవు

**గుంతకల్లు :** దేశానికి వెన్నెముక రైతు సమస్యలను విస్మరిస్తే ప్రభుత్వానికి పుట్టగతులుండవని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి బందారు రామ్మోహన్‌రావు పేర్కొన్నారు. స్థానిక లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ సన్నపదమల రామ్మోహన్, పట్టణ కార్యదర్శి గౌస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం రైతాంగ సమస్యలను విస్మరించి రాజకీయ వర్గాల కుమ్మలాటలకు దిగిందని విమర్శించారు. రాష్ట్రంలో రైతాంగం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. లోక్‌సత్తా ఆధ్వర్యంలో రైతులను చైతన్యపరిచి పెద్ద ఎత్తున ఉద్యమిస్తారని తెలిపారు.

## వరంగల్




### అవినీతి రహిత వ్యవస్థను ఏర్పాటు చేయాలి

**సుబేదారి:** అవినీతి రహిత వ్యవస్థను ఏర్పాటు చేస్తే ప్రపంచంలో భారతదేశం అభివృద్ధిలో ప్రథమస్థానంలో ఉంటుందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోదండరామారావు అన్నారు. అవినీతి వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో దేశంలో జరుగుతున్న అవినీతిపై ప్రధానమంత్రికి పోస్టుకార్డు ఉద్యమాన్ని చేపట్టారు. దీన్ని నియంత్రించాలంటే స్వయం ప్రతిపత్తి గల అవినీతి నిరోధక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని అన్నారు. హాంకాంగ్ లాంటి దేశంలో ఇలాంటిది ఏర్పాటు చేసిన అవినీతిని నిర్మూలించగలిగారని అన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెయ్యిమంది విద్యార్థులు పోస్టుకార్డులను ప్రధానమంత్రికి పంపించారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నేతలు గట్టయ్య, వేణుమాధవ్, నాగేశ్వర్‌రావు, మూల్‌చంద్, శశికుమార్, రాకేష్, రమేష్, వాసుదేవరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రకాశం



### లోక్‌సత్తా పార్టీ కార్యాలయంపై దాడి అమానుషం

**ఒంగోలు :** తెలంగాణా జిల్లాలలోని లోక్‌సత్తా రాష్ట్ర కార్యాలయాల పై టిఆర్ఎస్ నాయకులు దాడిచేయడాన్ని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు అల్లు శివ రమేష్ రెడ్డి ఖండించారు. భారతదేశంలో ప్రతి వ్యక్తికి స్వేచ్ఛా హక్కులు ఉన్నాయని, ఎవరు ఎక్కడైనా తమ సమస్యలు వినిపించుకునే అధికారం, హక్కులు కలిగివుండటాన్ని మరచిన నాయకులు కార్యాలయాలపై దాడులు చేస్తూ గూండాగిరి ప్రదర్శించడం అమానుషమన్నారు.

### అవినీతి భూతం పట్టాలి

**ఒంగోలు :** అవినీతి అంతానికి విద్యార్థి దశ నుండి కృషి చేయాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు అల్లు శివరమేష్ రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక సూర్య విద్యానికేతన్‌లో అవినీతిపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా అవినీతి అంతానికి పాటుపడి దేశ భవిష్యత్తును కాపాడుతామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం చర్చి సెంటర్‌లో విఎన్‌జి పబ్లిక్ స్కూలు విద్యార్థులతో మానవహారం నిర్మించారు. అవినీతి భూతం దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటారి శ్రీనివాసరావు, నాయకులు నారాయణం రాధాదేవి, మహ్మద్ రఫీ, చప్పిడి రత్నకుమారి, జానకిరామ్, శివప్రసాద్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

> **చిన్న బెజ్జం పెద్ద నౌకనే ముంచగలదు**
> – థామస్ ఫుల్లర్

# కృష్ణా




**లోక్‌సత్తా పార్టీ సభ్యత్వ నమోదు**

**చుట్టుగుంట :** లోక్‌సత్తా పార్టీ అధ్వర్యంలో సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్ద పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా సత్తా అధ్యక్షురాలు నాగమణి మట్లాడుతూ 2జి స్పెక్ట్రమ్ కుంభకోణంలోను, కామన్ వెల్త్ ఆటల్లోను భారీగా జరిగిన అవినీతిని భవిష్యత్తులో జరగకుండా చూడాలని అన్నారు. అవినీతి గురించి ప్రధానికి పోస్టుకార్డుల ద్వారా తెలియచేసే ఉద్యమం చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ కార్యదర్శి వి.రాజమణి, అర్బన్ ఉపాధ్యక్షులు ఎన్.ఎం.డాంగే, పూర్ణచంద్రరావు, వి.వి.నాగేశ్వరరావు, గద్దం శివకుమార్‌లు పాల్గొన్నారు.

**నిధులు యాచిస్తున్న మునిసిపాలిటీలు**

**మచిలీపట్నం :** స్థానిక సంస్థలకు అధికారాలు బదిలీ లేని కారణంగా గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిధుల కోసం యాచించాల్సిన పరిస్థితులు దాపురించాయని సమాచార హక్కు చట్టం ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ ఎన్ నాగేంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలోని మూడు మహా నగరాలు మినహా మిగిలిన కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు సిబ్బందికి జీతాలు చెల్లించలేని స్థితిలో ఉన్నాయన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నుపాటి వజీర్ మాట్లాడుతూ, టిఆర్ఎస్ నాయకులు కేసీఆర్, కేటీఆర్‌లకు వ్యక్తిగత ప్రయోజనాలే ముఖ్యమని, వారి ఆగడాలను ప్రశ్నించిన వారిపై దాడులు చేయడం పరిపాటి అయిందన్నారు. జిల్లాలో 45వేల హెక్టార్లలో వరిపంట దెబ్బతిందని, బాధిత రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లోక్‌సత్తా నాయకులు పాపోలు ప్రమోద్ మాట్లాడుతూ విద్యార్థులు ధ్వంసం చేస్తున్న ప్రభుత్వ ఆస్తులు ప్రజలవే నన్న విషయాన్ని గుర్తించాలన్నారు.

**కేటీఆర్ భుజాలు తడుముకోవడం ఎందుకో!**

**విజయవాడ :** అసెంబ్లీలో లోక్‌సత్తా అధినేత, ఎమ్మెల్యే డాక్టర్ జయప్రకాష్‌నారాయణ్ వ్యాఖ్యలకు కేటీఆర్ భుజాలు తడుముకోవడం ఎందుకోనని జిల్లా లోక్‌సత్తా పార్టీ నాయకులు ప్రశ్నించారు. జయప్రకాష్‌నారాయణ్ ఒక ఉద్యమాన్నో... కొందరు వ్యక్తులను ఉద్దేశించి మాట్లాడలేదన్నారు. జిల్లా శాఖ, విజయవాడ అర్బన్ జిల్లా శాఖ నాయకులు డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య, చెన్నుపాటి వజీర్, చుండూరు రాజేంద్రప్రసాద్, వి.రాజమణి, కె.వి.పి.బసవేశ్వరరావు, ఎన్.ఎం.డాంగే, బి.సత్యనారాయణ, అనుమోలు గాంధీ, గోళ్ళ హరిబాబులు ఉన్నారు.

# గుంటూరు




**లోక్‌సత్తా పార్టీ పై దాడికి నిరసనగా మౌనప్రదర్శన**

**గుంటూరు :** తెలంగాణ జిల్లాలలోని లోక్‌సత్తా పార్టీ కార్యాలయాలపై టి.ఆర్.ఎస్. పార్టీ చేసిన దాడులకు నిరసనగా లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యాలయం నుండి లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు పార్టీ సభ్యులందరూ నోటికి నల్లగుడ్డలను కట్టుకొని కొవ్వొత్తులతో మౌన ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు ఓరుగంటి నారాయణరెడ్డి వేమూరు నియోజకవర్గ పార్టీ ప్రతినిధి జి.ఆనంద్, జిల్లా అధికార ప్రతినిధి యం.భానుప్రసాద్, నగర శాఖ ఉపాధ్యక్షులు సర్వశ్రీ షేక్ బషీర్, డాక్టర్ బి.సేవాకుమార్, వల్లూరి సదాశివరావు, ఎ.నాగేంద్ర, నగర ప్రధాన కార్యదర్శి కొండముది సాంబయ్య, జిల్లా యువసత్తా కార్యదర్శి జె.బి.సురేష్, నగరకార్యదర్శి యు.వి.సత్యనారాయణ, నగర యువసత్తా అధ్యక్షులు యం.శ్రీనాథ్‌రెడ్డి, కార్యదర్శి బి.హెచ్.వి.యస్.రాజు, రాజేశ్వరరావు, జిల్లా మహిళాసత్తా కార్యదర్శి కె. దుర్గాదేవి, అరవింద్, తెనాలి పట్టణ శాఖ అధ్యక్షులు ఈదర వెంకటనారాయణ, పొన్నూరు పట్టణ శాఖకు చెందిన నాయకులు కొసరాజు పార్థసారధి, సోమరౌతు వీరశేఖరరావు, రేపల్లె పట్టణశాఖ అధ్యక్షులు కె.గాంధీప్రసాద్, మహిళానాయకురాలు చందు హనుమాయమ్మ, చిలకలూరిపేట శాఖకు చెందిన నాయకులు భానుప్రసాద్, కామినేని అంజనేయులు తదితరులు అనేకమంది నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు.

**విత్తు నాటినవాడే ఫలాన్ని పొందాలి** – గురునానక్




**అవినీతిపై లోక్‌సత్తా పార్టీ ఉద్యమం**

**గుంటూరు :** 2జీ స్పెక్ట్రమ్ కామన్వెల్త్ క్రీడలలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ నగరలోక్‌సత్తా పార్టీ ఉపాధ్యక్షులు వల్లూరి సదాశివరావు ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి పేర పోస్టుకార్డు మనియార్డర్ ఉద్యమం చేపట్టింది. ప్రపంచ అవినీతి వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని 45వ డివిజన్‌లోని శ్రీనగర్‌లోని జె.జి.యస్. కళాశాలలో విద్యార్థిని విద్యార్థులచే కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఓ.నారాయణరెడ్డి, నగర అధ్యక్షులు డా.శరత్‌బాబు, నగర ప్రధాన కార్యదర్శి కొండముది సాంబయ్య, నగర కార్యదర్శి యు.వి.సత్యనారాయణ, యువసత్తా జిల్లా కార్యదర్శి వి.బి.సురేష్ అచ్చిరెడ్డి, దుర్గారావు, జె.జి.ఎస్.కళాశాల డైరెక్టర్ డానియేల్, అబ్రహాం, ఫాతిమాబీ, విద్యార్థినీ, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



**ఎంవోలతో లోక్‌సత్తా నిరసన**

**చిలకలూరిపేటటౌన్:** రాజకీయ నాయకులు వారి స్వప్రయోజనాలకోసం కారుచౌకగా కాంట్రాక్ట్‌లు ఇచ్చి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాదాసు భానుప్రసాద్ విమర్శించారు. స్పెక్ట్రమ్ కుంభకోణానికి వ్యతిరేకంగా లోక్‌సత్తా పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్త చలోపోస్టాఫీస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక లోక్‌సత్తా నాయకులు పట్టణంలోని ప్రధాన పోస్టాఫీస్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భానుప్రసాద్‌తో పాటు పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ జబ్బార్ మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజాధనాన్ని నష్టపరిచే కాంట్రాక్ట్‌లను రద్దు చేయాలని ఫారాలపై రాసి ప్రధానమంత్రికి ఎంఒగా రూపాయి పంపారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి మురికిపూడి ప్రసాద్, నూర్‌బాషా, మద్ది మహేష్, షేక్ ఖాదర్, ఎస్.వెంకటేశ్వర్లు, మదన్ తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్




**జమ్మికుంట :** 09-12-2010న లోక్‌సత్తా పార్టీ జిల్లా నాయకులు కొత్తూరి సాగర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం ర్యాలీ 2552 మందితో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి గాంధీ చౌరస్తా వరకు కొనసాగి, గాంధీ చౌరస్తా చుట్టూ మానవహారం ఏర్పడి "రాజకీయ అవినీతి అంతం లోక్‌సత్తా పంతం", "అసెంబ్లీలో అవినీతి నిరోధక బిల్లు ప్రవేశపెట్టాలి" అనే నినాదాలతో ఎమ్.ఆర్.ఓ. గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. జిల్లా పార్టీ నాయకులు కొత్తూరి సాగర్ మాట్లాడుతూ మరియు "అవినీతి నిరోధక బిల్లు" అసెంబ్లీలో ప్రవేశపెట్టాలి అని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బత్తుల సతీష్, రాంబాబు, ఆకారపు శ్రీనివాస్, శివ, చక్రధర్, భాస్కర్, రాజు, శ్రీను, ఆనంద్ మొదలైన వారు పాల్గొన్నారు.

## మెదక్




**యువసత్తా అవినీతి వ్యతిరేక దినం**

**సంగారెడ్డి :** యువసత్తా కార్యకర్తలు జిల్లా కేంద్రంలో అవినీతి వ్యతిరేక దినాన్ని నిర్వహించారు. అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక

దినం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని సంగారెడ్డిలో యువసత్తా కార్యకర్తలు నిర్వహించారు. పోస్టు కార్డు ద్వారా, ఈ మెయిల్స్ ద్వారా దేశంలో చోటు చేసుకుంటున్న అవినీతిని వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి యువసత్తా జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో మాధవరెడ్డి అఫ్రోజ్‌ఖాన్, ప్రవీణ్, పవన్, ప్రమోద్, మహేష్‌బాలాజీ, అర్జున్, విఠల్, తుకారాం రెడ్డి, లింగయ్య, సాయికిరణ్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లోక్‌సత్తా నేతల మౌన దీక్షలు



**సంగారెడ్డి టౌన్ :** టీఆర్ఎస్ నేతల వైఖరిని నిరసిస్తూ లోక్‌సత్తా పార్టీ నాయకులు పట్టణంలో నిరసన ప్రదర్శన నిర్వహించిన అనంతరం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద మౌన దీక్షలు చేపట్టారు. లోక్‌సత్తా పార్టీ అధినేత, ఎమ్మెల్యే జయప్రకాష్ నారాయణను తప్పు పడుతూ టీఆర్ఎస్ నేతలు చేస్తున్న రాద్ధాంతాన్ని వారు తీవ్రంగా ఖండించారు. అసెంబ్లీలో అనవసరంగా రాద్ధాంతం చేస్తూ గుమ్మడి కాయల దొంగ అంటే భుజాలు తడుముకుంటున్న చందంగా టీఆర్ఎస్ నేతల వైఖరి కొనసాగుతోందని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మాధవరెడ్డి, యువసత్తా అధ్యక్షుడు శ్రీధర్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అఫ్రోజ్‌ఖాన్, సాయికుమార్, శ్రావణ్‌కుమార్, అభిలాష్ రెడ్డి, ప్రవీణ్, లక్ష్మి పాల్గొన్నారు.

## జనం నోట - మనసు మాట

**అది చేస్తాం ఇది చేస్తాం అని**
**ఇస్తారు నాయకులు హామీలు**
**అందుకు సాక్షిగా వేస్తారు శిలాఫలకాలు**
**ఆ శిలాఫలకాలు శిలాప్రతిమలుగానే**
**నిల్చిపోతున్నాయి**
**రాజకీయ నాయకుల దొంగహామీలకు**
**నిలువెత్తు సాక్షులుగా**
**మిగిలిపోతున్నాయి.**

- నంద్యాల రామకృష్ణరాజు, పులివెందుల

# పశ్చిమగోదావరి




## పార్టీకార్యాలయంపై దాడులు అమానుషం

**సజ్జాపురం :** లోక్‌సత్తా పార్టీ అధ్యక్షులు జయప్రకాష్‌నారాయణ్ అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలకు తెలంగాణ జిల్లాల్లోని పార్టీ కార్యాలయాలపై టీఆర్ఎస్ చేసిన దాడులను తణుకు పట్టణ లోక్‌సత్తా పార్టీ తీవ్రంగా ఖండించింది. సజ్జాపురంలోని లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షురాలు ఎస్.మనోరమ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా మహిళసత్తా అధ్యక్షురాలు డాక్టర్ వి.సుబ్బలక్ష్మి, జిల్లా కన్వీనర్ శ్యామ్‌సుందర్, పట్టణ ఉపాధ్యక్షులు డాక్టర్ రామదాసు, పార్టీ సభ్యులు ఎం.ఎస్.కె.చైతన్య రాజశేఖర్, భగవాన్, శ్రీనివాసరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



## లోక్‌సత్తా అవినీతి వ్యతిరేక ప్రచారోద్యమం

**తణుకు :** అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం సందర్భంగా పట్టణ లోక్‌సత్తా పార్టీ కార్యనిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో అవినీతి వ్యతిరేక ప్రచారోద్యమం నిర్వహించారు. లోక్‌సత్తా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్.మనోరమ పార్టీ కార్యాలయం వద్ద ప్రచారోద్యమాన్ని ప్రారంభించి అవినీతి పరులను శిక్షించాలని లైసెన్సులు రద్దు చేసి కోట్లాది రూపాయిలను వెనక్కితీసుకోవాలని ప్రధాని మన్మోహన్ సింగ్‌ను డిమాండ్ చేస్తూ పోస్ట్‌కార్డు ఉద్యమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ఎమ్ఎస్‌కె చైతన్య, యువసత్తా నాయకుడు శివశంకర్, డాక్టర్ వల్లూరి సుబ్బలక్ష్మి,

జక్కంశెట్టి శ్యామసుందర్, బలజేపల్లి కిరణ్మయి, వి.ప్రశాంతి, పట్టణశాఖ అధ్యక్షుడు డాక్టర్ వంక వెంకట రామదాసు, న్యాయవాది యం. రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి



**పోస్టుకార్డుల ప్రచారానికి విశేష స్పందన**

**కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీ :** అవినీతి, కుంభకోణాలకు వ్యతిరేకంగా లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలో నిర్వహించిన జాతీయ ప్రచార ఉద్యమానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా 2జీ స్పెక్ట్రమ్ లైసెన్సుల కేటాయింపులో జరిగిన అవినీతిని ఎండగడుతూ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు పోస్టుకార్డుల ఉద్యమం బస్టాండ్‌లో చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అవినీతిపరుల పై చర్యలు తీసుకోవాలని, నష్టపోయిన సొమ్మును తిరిగి రాబట్టాలని కోరుతూ పోస్టుకార్డులు రాసి ప్రధానమంత్రి కార్యాలయానికి పంపారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ ఇన్‌చార్జి కొమ్ము సత్తయ్య, నాయకులు రాజా, నారాయణ, భవాని తదితరులు పాల్గొన్నారు.



**2-జీస్పెక్ట్రమ్ పై కొనసాగుతున్న లోక్‌సత్తా పోస్టుకార్డు ఉద్యమం**

**బాలానగర్ :** 2-జీ స్పెక్ట్రమ్ అవినీతి కుంభకోణంపై వ్యతిరేక ప్రచార ఉద్యమాన్ని లోక్‌సత్తా చేపట్టింది. బాలానగర్ శోభన సెంటర్‌లో నిర్వహించిన పోస్టుకార్డు ఉద్యమ కార్యక్రమానికి యువకులు, మహిళలు, సీనియర్ సిటిజన్లు తదితరుల నుంచి విశేష స్పందన లభించింది. పార్టీ నేతలు ముందుగా కుంభకోణాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. దీనికి ఉత్సాహంగా స్పందించిన ప్రజలు దీనికి వ్యతిరేకంగా పోస్టుకార్డులు రాశారు. తమ సందేశాలను పోస్టుకార్డుల ద్వారా ప్రధాన మంత్రికి ఎంతో ఆసక్తితో పంపడం గమనార్హం. 2-జి స్పెక్ట్రమ్ లైసెన్సులు రద్దు చేయాలని, అంతర్జాతీయ పోటీ బిడ్డింగ్ ద్వారా కొత్త వారికి కేటాయించాలని, ఈ కుంభకోణంతో సంబంధం ఉన్న వారిని కఠినంగా శిక్షించాలని, నష్టపోయిన సొమ్మును తిరిగి రాబట్టాలని, భవిష్యత్తులో ఇలాంటి కుంభకోణాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లోక్‌సత్తా పార్టీ పాత బోయిన్‌పల్లి డివిజన్ నేతలు సత్యనారాయణ, ఉపేందర్ రెడ్డి, రాజిరెడ్డి, చంద్రశేఖర్, నారాయణ, కృష్ణారెడ్డి, ఆంజనేయులు, రవికుమార్‌రెడ్డి, క్రాంతి, గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్

**బాన్సువాడ :** స్వతంత్ర గ్రామ రైతు ఐక్యవేదికల ఏర్పాటుకై తేది 6-12-2010 నుండి 10-12-2010 వరకు బాన్సువాడ నియోజకవర్గంలోని **బీర్కూర్ మండలంలోని** బైరాపూర్, మిర్జాపూర్, దామరంచ, రైతునగర్, కిష్టాపూర్ గ్రామాలు, **బాన్సువాడ మండలంలోని** చిన్న రాంపూర్, దేశాయిపేట్, బుడ్మి, తిర్మలాపూర్ సోమేశ్వరం, తాడ్కోల్ గ్రామాలు, **వర్ని మండలంలోని** వర్ని, అక్బర్‌నగర్, అంబం, శ్రీనగర్, తగిలేపల్లి గ్రామాలు, **కోటగిరి మండలంలోని** రాయ్‌కూర్ గ్రామం - మొత్తం 17 గ్రామాల్లో ఉద్యమ యాత్రను చేపట్టడం జరిగింది. దీని ఉద్దేశం వెనక రైతులను కులం, మతం, ప్రాంతం పార్టీలు పంటలకు అతీతంగా సంఘటితం చేయడానికి గ్రామాల్లో చర్చకు తెర తీసింది లోక్‌సత్తా. గ్రామాల్లో వెళ్ళే నాటికే గ్రామాల్లో జి.ఓ. ఎమ్.ఎస్. 58 వలన దేశంలో ఎక్కడైనా అమ్ముకోవచ్చు అనేది సాధించింది లోక్‌సత్తా వల్లనే అని చర్చ జరిగింది. మనం వెళ్ళడం వలన ఇంకా అది బలపడింది. అన్ని గ్రామాల్లో దాదాపు 18-20 మంది రైతులు, యువత ముందుకు వచ్చారు. గ్రామాల్లో కమిటీ ఏర్పాటు చేసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్ కోటగిరి మండలం, వి.వి.ప్రసాద్ (జనవిజ్ఞాన వేదిక) వర్ని, సాయిలు అబ్బాస్, బాలరాజు, సాయి, సుదర్శన్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంతో పాటు అవినీతి వ్యతిరేక ఉద్యమాన్ని ఈ గ్రామాల్లో పోస్టుకార్డు ద్వారా ప్రధానమంత్రికి వ్రాయించాము. 2జి స్పెక్ట్రం గురించి చెప్పడం జరిగింది. బాన్సువాడ నియోజకవర్గంలోని కొత్తాబాద్ జెడ్‌పిహెచ్‌ఎస్ స్కూల్లో అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వారు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి కే. గీతామూర్తి వెళ్ళడం జరిగింది. ఆ రోజు ఆ స్కూల్ వారు సమాజంలో నీతివంతంగా పనిచేసిన, చేస్తున్న వారికి సన్మానం చేయడం జరిగింది. ఈకార్యక్రమానికి ఎ.కె లత, దొడ్ల శేఖర్, సాయిలు, అబ్బాస్, సుదర్శన్, రాము తదితరులు హాజరయ్యారు.❑





# నిజామాబాద్ జిల్లాలో









## లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కే. గీతామూర్తి క్షేత్ర పర్యటన





RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2010-12




To,

Book-Post
PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times

H.No. 5-10-180/A&A1,
Band Lanes, Hill Fort Road,
Hyderabad- 500 004.

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad